ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్రమాసం, తిథి: శుద్ధ పంచమి మ.2.10 వరకు అనంతరం షష్ఠి; నక్షత్రం: కృత్తిక సా. 6.30 వరకు, అనంతరం రోహిణి; అమృతకాలం: సా. 4.15 నుండి 5.45 వరకు; వర్జ్యం: ఉ. 6.59 నుండి 8.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.45 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 7.30 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక: 340 • గురువారం 22 మార్చి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



బెస్ట్ ఆఫ్ లివింగ్ సిటీగా

హైదరాబాద్

తక్కువ నేరాలు.. ఆహ్లాదకర వాతావరణమే కారణం

వరుసగా నాల్గోసారి ఎంపిక

మండలిలో కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో బెస్ట్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ సిటీగా హైదరాబాద్ జాతీయ స్థాయిలో నాలుగో ఏడాది ఘనతను సొంతం చేసుకుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. మెర్సర్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ సర్వే-2018 అంతర్జాతీయ సంస్థ తన నివేదికలో హైదరాబాద్‌కు అత్యుత్తమ రేటింగ్‌ఇు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతలు, మౌలిక వసతులు, భద్రత, సౌకర్యాలు, ఇతర వనరుల కల్పనలో ప్రమాణాలు అద్భుతంగా ఉన్నాయని ఈ సంస్థ గుర్తించిందని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆధునిక బస్ షెల్టర్లకు ప్రభుత్వం పనులను ప్రారంభించిందని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ➪ 5వ పేజీలో...

వహ్ తాబ్...

ఒళ్లో పసికందుతో పరీక్ష హాల్లో ఓ ఆఫ్ఘన్ తల్లి!

కాబూల్: పసికందుకు స్తన్యమిస్తూ, పరీక్ష రాస్తున్న ఆఫ్ఘనిస్తాన్ మహిళ ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆ చిత్రాన్ని చూసిన యావత్ ప్రపంచం మేటి మహిళ అంటూ ఆమెకు జేజేలు పలుకుతోంది. ఈ అద్భుత దృశ్యం ఆఫ్ఘనిస్తాన్‌లోని డేకుండి ప్రావిన్స్‌లోని కనిపించింది. ఇంతకీ ఆ ఫొటో వెనుకకథ ఏమిటంటే.. 25 ఏళ్ల జహాన్ తాబ్ అనే యువతి నిల్లి సిటీలో నిర్వహిస్తున్న సోషల్ సైన్సెస్ పరీక్షకు హాజరైంది. తనవెంట రెండు నెలల ➪ 5వ పేజీలో...



ఆఫ్ఘనిస్తాన్... కల్లోలిత దేశం. ఓ వంక భవిష్యత్తు వైపు యువత చూపులు.. మరో వంక బాంబుల దాడులు.. బుధవారం ఈ విచిత్ర పరిస్థితికి దర్పణమే ఈ రెండు దృశ్యాలు!

ఐసిస్ దాడి

కాబూల్ వర్సిటీ దగ్గరలో ఆత్మాహుతి దాడి

29మంది మృతి

న్యూఢిల్లీ: కాబూల్‌లో బుధవారం జరిగిన ఐసిస్ ఆత్మాహుతి దాడిలో 29 మంది అక్కడికక్కడే మృతి చెందగా మరో 18 మంది గాయపడినట్టు అధికార వర్గాలు తెలిపాయి. పర్షియన్ కొత్త సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని కాబూల్‌లోని షియా ప్రార్థనా మందిరం వద్ద నవ్‌రజ్ సెలవు దినాన్ని జరుపుకుంటుండగా ఐసిస్ ఆత్మాహుతి బృందానికి చెందిన సభ్యుడు తనను ➪ 3వ పేజీలో...



మనది ముమ్మాటికీ ధనిక రాష్ట్రమే



బుధవారం ఎమ్మెల్సీలతో జూబ్లీహాల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్

రాష్ట్ర రెవెన్యూలో 22% వృద్ధి

నిధులుంటేనే ప్రగతి సాధ్యం

అభివృద్ధి కోసమే అప్పులు

మండలిలో సీఎం కేసీఆర్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ ముమ్మాటికీ ధనిక రాష్ట్రమేనని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్నారు. రాష్ట్ర రెవిన్యూలో 22 శాతం అభివృద్ధి సాధించామని, అభివృద్ధి కోసం అప్పులు చేయడం సర్వ సాధారణం అని సీఎం కేసీఆర్ శాసన మండలిలో చెప్పారు. బడ్జెట్‌పై చర్చకు ముఖ్యమంత్రి బుధవారం మండలిలో సమాధానం ఇచ్చారు. ప్రతిపక్ష సభ్యులు బడ్జెట్‌ను అవగాహన చేసుకొని విశ్లేషణాత్మకంగా మాట్లాడే పరిణతి రావాలి తప్ప బడ్జెట్ చప్పగా ఉంది... అంకెల గారడి అంటూ విమర్శలు చేయడం సరికాదన్నారు. బడ్జెట్ ప్రవేశ పెడితే విమర్శలు చేయడం ప్రతిపక్షాలకు రివాజుగా మారిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అప్పులు తప్పు కాదని సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో, దేశంలో అప్పులు కొత్త కావని స్పష్టం చేశారు. 1956నుంచే అప్పుల వ్యవస్థ నడుస్తోందన్నారు. రాష్ట్రం కంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులే ఎక్కువని ఆయన వ్యాఖ్యానించారు. 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపి పాలిత రాష్ట్రం ఏదైనా అప్పు లేకుండా ఉందా...? ➪ 3వ పేజీలో...

మండలి వసతులపై అసహనం

తన ఛాంబర్‌ను మార్చాలని సీఎం ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనమండలిలో వసతులపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి కార్యకలాపాలు నిర్వహించిన భవనం ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు బదలాయించగా, ముఖ్యమంత్రి కెసిఆర్ తొలిసారి బుధవారం ఈ శాసనమండలిని సందర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన సిఎం కెసిఆర్‌కు మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వరరెడ్డిలు ఆయనను ఘనంగా స్వాగతించారు. అనంతరం తనకు కేటాయించిన ఛాంబర్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి ➪ 3వ పేజీలో...



తెలుగును వదిలేసే స్కూళ్లపై క్రిమినల్ కేసులే!

గుర్తింపూ రద్దు చేస్తారు • తెలుగు నేర్చుకోకుంటే ప్రవేశం రద్దు • ఇంటర్నేషనల్ స్కూళ్లకూ వర్తింపు • కేంద్రీయ విద్యాలయాల్లో కూడా • కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయం • విధివిధానాలపై సర్కార్ కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. ఇందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తున్న ప్రభుత్వం అందులో కీలకాంశాలను పొందుపరచాలని నిర్ణయించింది. తెలుగు భాషను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరించే పాఠశాలలపై కొరడా ఝుళిపించాలని ప్రతిపాదించింది. ఖచ్చితంగా ప్రతి పాఠశాలలో తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని ఒక సబ్జెక్టు తెలుగు ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకునే విధంగా మార్గదర్శకాలు సిద్ధమవుతున్నాయి. ఏ పాఠశాల యాజమాన్యమైనా తెలుగు భాషను అగౌరపరిచి ఈ భాషకు ప్రాధాన్యత దక్కకుండా వ్యవహరిస్తే వెంటనే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు బనాయించేలా చట్టంలో పొందుపరచాలని, ఆ పాఠశాల అనుబంధ గుర్తింపును రద్దు చేయడంతో పాటు అందులో చదువుతున్న విద్యార్థులను సమీపంలోని మరో పాఠశాలకు బదిలీ చేసేవిధంగా చట్టాన్ని తీసుకురావాలని భావిస్తున్నట్టు సమాచారం.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని మిగతా 27 జిల్లాల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలలతో పాటు కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు పని చేస్తున్న సంగతి తెలిసిందే. సీబీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ బోర్డుల గుర్తింపుతో రాష్ట్రంలో వందలాది పాఠశాలలు నడుస్తున్నాయని ఈ పాఠశాలల యాజమాన్యాలన్నీ తెలుగును ఇప్పటిదాకా ఏమాత్రం పట్టించుకోకుండా హిందీ, సంస్కృతంతో పాటు ఇతర విదేశీ భాషలతో తరగతులు నిర్వహిస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పదవ తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, సైనికస్కూళ్ళలోనూ అమలు చేయాలని ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాయాలని నిర్ణయించినట్టు సమాచారం. తెలుగు భాసను తప్పనిసరి చేస్తూ తీసుకువస్తున్న చట్ట రూపకల్పనకు సంబంధించి పెద్దఎత్తున కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో పర్యటించి వచ్చిన విద్యావేత్తలు, అధికారుల బృందాలు ఆయా ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో మాతృభాషను తప్పనిసరిచేస్తూ జారీచేసిన ఉత్తర్వులు, తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌లను ➪ 7వ పేజీలో...



బీఎస్పీకి షాక్!



ఎత్తుకు పైఎత్తు వేసిన అమిత్ షా • అఖిలేష్‌తో భేటీకి ఏడుగురు ఎమ్మెల్యేలు డుమ్మా • 24 గంటల్లో పరిస్థితి తారుమారు • యూపీలో రాజ్యసభ పోరు రసవత్తరం 10

రేపే రాజ్యసభ ఎన్నికలు

అభ్యర్థుల్లో అత్యంత సంపన్నుడు మహేంద్ర ప్రసాద్ (బీహార్)... ఆస్తి రూ.4078 కోట్లు

అచ్యుతానంద సమనంత (ఒడిషా)... అతితక్కువ ఆస్తి రూ.4 లక్షలు

వివరాలు 11లో...

రాజకీయ ఫేస్‌బుక్!

ఖాతాదారుల వివరాల లీక్‌తో అస్థిత్వ ప్రమాదం

రాజకీయ పార్టీల గొంతులో పచ్చివెలక్కాయ

ట్రంప్ ఎన్నికలకు ఫేస్‌బుక్ సమాచారం

మనదేశంలో 20కోట్ల మంది సభ్యులు

అకౌంట్ వెల్లడిస్తే శిక్ష తప్పదని భారత్ హెచ్చరిక



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నికల ప్రచార విధానాల్లో కూడా మార్పులొచ్చేశాయి. సామాజిక మాధ్యమాలే ఇప్పుడు ఈ ప్రచారంలో కీలకంగా మారాయి. గతంలో అభ్యర్థులు, పార్టీల నాయకులు ఇంటింటికి తిరిగి తమ లక్ష్యాలు వివరించేవారు. తమ భవిష్యత్ కార్యాచరణను విశదీకరించేవారు. వ్యక్తులే ప్రాతిపదికగా హామీలు గుప్పించి ఓట్లు అభ్యర్థించేవారు. రాన్రాను సాంకేతికత అభివృద్ధి చెందింది. అమెరికా, యూరోప్ దేశాల్లో టీవీల ద్వారా ప్రచారం జోరందుకుంది. అభ్యర్థుల మధ్య వాదోపవాదాలు, పరస్పర ఆరోపణలు, హామీల ఘట్టాలన్నింటికి టీవీ స్టూడియోలే వేదికలుగా మారాయి. దాదాపు 80శాతం ప్రచారం టీవీలు, రేడియోలు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారానే జరిగేది. ఇప్పుడు సామాజిక మాధ్యమాలు ప్రవేశించాయి. ఇవి టీవీలు, ఇతర ప్రచార, ప్రసార మాధ్యమాల్ని కూడా వెనక్కి నెట్టేశాయి. గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో సామాజిక మాధ్యమాలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాయి. వ్యక్తుల వద్దకు చేరేందుకు ఇవి సులువైన మార్గాలుగా అవతరించాయి. ఇతర మాధ్యమాలతో పోలిస్తే వ్యయం తక్కువ.. వేగం ఎక్కువ. చెప్పాలనుకున్న అంశాన్ని క్లుప్తంగానే కాకుండా విపులంగా కూడా విశదీకరించే అవకాశం ఈ సామాజిక మాధ్యమాల ద్వారా అందుబాటులోకొచ్చింది. రష్యా ఎన్నికల్లో కూడా సామాజిక మాధ్యమాలు కీలకపాత్ర పోషించాయి. ఇటీవల జరిగిన జర్మనీ ఎన్నికల్లోనూ ప్రచారం అధికంగా సామాజిక మాధ్యమాల ద్వారానే సాగింది. ఇప్పుడు ➪ 3వ పేజీలో...

కనిష్క్ గోల్డ్ 14 బ్యాంకులకు కుచ్చుటోపీ



రూ.824 కోట్లు హాంఫట్

• సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు.. కేసు నమోదు • కంపెనీ కార్యాలయాల్లో సోదాలు • ప్రమోటర్ల నివాసాల్లో తనిఖీలు



ప్రమోటర్, డైరెక్టర్ భూపేష్ కుమార్ జైన్

న్యూఢిల్లీ: రూ.824.15 కోట్ల రుణ కుంభకోణానికి సంబంధించి చెన్నయ్‌కు చెందిన కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్‌పై సిబిఐ కేసు నమోదు చేసింది. భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బిఐ) నేతృత్వంలో 14 బ్యాంకులతో కూడిన ఒక సహ వ్యవస్థ మోసానికి గురైందని అధికారులు తెలిపారు. 14 బ్యాంకుల సహ వ్యవస్థ తరపున ఎస్‌బిఐ చేసిన ఒక ఫిర్యాదు ప్రాతిపదికగా సిబిఐ కేసు నమోదు చేసిందని వెల్లడించారు. కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రమోటర్లకు చెందిన అధికార, ఆవాస ప్రాంగణాల్లో సిబిఐ బుధవారం సోదాలు చేపట్టిందని వారు తెలిపారు. స్వర్ణాభరణాలను తయారుచేస్తున్న కంపెనీ క్రిజ్ బ్రాండ్ నేమ్‌తో వాటిని మార్కెటింగ్ చేస్తున్నది. అది 2104 దాకా పంపిణీదారుల ద్వారా విక్రయాలు జరిపేది. 2015లో బి2బి(బిజినెస్-టు-బిజినెస్) బిజినెస్ మోడల్‌కు మారింది. అతిపెద్ద చిల్లర ఆభరణాల వర్తకులకు సరఫరా చేయసాగింది అని సిబిఐకి చేసిన ఫిర్యాదులో ఎస్‌బిఐ ➪ 5వ పేజీలో...

ఔరా..!



మా డిమాండ్ వదిలేది లేదు

లోక్‌సభ స్పీకర్‌కు తెరాస ఎంపీల స్పష్టీకరణ

నాలుగో రోజూ పార్లమెంట్‌లో అదే తీరు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పట్టిన పట్టు విడవట్లేదు. నిరసన విషయంలో రాజీ ప్రసక్తే లేదు. కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధించకుండా వదలట్లేదు. తెరాస వంతు... రోజూ అదే తంతు. విభజన హామీలు, రాష్ట్రాలకు రిజర్వేషన్ల అంశంపై ఎంపీలు బుధవారం కూడా పార్లమెంట్ ప్రాంగణంలో ఆందోళన సాగించారు. ఒక ప్రణాళిక ప్రకారమే బీజేపీ సభలను వాయిదా వేస్తోందని వారు మండిపడ్డారు. తాము ప్రభుత్వమిచ్చే జీతం కోసం పని చేయట్లేదని, ప్రజా సమస్యల కోసం ➪ 7వ పేజీలో...



బుధవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌తో తెరాస ఎంపీల భేటీ

నానమ్మ అడుగుజాడల్లో రాహుల్

ఇందిర మాదిరి సెంటిమెంట్ బాటలో కాంగ్రెస్ నేత

చిక్‌మగళూరులో పర్యటన

శృంగేరీ పీఠం సందర్శన

వివరాలు 2లో...



శృంగేరీ పీఠంలో జగద్గురు శంకరాచార్య సన్నిధిలో రాహుల్ గాంధీ



చంద్రుడిపై ఇగ్లూ ఇళ్లు

• సరికొత్త నిర్మాణాలకు ఇస్రో అధ్యయనం

న్యూఢిల్లీ: వ్యోమగాముల సురక్షిత ఆవాసాల కోసం చంద్రమండలంపై ఇగ్లూ తరహా నిర్మాణాలపై భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అధ్యయనాలు చేస్తున్నది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేసింది. పుటాకార ఉపరితల డోమ్ ఆకారంలో, ఇంచుమించు ఇగ్లూ తరహాలో ఆవాసాలు నిర్మించడం ద్వారా, అసమతుల్య పీడన వాతావరణంలో వ్యోమగాముల నివాసం సౌకర్యంగా, సురక్షితమని ఇస్రో భావిస్తున్నది. ఇగ్లూ గృహాల్లో విపరీత హెచ్చుతగ్గులను ఎదుర్కొనేందుకు ఇగ్లూ నమూనా శ్రేయస్కరమని ఆలోచిస్తున్నది. ఈ మేరకు దేశీయ విద్యాసంస్థలతో కలిసి ఇస్రో అధ్యయనం చేస్తున్నది అని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఇగ్లూ కోసం ఏమేం కావాలి? ఆవాసాల సంక్లిష్టతలు ఏమిటి? తదితర అంశాలపై లోతైన అధ్యయనం జరుగుతోందని మంత్రి చెప్పారు. చంద్రయాన్ -2లో భాగంగా హైటెక్ రోవర్‌ను చంద్ర మండలం దక్షిణ ధ్రువం వద్దకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. దాని ద్వారా నమూనాలను సేకరించాలని చూస్తోంది. ఈ ప్రయత్నాలు సఫలమైతే, భవిష్యత్ లో అక్కడకు చేరుకునే భారతీయ వ్యోమగాములకు సురక్షిత ఆవాసాలు అందుబాటులోకి వచ్చినట్లే. 2008లో ఇస్రో చంద్రయాన్-1ను ప్రయోగించింది. అయితే ఈ ప్రయోగం శాస్త్రవేత్తల నిరుత్సాహానికి గురిచేసింది. కాగా, గతేడాది, నాసా శాస్త్రవేత్తలు చంద్రుడిపైకి పంపిన అంతరిక్ష నౌక విజయవంతంగా కక్ష్యలో చేరింది. చంద్రుడి ఉపరితలానికి 200 కిమీపైన చక్కర్లు కొడుతోంది.

రెండు గంటల్లో బీజింగ్ టు న్యూయార్క్



బీజింగ్: మౌలికరంగానికి సాంకేతికపరిజ్ఞాన్ని జోడించి ఆకాశమే హద్దు గా దూసుకెళ్తున్న చైనా మరో అద్భుతాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. ప్రపంచం లోనే అత్యంత వేగవంతమైన హైపర్ సోని క్ వాయు సొరంగ నిర్మాణాన్ని చేపట్టింది. తద్వారా కొత్తతరం సూపర్ ఫాస్ట్ విమానాల అభివృద్ధికి బాటలు వేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, బీజింగ్ నుంచి రెండు గంటల వ్యవ ధిలోనే న్యూయార్క్ చేరుకోవచ్చని చైనా అధికారిక మీడియా వెల్లడించింది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 13 గంటల సమయం పడుతున్నది. ఐ ప్లేన్ మోడల్ ద్వారా, 265 మీటర్ల పొడవైన ఈ సొరంగ మార్గం గుండా, ధ్వనివేగాని కంటే 25 రెట్లు వేగంగా ప్రయాణిం చొచ్చని చైనీస్ అకాడమీ సైన్స్ ముఖ్య పరిశోధకుడు హన్‌గు య్‌లయ్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న వాయు సొరం గం ధ్వనివేగానికి 5-9 రెట్లు అధికవేగానికి మాత్రమే సరిపోతుందని, కొత్త ఆవిష్కరణ దీనికి నాలుగు రెట్లు అధికమని చెప్పారు. నెల రోజుల కిందటే చైనా సైన్స్ జర్నల్‌లో ఈ అంశంపై ప్రత్యేక వ్యాసం ప్రచురించింది. ఈ నూతన ప్రయోగంతో, వాయు సొరంగాల నిర్మాణంలో ప్రపం చంపై ఆధి పత్యం చైనాకు లభిం చి నట్లు అవుతుంది. పర్యా వరణ హైపర్‌సోనిక్ ఫైట్ల తరహా ఇంజినీరింగ్ అప్లికేషన్లను పరిశీలి స్తు న్నారు. ఒకసారి ఈ అంశంపై స్పష్టత లభించి నట్లయితే, ప్రయోగాత్మక ఫైట్లకు లైన్ క్లియర్ లభిస్తుంది.

టాయ్ ట్రైన్‌కు కొత్త హంగులు



సుంకా (డార్జిలింగ్): వందేళ్ల చరిత్ర కలిగిన డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే (డీహెచ్‌ఆర్) వారసత్వ విలువల పునరుద్ధరణకు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని బుధవారం రైల్వేబోర్డు చైర్మన్ అశ్వని లోహాని చెప్పారు. న్యూ జగల్పురి మైదానాల గుండి 2000 మీటర్ల ఎత్తుకు ప్రయాణికులను చేరవేస్తున్న టాయ్‌ట్రైన్‌కు అదనపు బోగీలతోపాటు, ఏసీ బోగీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు ఇది దోహదం చేస్తుందని అన్నారు. ఇండియాలో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన తొలి మార్గంగా డీహెచ్‌ఆర్ నిలిచిందని గుర్తుచేశారు. 1999లోనే యునెస్కో హెరిటేజ్ గుర్తింపు ఇచ్చిందన్నారు. 1979 -81 మధ్య కాలంలో నిర్మించిన టాయ్‌ట్రైన్‌కు జిగ్‌జాగ్-లూప్‌లైన్ టెక్నాలజీ ప్రస్తుతం అవరోధంగా మారింది. ఈ రైలు 12 స్టేషన్లగుండా 88 కి.మీ మేర ప్రయాణికులకు సేవలు అందిస్తున్నది.

నానమ్మ అడుగుజాడల్లో రాహుల్

• చిక్‌మగళూర్‌లో పర్యటించిన కాంగ్రెస్ అధినేత

• ఇందిరకు సెంటిమెంట్ నియోజక వర్గంగా గుర్తింపు



బెంగళూరు: ఇటీవలే పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సెంటిమెంట్లను ఫాలో అవుతున్నట్లు కనిపిస్తోంది. రానున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చిక్‌మగళూర్‌లో పర్యటించడం సెంటిమెంట్ ప్రభావంగా పేర్కొంటున్నారు. రాహుల్ శారదాపీఠంలోని శారదాంబ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి మఠం సభ్యులను కలుసుకున్నారు. శారదా పీఠంలో జగద్గురు శంకరాచార్యతో కొద్దిసేపు మాట్లాడారు. తర్వాత వేదపాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. 1978కి ముందు ఇందిరా గాంధీ పర్యటన కూడా సరిగ్గా ఇలాగే సాగింది. అక్కడి నుంచి ఆమె రాజకీయ జీవితం దశ తిరిగింది. ఎమర్జెన్సీ పరిణామాలతో కాంగ్రెస్‌పార్టీ కోలుకోలేని దెబ్బతిన్నది. స్వయంగా ఇందిర పార్లమెంటు సీటును కోల్పోవాల్సి వచ్చింది. అలాంటి దశలో చిక్‌మగళూరు పర్యటన కాంగ్రెస్‌తోపాటు ఇందిర భాగ్యరేఖను మార్చివేసింది. ఇక్కడి నుంచి పోటీచేసిన ఇందిర పార్లమెంటులోకి అడుగుపెట్టింది. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ మళ్లీ అలాంటి సంక్లిష్టదశను ఎదుర్కొంటున్నది. 2014 తర్వాత జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం పంజాబ్‌లో మాత్రమే అధికారాన్ని దక్కించుకుంది. మిగతా అన్నిచోట్లా పరాభవమే మిగిలింది. గోవా, మహారాష్ట్రలో పెద్దపార్టీగా అవతరించినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక చతికిలబడింది. ఈ క్రమంలో త్వరలో జరగనున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రాహుల్ తోపాటు కాంగ్రెస్ భవితవ్యానికి కీలకంగా మారాయి. ఈమధ్య కాలంలో కర్నాటకలో పర్యటించడం రాహుల్‌కు ఇది మూడోసారి.

పాతబస్తీలో మరింత అభివృద్ధి



• చార్మినార్ అభివృద్ధి, పురోగతిపై చర్చ

• మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

• మెట్రో పనుల పూర్తికి కట్టుబడి ఉన్నాం

• మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతోందని పురపాలకశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. అసెంబ్లీ హాల్‌లో పాతబస్తీ ఎమ్మెల్యేలతో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. పాత బస్తీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మంత్రి సమీక్షించారు. హైదరాబాద్ నగరానికి చారిత్రక చిహ్నమైన చార్మినార్‌ను సంరక్షించేందుకు చేపట్టిన చార్మినార్ పెడెస్ట్రియ్ ప్రాజెక్టుపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చార్మినార్‌కు సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడ పౌర సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. టాయ్‌లెట్లు, వాటర్ కియోస్కులు, మహిళల కోసం ప్రత్యేకంగా షీ టాయ్‌లెట్లు, పార్కింగ్ సదుపాయాల కల్పన వెంటనే చేపట్టాలన్నారు. చార్మినార్ పెడెస్ట్రియన్ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు అక్కడి వీధుల్లో చేపట్టాల్సిన (ఫాసాడ్ డవలప్‌మెంట్)పై ఈ సమావేశంలో చర్చించారు. ఈ ఫాసాడ్ అభివృద్ధి కోసం రూపొందించిన పలు డిజైన్లు పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు జిహెచ్‌ఎంసిలోని ఒక ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. చార్మినార్‌కు ఉన్న ద్వారాల మాదిరి డిజైన్లను అక్కడి వీధుల అభివృద్ధి (ఫాసాడ్)లోనే ఉపయోగించినట్లు డిజైనర్లు తెలిపారు. ఈ ఫాసాడ్ డవలప్‌మెంట్ ద్వారా వీధుల్లోని దుకాణాలు, సైన్‌బోర్డుల్లో ఏకరూపకత తీసుకువచ్చేందుకు వీలు కలుగుతుందన్నారు. పాతబస్తీలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనుల్లో చారిత్రక డెక్కన్ ఆర్కిటెక్చర్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు డిజైన్లు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా త్వరలో చేపట్టనున్న మూసీ నది సుందరీకరణ, అభివృద్ధి ప్రణాళిల్లో ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీపైన నిర్మించనున్న వంతెనలను నయాపూల్ వంతెన మాదిరి డిజైన్లు చేయాలన్నారు.

పాతబస్తీలోని రోడ్ల అభివృద్ధి, జలమండలి పనులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. జలమండలి ద్వారా రానున్న వేసవి కాలం కోసం కనీసం 5 ఎంజిడి నీటిని అదనంగా సరఫరా చేయాలని ఎమ్మెల్యేలు మంత్రిని కోరారు. ఈ మేరకు జలమండలి అధికారులను మంత్రి అదనపు సరఫరా కోసం ఆదేశించారు. మొజాంజాహి మార్కెట్ అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌కు ప్రత్యేకంగా తీసుకోవాలని మంత్రి కోరారు. దీంతోపాటు తక్కువ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు టియుఎఫ్ ఐడిసి కార్పొరేషన్ ద్వారా నిధులు ఇస్తామని మంత్రి తెలిపారు. పాతబస్తీకి మెట్రో కనెక్టివిటీపై ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు మంత్రితో చర్చించారు. పాతబస్తీలో వెంటనే మెట్రో పనులు ప్రారంభించాలని కోరారు. పాతబస్తీలో ప్రభుత్వం మెట్రోని పూర్తిచేసేందుకు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. దీంతోపాటు నాగోల్ నుంచి ఫలక్‌నుమా వరకు, ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో మార్గాలను భవిష్యత్తు ప్రణాళిల్లో ఉంచాలని వారు మంత్రి కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా హామీ ఇచ్చారు.

డ్రగ్స్ ఎగుమతులపై కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డ్రగ్స్, కాస్మోటిక్స్ ఎగుమతులకు సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ నుంచి ఎన్‌వోసీ అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటీ రామారావు స్వాగతించారు. ఇటీవల జరిగిన బయో ఏసియా సదస్సు సందర్భంగా ఆయన చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం స్పందించి ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ ఫార్మా, వ్యాక్సిన్ ఉత్పత్తుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఔషధాలు, మెడికల్ డివైజెస్ ఎగుమతులు గణనీయంగా పెరుగేతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బయో ఏసియా సదస్సులో 12 అంశాలతో కూడిన సిఫారసుల జాబితాను కేంద్రానికి ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మాక్ పోలింగ్

• మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ పక్కాగా నిర్వహించుకునేందుకు టిఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి కడియంశ్రీహరి ఆధ్వర్యంలో ఈ మాక్‌పోలింగ్ నిర్వహించగా.. మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరై ఓటేశారు. హరీష్‌రావు, తుమ్మలనాగేశ్వరరావు, ఈటల రాజేందర్, డాక్టర్ లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి తదితర మంత్రులంతా పోలింగ్‌లో పాల్గొన్నారు.

దేశం చూపుతిప్పేలా గులాబీ ప్లీనరీ

• సంచలన తీర్మానాలకు సిద్ధమవుతున్న తెరాస

• ప్రజలను ఏకీకృతం చేసేలా పథకాలు, ఆలోచనలు

• మేథోమథనం చేస్తున్న గులాబీ దళపతి కేసీఆర్

• సిక్స్‌పాయింట్ ఫార్ములా ప్రకటించే అవకాశం

• ఏప్రిల్ 24 లేదా 27న ఆవిర్భావ వేడుక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రసమితి 17వ ప్లీనరీని అదిరిపోయేలా.. దేశం తెలంగాణ వైపు, టిఆర్‌ఎస్ అడుగుల వైపు ఆసక్తిగా చూసేలా చేసేందుకు కార్యాచరణ సిద్దం చేస్తున్నారు. గత ఏడాది టిఆర్‌ఎస్ ఆవిర్భావవేడుకకు సంబంధించిన ప్లీనరీని హైదరాబాద్‌లోనే నిర్వహించగా, ఈ సారి కూడా హైదరాబాద్‌లోనే నిర్వహించేందుకు దాదాపు నిర్ణయం తీసుకున్నారు. నల్లగొండలో రాజకీయ పరిస్థితులు వేడెక్కి.. ఎన్నిక జరిగే వాతావరణం ఉంటే అక్కడ బహిరంగసభ నిర్వహించేయోచనలో పార్టీ ఉంది. 2001లో ఆవిర్భవించిన టిఆర్‌ఎస్ సంచలనరీతిలో భారీ లక్ష్యాలు నిర్దేశించుకుంటూ.. సాధిస్తూ.. దేశంలోని రాజకీయపండితులను ఆశ్చర్యపరుస్తోంది. 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు సాధించిన రాష్ట్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకుని అత్యంత ఉన్నత స్థితికి పార్టీని అధినేత తీసుకుచ్చారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండగా.. ఎన్నికలకు ముందు జరిగే పార్టీ ప్లీనరీ కావడంతో.. రాష్ట్ర క్యాడర్‌కు, ప్రజలకు సరికొత్త దిశానిర్దేశం చేసేవిధంగా కెసిఆర్ ప్రకటనలు చేయబోతున్నారు. గత ప్లీనరీలో రైతుకు పెట్టుబడి పథకాన్ని ప్రకటించి.. రైతాంగంలో ఆనందం నింపిన కెసిఆర్..ఈ సారి తన అమ్ములపొదిలో ఉన్న మరిన్ని సంక్షేమఅస్త్రాలను బయటికి తీయనున్నారు. రాష్ట్ర ప్రజలను సమ్మోహపరచడం.. ఇప్పటిదాకా పార్టీపై, ప్రభుత్వంపై ఉన్న జనాదరణను నిలుపుకోవడం.. దేశ ప్రజలలో కెసిఆర్ నాయకత్వంపై.. ఆలోచనలపై కొత్త ఆశలు కల్పించి ఆసక్తిగా చూసేలా చేయడమనే ద్విముఖవ్యూహాన్ని టిఆర్‌ఎస్ రచిస్తోంది. జాతీయ రాజకీయాల వైపు సీరియస్‌గా ఆలోచిస్తున్న నేపథ్యంలో.. దేశప్రజలను ఏకీకృతం చేసేలా.. మౌళిక ప్రశ్నలు సంధించి.. ప్రజలలో ఆలోచనలు రేకెత్తించాలని, ఇదే క్రమంలో ప్రశ్నలకే పరిమితం కాకుండా తాను ఏర్పాటుచేయబోయే కూటమి అజెండాను, పరిష్కారాలను కూడా ఆవిష్కరించాలని టిఆర్‌ఎస్ అధినేత భావిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. దేశ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే నిపుణుల బృందం ద్వారా అధ్యయనం చేయించి నివేదికలు తెప్పించుకుంటున్న ముఖ్యమంత్రి కెసిఆర్.. మెజారిటీ రాష్ట్రాల ప్రజలు కామన్‌గా ఎదుర్కొనే సమస్యలు, గతంలో ఏ జాతీయపార్టీ సీరియస్‌గా తీసుకోని సున్నిత సమస్యలను ఎత్తుకుని ముందుకు వెళ్ళే యోచనలో ఉన్నారు. ప్రాంతీయపార్టీలను మాత్రమే నమ్ముకోకుండా.. విలక్షణ ఎజెండాతో దేశ రాజకీయచిత్రపటంపై బలమైన ముద్ర వేయాలని భావిస్తున్నారు. తమది పార్టీల ఫ్రంట్ కాదని.. ప్రజల ఫ్రంట్ అని ఇప్పటికే కెసిఆర్ అనేకమార్లు చెప్పారు. అందుకు అనుగుణంగానే ఎజెండాను సెట్ చేస్తున్నారు. ఏప్రిల్ 24లేదా 27న ఆవిర్భావ వేడుక నిర్వహించాలని భావిస్తుండగా, ప్లీనరీకి జాతీయ నాయకులను ఆహ్వానించాలా.. వద్దా అనే అంశాలపై పార్టీ ముఖ్యులతో కెసిఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు.

రాజ్యసభ ఎన్నికల తర్వాత..

ఈనెల 23న రాజ్యసభ ఎన్నిక జరగనుండగా, 27న అసెంబ్లీ ముగియనుంది. ఆ తర్వాత ప్లీనరీకి సంబంధించి షెడ్యూల్‌ను, కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉంది. 2001ఏప్రిల్ 27న జలదృశ్యంలో టిఆర్‌ఎస్ ఆవిర్భవించగా, 2018లో జరిగే ఆవిర్భావ వేడుకకు కూడా అంతేస్థాయి ప్రాధాన్యముందని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. జాతీయ రాజకీయాల్లో మార్పుదిశగా కెసిఆర్ చేస్తున్న ప్రయత్నం.. టిఆర్‌ఎస్ కార్యకర్త అంటే గర్వంగా చెప్పుకునేలా ఉంటుందని నాయకులు చెబుతున్నారు. ఈ నెల 27తర్వాత కెసిఆర్ ఢిల్లీ వెళ్ళే అవకాశం ఉండగా, ఏప్రిల్ 3లేదా 4న కొత్త రాజ్యసభ సభ్యుల ప్రమాణస్వీకారం ఉండే అవకాశం ఉంది. ఏప్రిల్ 20నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతుకు పెట్టుబడి పథకం రైతులక్ష్మి ద్వారా చెక్కులు పంపిణీచేయనున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ శ్రేణులు విస్తృతంగా పాల్గొనాలని సిఎం చెబుతున్నారు. రైతుసమన్వయ సమితులు, టిఆర్‌ఎస్ శ్రేణులతో.. పెట్టుబడి చెక్కుల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరగనుంది. ఈ కార్యక్రమం ప్రారంభించిన తర్వాతే ప్లీనరీని నిర్వహించి.. కార్యకర్తల్లో కెసిఆర్ మరింత జోష్ తీసుకువచ్చే అవకాశం ఉంది. గత ప్లీనరీలో చెప్పినట్లు చెక్కుల పంపిణీ జరిగిందని.. సభకు హాజరైన వారితోనే అనిపించి, కెసిఆర్ చెబితే ఎంతటి పెద్ద కార్యమైనా.. పూర్తయ్యేదాకా వదలడు.. చెప్పింది చేస్తడు అని సభ సాక్షిగా చాటి, మరిన్ని పథకాలను కార్యకర్తల హర్షధ్వానాల మధ్యే ప్రకటించే అవకాశం ఉందని పార్టీ ముఖ్యులు భావిస్తున్నారు. టిఆర్‌ఎస్ ప్లీనరీ ద్వారా టిఆర్‌ఎస్ ఏం చేస్తుందోనని ఎదురుచూస్తున్న పక్క రాష్ట్రాల ప్రజలకు స్పష్టత నివ్వడం.. రాష్ట్రంలో ఏం చేసినా టిఆర్‌ఎస్ మాత్రమే చేయగలదు.. మనకు తిరుగులేదనే ధీమాను క్యాడర్‌కు మరోసారి ఇవ్వడం.. ఇలా ఒకే సభతో రెండు లక్ష్యాలు సాధించే వ్యూహరచనలో పార్టీ ఉంది. సంక్షేమ రంగంలో నూతన ఒరవడిని తీసుకొచ్చిన కెసిఆర్.. బిసివర్గాలు లక్ష్యంగా ఇప్పటికే అనేక పథకాలు, రాజకీయ నిర్ణయాలు తీసుకోగా.. ప్లీనరీ వేదికను మరింత ఆకర్షణీయంగా వినియోగించుకునే వ్యూహరచనలో ఉన్నట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. జాతీయ రాజకీయ ప్రకటన.. సమీపిస్తున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిఆర్‌ఎస్ నిర్వహించే ప్లీనరీ రాజకీయవర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

నోటాకే బీజేపీ ఓటు

• రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు నిర్ణయం • తటస్థంగా టీడీపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యసభ ఎన్నికలకు జరుగనున్న పోలింగ్‌లో ఓటు వేయాలని బిజెపి నిర్ణయించుకుంది. అయితే అటు టిఆర్‌ఎస్‌కు, ఇటు కాంగ్రెస్‌కు సమదూరం పాటించాలని నిర్ణయించింది. టిడిపి ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. అయితే ఓటు వేయనున్న అయిదుగురు బిజెపి ఎంఎల్‌ఎలు తమ ఓటును నోటాకు వేయనున్నారు. ఈ నెల 23 వ తేదీన రాజ్యసభకు పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే.

రాష్ట్రం నుంచి ముగ్గురు అభ్యర్థులను ఎంఎల్‌ఎలు ఎన్నుకోవాల్సి ఉండగా, ముగ్గురు టిఆర్‌ఎస్ నుంచి ఒకరు కాంగ్రెస్ నుంచి మొత్తం నలుగురు పోటీలో ఉండటంతో పోలింగ్ అనివార్యమైంది. ఇప్పటికే ఎంఐఎం తమ మద్దతును అధికార టిఆర్‌ఎస్‌కు ప్రకటించింది. టిడిపి, బిజెపిలు మాత్రమే తమ వైఖరిని తెలియజేయలేదు. బుధవారం ఉదయం భేటీ అయిన బిజెపి ఎంఎల్‌ఎలు రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించుకున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల పోటీ తదితర అంశాలను అధిష్టానానికి సమాచారం పంపించి ఓటింగ్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై అభిప్రాయాన్ని కోరారు. అయితే ఇప్పటి వరకు ఇటు టిఆర్‌ఎస్ కానీ, అటు కాంగ్రెస్ కానీ బిజెపిని మద్దతు కోరలేదు. కనీసం ఫోన్‌లోనూ సంప్రదించలేదు. ఈ విషయాన్ని కూడా నేతలు కేంద్ర పార్టీకి తెలియజేశారు. ఎట్టి పరిస్థితులలో పోలింగ్‌లో పాల్గొనాలని, లేకపోతే ఎన్నికలంటే బిజెపికి చులకన అన్న ప్రచారానికి ఏ మాత్రం తావివ్వకుండా ఉండాలని భావిస్తున్న బిజెపి నోటాకు ఓటెయ్యాలని నిర్ణయించుకుంది. సభలో 15 మంది ఎం ఎల్‌ఎలున్న టిడిపి ప్రస్తుతం ఇద్దరు ఎంఎల్‌ఎలు మాత్ర మే ఉన్నారు. మిగతా వారిలో 12 మంది టిఆర్‌ఎస్‌కు మద్ద తిస్తుండగా, ఒకరు రాజీనామా చేసినట్లు ప్రకటించి సభకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో టిడిపిని కూడా కాంగ్రెస్, టిఆర్‌ఎస్‌లు ఏ మాత్రం సంప్రదించ లేదు. బుధ వారం సాయంత్రం భేటీ అయిన టిడిపి నేతలు రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయిం చింది.


కాంగ్రెస్ విప్ జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌కు ఓటెయ్యాలని ఆ పార్టీకి చెందిన 19 మంది ఎమ్మెల్యేలకు విప్ జారీ చేశారు. సీఎల్పీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ విప్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేల నివాసాలకు స్పీడ్ పోస్టులో విప్‌ను పంపించారు.

కాగా కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ లెక్కల ప్రకారం ప్రస్తుతం 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన దొంతి మాదవరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీకి 20 మంది సభ్యులు ఉన్నారు. అయితే వీరిలో 7 గురు ఎమ్మెల్యేలు మాత్రం కాంగ్రెస్‌కు రాజీ నామా చేసి గతంలోనే టీఆర్‌ఎస్ గూటికి చేరిన విషయం తెలిసిందే. అయినప్పటికి పార్టీ మారిన సభ్యులు ఇప్పటి వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగు తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు హాజర వుతారా..? లేక దూరంగా ఉంటారా..? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పార్టీ మారిన వారిపైన అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసినా స్పీకర్‌కు ఫిర్యా దు చేశారు. వీరిపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవ దంతో కాంగ్రెస్ శాసన సభాపక్షం న్యాయస్థానాలను కూడా ఆశ్రయించింది. ఈ కేసు కోర్టులోనే నడుస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఒక వేళ ఓటింగ్‌కు హాజరైతే.. ఎవరికి ఓటు వేస్తున్నామో కాంగ్రెస్ అభ్యర్థి తరపున పోలింగ్ వద్ద ఉన్న ఏజెంట్‌కు చూపించి వేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఏజెంట్‌కు చూపించకుండా ఓటు వేస్తే ఆ ఓటు చెల్లదని కాం గ్రెస్ వర్గాలు చెబుతు న్నాయి. పార్టీ అభ్యర్థిని కాదని, టీఆర్ ఎస్ అభ్యర్థికి ఓటేస్తే కాంగ్రెస్ జారీ చేసిన విప్‌ను ధిక్క రించన అంశాన్ని న్యాయస్థానంలో ఆధారంగా చూపిం చే దు కు అవకాశం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతు న్నాయి.

ఈసీకి కోమటిరెడ్డి, సంపత్ ఫిర్యాదు




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాజ్యసభ ఓటర్ జాబితా నుంచి ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి, సంపత్‌ల పేర్లు తొలగించడంపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. శశిధర్ రెడ్డి నేతృత్వంలో కోమటిరెడ్డి, సంపత్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు బుధవారం ఎన్నికల సంఘం కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రాజ్యసభ ఎన్నికల నామినేషన్‌లో అభ్యర్థికి ప్రపోజర్స్ కింద వారిద్దరూ సంతకాలు చేశారు. నామినేషన్ స్వీకరణ కూడా పూర్తైంది. ఈనెల 13న వారిద్దరి తెలంగాణా శాసన సభ సభ్యత్వాలను రద్దు చేసిన నేపథ్యంలో రాజ్యసభ ఓటర్ లిస్టు నుంచి పేర్లు తొలగించారు. రాజ్యసభ ఓటర్ల లిస్టు ఎన్నికల సంఘం నిర్దేశించినట్లు ఉండాలని, వారి పేర్లను తొలగించడం చెల్లదని మర్రి శశిధర్ రెడ్డి పాత్రికేయులకు వివరించారు. వారి పేర్లను ఓటర్ లిస్టులో ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరామని ఆయన తెలిపారు. హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ విచారణకు స్వీకరిస్తుందని భావిస్తున్నామని మర్రి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్నికలు ఉన్నందున తక్షణమే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న అసెంబ్లీ కార్యదర్శి తెరాస సర్కార్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని, కేంద్రం ఆయనను వెంటనే తొలగించాలని కోరారు.

కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ

• సీనియర్లను విస్మరించి జూనియర్లకు చోటివ్వడంపై అసంతృప్తి • బీసీ వర్గాలను విస్మరించారంటున్న నేతలు

• పార్టీకి తలనొప్పిగా మారిన ఏఐసీసీ సభ్యుల ఎంపిక

• కుంతియా, టీ పీసీసీపై రాహుల్‌కు ఫిర్యాదులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో పదవుల పంచాయతీ మొదలైంది. ఏఐసీసీ సభ్యులుగా సీనియర్లను విస్మరించి.. జూనియర్లకు చోటివ్వడంపై పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవు తోంది. పార్టీ నిబంధనల మేరకు రెండు అసెంబ్లీ నియో జక వర్గాల నుంచి ఒకరికి ఏఐ సీసీ సభ్యుడిగా చోటివ్వా లని ఉన్నది. మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీని యర్ నేతలు, ఇంతకు ముందు టీపీసీసీలో పనిచేసిన అనుభం ఉన్నవారితో పాటు పార్టీ సభ్యత్వాలు అధికంగా చేయించిన వారికి ఏఐసీసీ సభ్యులుగా అవకాశం కల్పించా లని నిబంధనలు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబు తున్నాయి. ఇవేవి పట్టించుకోకుండా కొంత మంది జూనియర్లకు అవకాశమిచ్చి.. వారి నియోజక వర్గాల్లో సీనియర్లకు చోటు కల్పించ కపోవడంపై సొంత పార్టీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో మొదటి నుంచి పనిచేసే వారిని కాదని, ఇటీవల కాంగ్రెస్ లో చేరిన వారికి కూడా అవ కాశం ఇవ్వడంపైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా జనాభాలో సగభాగం ఉన్న బీసీ వర్గాలను విస్మరించారనే విమర్శలు వినిపిస్తు న్నాయి. ఇదే అంశంపై టీ పీసీసీ చీఫ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రాంచంద్ర కుంతియాపై ఏఐ సీసీ అధ్యక్షుడు రాహుల్‌గాం ధీకి ఫిర్యాదు వెళ్తున్నాయి. రాష్ట్రం నుంచి ఏఐసీసీ సభ్యులుగా 80 మందికి చోటు కల్పించారు. అందు లో 42 మందికి నామినేటెడ్ కోటాలో ఉండగా మరో 38 మందికి కో-ఆప్షన్ కోటాలో అవకాశం కల్పించారు. నామినేటెడ్ కోటాలో ఏఐసీసీ సభ్యులుగా నియమితులైన వారికే.. పార్టీ వ్యవహారాలకు సంబంధించి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. కో-ఆప్షన్ కోటాలోనూ సీనియర్లతో పాటు పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన నాయకులను నియమించాల్సి ఉంటుంది.

నామినేటెడ్ కోటాలో హైదరాబాద్‌కు చెందిన అమిద్ జావెద్, సంగారెడ్డికి చెందిన ఫయామ్‌కు అవకాశమిచ్చారు. సంగారెడ్డికి చెందిన సీనియర్ నాయకుడు, ప్రభుత్వ మాజీ విప్ జగ్గారెడ్డికి అవకాశం కల్పించలేదు. ఇక పోతే గ్రేటర్‌లోని మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, సుధీర్‌రెడ్డి, బిక్షపతియాదవ్, మాజీ మంత్రులు ప్రసాద్‌కుమార్, చిత్తరంజన్‌దాస్, ప్రభుత్వ మాజీ విప్ ఈరావత్రి అనిల్, దాసోజ్ శ్రావణ్, అద్దంకి దయాకర్‌తో పాటు పలువురు సీనియర్లను పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక కో-ఆప్షన్‌కు సంబంధించిన సభ్యుల విషయం లోనూ అభ్యంతరాలు వ్యక్తం అవుతు న్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన కొనగాల మహేష్, సికింద్రాబాద్ నుంచి ప్రియాం క, దుబ్బాక నియోజక వర్గానికి చెందిన నర్సా గౌడ్‌లకు ఏ ప్రతిపాదికన అవకాశమి చ్చారని సీనియర్లు మండిపడుతున్నారు. క్రిష్టియన్ కోటా కింద ప్రియాంకకు అవకాశ మిస్తే.. ఆమె కంటే సీనియర్ నాయకురాలిగా మేరీ రవీంద్రనాథ్ ఉన్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఏఐసీసీ పదవుల్లో కొందరికి మొండి చేయి చూపించగా.. మరి కొందరికి మాత్రం కుటుంబంలో ఇద్దరికి అవకాశం కల్పించడంపైన కాంగ్రెస్ కేడర్ గుర్రుగా ఉన్నారు.

మనది ముమ్మాటికీ ధనిక రాష్ట్రమే



(మొదటిపేజీ తరువాయి)

అప్పులు లేకుండానే ఆ రాష్ట్రాలు పాలన సాగిస్తున్నాయా...? అంటూ బిజెపికి చురకలంటించారు. రాష్ట్ర పరిమితికి లోబడే అప్పులు చేస్తున్నాం..అప్పులు తీసుకోవడం బడ్జెట్‌లో భాగమన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు, అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ దేశాలూ అప్పులు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 నుంచి 2014 వరకు 23 జిల్లాలకు ఖర్చు చేసింది రూ. 1.29 లక్షల కోట్లు అని.. నాలుగేళ్లలో తెలంగాణలో రూ. 1.24 లక్షల కోట్లు ఖర్చు చేశామని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉంటుందని ఉద్యమ సమయంలోనే చెప్పానని, ఇప్పుడు అదే జరుగుతోందని సీఎం తెలిపారు. ఈ ఏడాదిలో దేశంలో ఏ రాష్ట్రానికి రానన్ని అవార్డులు తెలంగాణ రాష్ట్రానికి వచ్చాయన్నారు. మంచి పనులు జరిగినప్పుడు అభినందించవలని, తప్పులు చేస్తే నిర్మాణాత్మకంగా విమర్శించాలని ప్రతిపక్షాలకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి ఖర్చు చేస్తే తప్పు పట్టడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలౌతుందని అనడం సరికాదన్నారు. దేశ జీడిపి 167 లక్షల కోట్లుగా ఉందన్నారు. అయితే దేశంలో అప్పులు రూ. 82 లక్షల కోట్లుగా ఉన్నాయని చెప్పారు. అంటే దేశ జీడిపిలో 49.5 శాతం మేర కేంద్ర అప్పులు ఉన్నాయని, ఈ ఏడాది కేంద్రం చెల్లిస్తున్న అప్పులు రూ. 8.76 లక్షల కోట్లని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డిపిలో 21 శాతం మాత్రమే అప్పులు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వ ఉదయ్ పథకంతో రూ.9వేల కోట్ల అప్పు మనమీద పడ్డదని స్పష్టం చేశారు. అది లేకపోతే తెలంగాణ అప్పు 19శాతానికి మించదని తెలిపారు. చాలా దేశాల్లో జీడిపి కంటే అప్పులే ఎక్కువగా ఉన్నాయని యూఎస్ఏ 14 ట్రిలియన్ డాలర్ల అప్పులు చేస్తే, జపాన్ అప్పు ఆ దేశ జీడిపి కంటే 300 శాతం ఎక్కువని చెప్పారు. ఏ రాష్ట్రంలో నిధులు ఉంటే ఆ రాష్ట్రంలో ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని సీఎం స్పష్టం చేశారు. నిధుల కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. తొలిసారి తెలంగాణకు వచ్చినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ మాటలు విని సంతోషించామన్నారు. దేశం బాగుపడుతుందని పొంగిపోయామని అన్నారు. సహకార సమాఖ్య వ్యవస్థ అని ప్రధాని చెప్పారని అన్నారు. తాము ఏనాడు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రం దగ్గరకు పోలేదని సీఎం స్పష్టం చేశారు. అన్ని అర్హతలు ఉండి కూడా కేంద్రం దగ్గర పనులు జరగడం లేదన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు రూ. 24వేల కోట్లు ఇవ్వాలని అడిగితే 24 రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. ఆయా పథకాలకు నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పినప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. విద్యా విధానంతోపాటు వ్యవసాయం, ఆరోగ్య శాఖలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు వదిలిపెట్టాలన్నారు. వాటితోపాటు పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖలు కేంద్రం వద్ద ఎందుకు ఉండాలని ప్రశ్నించారు.

రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిపక్షాలకు క న్పించడంలేదా అంటూ... బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రూ.1000 పెన్షన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. 22 శాతం వృద్ధిరేటుతో దేశంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని గుర్తు చేశారు. చిన్నచిన్న పొరపాట్లు జరిగితే రైతు రుణమాఫీ జరలేదనడం సరికాదన్నారు. కేసీఆర్ కిట్టును చూసిన మధ్యప్రదేశ్ సృజన్ సే విజ్ఞాన్ తక్ అనే పథకాన్ని ప్రవేశపెడుతోంది...ఇది మన ఘనత...ఇతర రాష్ట్రాలు గుర్తిస్తుంటే ప్రతిపక్షాల కళ్లకు కన్పించడంలేదని విమర్శించారు. రుణమాఫీ విజయవం అయిందన్నారు. 99శాతం రుణమాఫీ క్లియర్‌గా జరిగిందన్నారు. ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు జరిగితే జరిగి ఉండొచ్చని వాటిని చూసి విమర్శించడం సరికాదన్నారు. ఇప్పటి వరకు రూ.17వేల కోట్లు మాఫీ చేశామని...వందకు వంద శాతం అన్నీ క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. 38లక్షల మంది రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు.

రాజకీయ ఫేస్‌బుక్!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు కూడా తమ మేనిఫెస్టోలు, హామీల్ని ప్రజల మెదళ్ళలోకి చొప్పించేందుకు చవకైన, వేగవంతమైన ఈ మాధ్యమాన్నే ఎంచుకుంటున్నారు. భారత్‌లో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఈ సామాజిక మాధ్యమాలు కీలకపాత్ర పోషించే పరిస్థితి స్పష్టమౌతోంది. గత ఎన్నికల్లోనూ మోడి వీటిని ఉపయోగించుకున్నా అప్పటికి ఇవి ఇంకా ఇంతటిస్థాయిలో విజృంభించలేదు. 4జీ నెట్‌వర్క్ ఇంత విస్తృతంగా అందుబాటులోకి రాలేదు. స్మార్ట్‌ఫోన్లు కూడా ఇంతపెద్ద సంఖ్యలో లేవు. రానున్న ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పటికే ప్రధాన పార్టీల నుంచి ప్రాంతీయ పార్టీల వరకు ప్రత్యేకంగా సామాజిక ప్రచార మాధ్యమ విభాగాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. నిపుణుల బృందాల్ని ప్రత్యేకంగా నియమించుకున్నాయి. వీరి ద్వారా వైరిపక్షాలపై ఆరోపణలు, తమ విజయాల ప్రచార బాధ్యతల్ని ఇప్పటికే చేపట్టాయి. ఈ దశలో సామాజిక మాధ్యమాల ఖాతాదార్ల వ్యక్తిగత వివరాలు అనుమతి లేకుండా బహిర్గతమువుతున్నాయన్న వార్త పిడుగులా ధ్వనించింది. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలు చోరీకి గురౌతున్నాయి. లేదా కావాలనే కొందరికి వెల్లడిస్తున్నారనే విషయం వెలుగులోకొచ్చింది. ఇది వ్యక్తిగత రహస్యాల రక్షణ చట్టానికి విరుద్ధం. అమెరికా ఎన్నికల్లో ఫేస్‌బుక్‌కు చెందిన ఐదు కోట్ల మంది ఖాతాదార్ల వ్యక్తిగత రహస్య వివరాలు లీకైనట్లు తేలింది. పోటీలో ఉన్న ట్రంప్‌కు అనుకూలంగా ప్రచారం చేసేందుకే ఓ సంస్థకు ఈ వివరాల జాబితా ఫేస్‌బుక్ నుంచి అందింది. దీంతో ఒక్కసారిగా ఫేస్‌బుక్ ప్రతిష్ట దిగజారిపోయింది. ఆ సంస్థ షేర్ విలువ ఏడుశాతం పతనమైంది. దీనివెనుక కుట్రలేదంటూ ఫేస్‌బుక్ అధినేత జుకర్‌బర్గ్ చేస్తున్న వాదనను అంతర్జాతీయ సమాజం అంగీకరించడం లేదు. భారత్ కూడా ఈ విషయాన్ని సీరియస్‌గానే పరిగణిస్తోంది. వ్యక్తిగత సమాచారాన్ని మరొకరికి చేరవేస్తే భారత ఐటీ చట్టం ప్రకారం విచారణ ఎదుర్కోక తప్పదంటూ కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ జుకర్‌బర్గ్‌ను హెచ్చరించారు. భావప్రకటనా స్వేచ్ఛ పేరిట చట్టాల్ని అతిక్రమిస్తే ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ వారెంట్ జారీ తప్పదన్నారు. భారత్‌లో ఫేస్‌బుక్‌కు 20కోట్ల మందికిపైగా వినియోగదార్లు ఉన్నారు. అమెరికా తర్వాత భారత్‌లోనే ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్న వారందరికీ ప్రస్తుత పరిస్థితితో గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. ఒక్క ఫేస్‌బుక్కే కాదు.. వాట్సప్ వంటి ఇతర సామాజిక మాధ్యమాలకు చెందిన ఖాతాదార్ల వివరాలు కూడా ఇక బహిర్గతమయ్యే అవకాశం కనిపించడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సామాజిక ప్రచార మాధ్యమాల్లో ఫేస్‌బుక్‌కే అత్యధిక సంఖ్యలో వినియోగదార్లు ఉన్నారు. దీన్ని 130 కోట్ల మంది వినియోగిస్తున్నారు. ఇందులో ఒక్క అమెరికాలోనే సుమారు 23కోట్ల మంది ఖాతాదార్లు ఉన్నారు. వీరిలో 5కోట్ల మందికి పైగా ఖాతాదార్ల వ్యక్తిగత రహస్య వివరాల్ని ఫేస్‌బుక్



కేంబ్రిడ్జి అనలిటికా అనే సంస్థకు అందించిందన్నది ప్రధాన ఆరోప ణ. ఈ ఖాతాదార్లకు ట్రంప్ బృందం రోజూ వందల సంఖ్యలో తమ అనుకూల మెసేజ్‌లను పంపించింది. డెమోక్రటిక్ ప్రత్యర్థి హిల్లరి క్లింటన్‌పై అనేక ఆరోపణలు గుప్పించింది. ట్రంప్ భవిష్యత్ వ్యూహాలు, భవిష్యత్ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు తెలియజేసింది. ట్రంప్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను పదే పదే నూరిపోసింది.

ట్రంప్ విజయం వెనుక ఫేస్‌బుక్ ఖాతాదార్ల వివరాల లీకేజీ కూడా ప్రధాన పాత్ర పోషించిందన్నది ఇప్పుడు ఆరోపణగా మారింది. ఈ వ్యవహారం వెనుక రష్యా గూఢచారి విభాగం కేజీబీ హస్తముందన్నది ఈ ఆరోపణల్ని మరింత పటిష్టం చేసింది. కేంబ్రిడ్జి వర్శిటీలోని సైకాలజీ విభాగంలో అలెగ్జాండర్ ఫోగెన్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. క్రిస్టోఫర్ వైలీ అనే డేటాఅనలిస్ట్ నిపుణుడితో కలిసే ఫేస్‌బుక్ లీకేజీకి పథకం సిద్ధం చేసినట్లు తాజా దర్యాప్తులో వెల్లడౌతోంది. తన పరిశోధనల కోసమని చెప్పి మార్క్ జుకర్‌బర్గ్ నుంచి అనుమతి తీసుకుని ఈ వ్యక్తిగత ఖాతాల వివరాల్ని ఈ బృందం సేకరించినట్లు సమాచారం. మనుష్యుల మానసిక స్థితి విశ్లేషణ కోసమే ఈ వివరాల్ని తాము వినియోగిస్తామంటూ జుకర్‌బర్గ్‌కు ఈ బృందం హామీనిచ్చింది. ఇక్కడే జుకర్‌బర్గ్‌తో పాటు ఫేస్‌బుక్ నిర్వహణా బృందం తప్పటడుగు వేసింది. పూర్తిస్థాయిలో ఆరాతీయకుండానే ఖాతాల వివరాల విడుదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇంతకీ ఈ అలెగ్జాండర్ ఫోగెన్ ట్రంప్ ఎన్నికల ప్రచార బాధ్యతలు నిర్వహించిన స్టీవ్‌బానన్‌కు అతి సన్నిహితుడు. వీరంతా కలిపే ఖాతాదార్ల వ్యక్తిగత వివరాల్ని తమకు అనుకూలంగా వినియోగించుకున్నారు. దీనిపై ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో ట్రంప్‌తో పాటు ఫేస్‌బుక్ కూడా బుక్కయింది. ఈ ప్రభావం ఒక్క ఫేస్‌బుక్‌పైనే కాకుండా మిగిలిన సామాజిక మాధ్యమాలపై కూడా తీవ్రంగానే ఉంది. ఇప్పటికే ఫేస్‌బుక్‌ను చైనాలో నిషేధించారు. మరికొన్ని దేశాలు ఈ దిశగా యోచిస్తున్నాయి. ట్రంప్ వైరం పెట్టుకున్న దేశాలన్నీ ఇప్పుడు ఫేస్‌బుక్‌ను బహిష్కరించేందుకు సిద్ధమౌతున్నాయి. 130కోట్ల ఖాతాదార్లున్న ఫేస్‌బుక్‌కు నాలుగురోజుల్లోనే నాలుగు నుంచి ఐదు శాతం మంది ఖాతాదార్లు దూరమయ్యారు. వీరిలో అత్యధికులు తమ ఖాతాల్ని స్థబ్దతలో పెట్టేశారు. ఫేస్‌బుక్ షేర్ విలువ గత నాలుగు రోజుల్లో ఏడుశాతం పడిపోయింది. జుకర్‌బర్గ్ నికర సంపద దాదాపు 500కోట్ల డాలర్లు తగ్గిపోయింది. ఈ పరిస్థితిని పోటీదార్లు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, బ్రెజిల్, జపాన్, మెక్సికోలలో అత్యధిక సంఖ్యలో ఖాతాలు కలిగిన ట్విట్టర్ ఈ సమయంలో మిగిలిన దేశాల్లో తన ఖాతాదార్లను పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. దక్షిణకొరియాకు చెందిన సామాజిక మాధ్యమం ''కకావోటాక్'' కూడా ఇప్పుడు పోటీలోకి దిగింది. జపాన్‌కు చెందిన నేవల్ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన మరో సామాజిక మాధ్యమం ''లయన్'' కూడా పోటీలో ఉంది. చైనాకు చెందిన ''క్యుక్యు మెసెంజర్ యాప్'' ఫేస్‌బుక్ ఖాతాల్ని ఆకర్షించే ప్రయత్నం మొదలెట్టింది. వాట్సప్ వ్యవస్థాపకులు బ్రియాన్ యాక్టన్ ఆ సంస్థ నుంచి బయటకొచ్చి సొంతంగా ప్రారంభించిన సిగ్నల్ మెసెంజర్ యాప్ కూడా భారత్‌తో పాటు ఆసియా దేశాల్లో ప్రవేశించేందుకు ఇదే సమయంగా భావిస్తోంది. ఇప్పటికే చైనాలో అత్యధికులు వినియోగిస్తున్న ''వుయ్‌చాట్ మెసెంజర్ యాప్'' భారత్, పాక్, బంగ్లాలపై దృష్టిపెట్టింది. వియత్నాంకు చెందిన ''జాలో'' కూడా పోటీలో దిగింది. తాజా పరిణామాలు ఇప్పుడు ప్రచార మాధ్యమాల మధ్య ప్రత్యక్ష యుద్ధానికి తెరదీశాయి. ఇందులో ఎక్కువ సంస్థలు భారత్‌పైనే ప్రధానంగా దృష్టిపెట్టాయి. ఫేస్‌బుక్, వాట్సప్, టెలిగ్రామ్ యాప్‌లను అమెరికన్ల తర్వాత భారతీయులే అత్యధికంగా వినియోగిస్తున్నారు. ఈ సమయంలో రానున్న ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ఖాతాదార్ల వ్యక్తిగత సమాచార లీకేజీపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో ఎన్నికల్లో ప్రచారానికి ప్రధానంగా వీటిపైనే ఆధారపడేందుకు సమాయత్తమౌతున్న వర్గాలకిది ఆశనిపాతమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మండలి వసతులపై అసహనం

(మొదటిపేజీ తరువాయి)

కెసిఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 1984కు ముందు శాసనమండలిలో ముఖ్యమంత్రులు పైవైపుగా ఉండేవారని, ఇక్కడ ముఖ్యమంత్రి కార్యాలయం ఉండడం సరికాదని ఆయన అన్నారు. ఇదే సందర్భంలో మండలిని పరిశీలిస్తూ వెళ్ళిన ఆయన గతంలో మండలి ఛైర్మన్ చక్రపాణి కూర్చున్న ఛాంబర్‌ను తనకు కేటాయించాలని, అందుకు తగిన మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. డైనింగ్‌హాలును కూడా పరిశీలించిన ఆయన హాల్ మధ్యలో నిర్మించిన గోడలను తొలగించాలని.. మొత్తం ఒకే హాల్ విశాలంగా ఉండేలా తగిన మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. 1984కు ముందు తాము శాసనమండలికి వచ్చినపుడు ఎంతో అర్థవంతంగా, ఉత్సాహంగా అనిపించేదని.. వాతావరణం కూడా బాగుండేదన్నారు. శాసనమండలిని తగిన మరమ్మత్తులు చేసి.. మంచిగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మండలి అంతా కలియతిరిగిన సిఎం మండలిని మళ్ళీ సమావేశాలనాటికి ఆధునీకరించాలని ఆదేశించారు.

ఐసిస్ దాడి

(మొదటిపేజీ తరువాయి)

తాను పేల్చుకుని ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఐసిస్ దాడిలో 100 మంది మృత్యువాత పడిన అనంతరం అఫ్ఘన్ ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసినప్పటికీ మరల బుధవారం ఈ సంఘటన చోటుచేసుకోవడం భద్రతలోపాలను తెలియచేస్తున్నది. రాజధాని నగరం కాబూల్ ఇంకా ఉగ్రమూకల కనుసన్నలలోనే వున్నట్టు అర్థమవుతున్నది. కాబూల్ నగరం పశ్చిమాన వున్న కర్త్-ఈ-సఖి ప్రార్థనా మందిరం నుంచి ప్రజలు వెలుపలకి వస్తున్న సమయంలో ఆగంతకుడు తన శరీరానికి అమర్చుకున్న బాంబులను పేల్చుకోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నది. ప్రార్థనా మందిరం లోపల, బయట కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని, ఆగంతకుడు మందిరంలోనికి వెళ్ళేందుకు ప్రయత్నించి పోలీస్ చెకింగ్ పాయింట్స్‌కి సమీపానికి వస్తుండగా భద్రతా దళాలు నిరోధించాయని అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రతినిధి నజీబ్ డానేష్ తెలిపారు. నవ్‌రజ్ సెలవు దినాన్ని జరుపుకునేందుకు ప్రార్థనా మందిరం దగ్గరకు చేరుకున్న యువకులు, అక్కడ రహదారిపై వున్న వారు ఈ దుర్ఘటనలో మృత్యువాత పడినట్టు ఆయన చెప్పారు. ఇదిలావుండగా, ఈ ఘటనకు తామే బాధ్యులమని కైరోలోని ఐసిస్ ఉగ్రవాద ముఠా ప్రకటించినట్టు అమఖ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

కార్మికురాలి నిజాయితీ

- చెత్తకుండీలో దొరికిన రూ. 1.20లక్షలు యజమానికి అప్పగింత
- బల్దియా కార్మికురాలిని అభినందించిన ప్రజలు



మెట్‌పల్లి టౌన్, ప్రభ న్యూస్ : నిజాయితీకి నిదర్శనంగా మెట్‌పల్లి మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు మద్దెల లక్ష్మీ నిలిచింది. బుధవారం ఓచెత్త కుండీలో దొరికినా, ఒకటి కాదు, రెండు కాదు రూ. 1.20 లక్షల నగదును తిరిగి ఆ యజమానికి అప్పగించి తన నిజాయితిని చాటుకుంది. పోగొట్టుకున్నాననుకున్న నగదు పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ వల్ల తిరిగి లభించడంతో సదరు వ్యాపారి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడు. వివరాల్లోకి వెలితే.. పట్టణంలోని కూరగాయాల మార్కెట్‌లో షేక్ జావీద్ అనే వ్యాపారి చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 20వ తేదీన రాత్రి ఎప్పటిలాగే దుకాణం మూసివేసే సమయంలో దుకాణంలోని చెత్తను ఓ కవర్‌లో ప్యాక్ చేశారు. మరో ప్లాస్టిక్ కవర్‌లో రూ. 1.20 లక్షల నగదును ప్యాక్ చేసి రెండు కవర్లను చేతిలో పట్టుకున్నాడు. సమీపంలోని చౌరస్తా వద్ద కుప్పలో ఓ కవర్‌ను విసిరివేశాడు. నగదు ఉన్నట్లుగా భావిస్తున్న మరొక కవర్‌ను ఇంటికి తీసుకొని వెళ్లాడు. తెల్లవారిన తదుపరి కవర్‌ను విప్పి చూడగా అందులో చెత్త ఉండడం గమనించి షాక్ గురయ్యాడు. రాత్రి తానూ విసిరివేసింది డబ్బులు ప్యాక్ చేసిన కవర్‌గా గుర్తించి ఆందోళనకు గురయ్యాడు. కాగా కూరగాయాల మార్కెట్ సమీపంలో పారిశుద్ధ్య విధులు నిర్వహించే మద్దెల లక్ష్మీ ఎప్పటిలాగే బుధవారం తెల్లవారు జామున చెత్తకుప్పలను తొలగించింది. కుప్పను తొలగించే సమయంలో అనుమానస్పందంగా ఉన్న కవర్‌ను పరిశీలించగా అందులో నగదు ఉన్నట్లుగా గుర్తించింది. ప్లాస్టిక్ కవర్‌లో నగదును పొగొట్టుకున్న వ్యక్తుల కోసం చుట్టు పక్కల ప్రాంతాలలో ఆరాతీసింది. అదే ససమయంలో షేక్ జావీద్ తాను విసిరివేసిన నగదు గల కవర్ ఆచూకి కోసం గాలింపులు జరుతున్నాడని తెలుసుకున్న పారిశుద్ధ్య కార్మికురాలి లక్ష్మీ సదరు చికెన్ వ్యాపారి జావీద్‌కు రూ. 1.20 లక్షల నగదు గల కవర్‌ను అప్పగించి తన నిజాయితీని చాటుకుంది. నిజాయితీతో నగదును అందించిన లక్ష్మీకి పలువురు అభినందించారు.

కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని
రూ. 2కోట్లకు కుచ్చు టోపి

- లబోదిబోమంటున్న 75 మంది యువకులు



జన్నారం, ప్రభన్యూస్ : కోర్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి 75 మంది యువకుల నుంచి రూ.2 కోట్లు వసూలు చేసిన ఘటన స్థానికంగా కలవరం రేపింది. మంచిర్యాల జిల్లా, జన్నారం మండలంలోని పొన్కల్, బాదమ్‌పల్లి, చింతలపల్లి, జన్నారం, మురిమడుగు, అక్కెపల్లిగూడ, దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ, తాళ్ళపేట, కడెం మండలంలోని అల్లంపల్లి, దస్త్రాబాద్, ఉట్నూరు మండలంలోని సాలెవాడ తదితర గ్రామాలకు చెందిన 75మంది యువకుల నుంచి ఆదిలాబాద్‌కు చెందిన షేక్ సర్దార్ ఖాన్ రెండు సంవత్సరాలుగా కోర్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి జన్నారంలో, ఉట్నూరులో కొంతమందిని ఏజెంట్లుగా పెట్టుకొని డబ్బులు వసూలు చేశాడు. ఇటీవల మోసపోయామని ఆ యువకులు తెలుసుకొని సర్దార్ ఖాన్‌ను నిలదీయడంతో అతను అమాయక యువకులను బెదిరిస్తూ ఎవరైనా డబ్బులు అడిగినట్లయితే చంపేస్తానని భయభ్రాంతులకు గురిచేశాడు. ఆదిలాబాద్‌కు చెందిన రహీమ్ అనే వ్యక్తి, హైదరాబాద్‌కు చెందిన మనోహర్ అనే వ్యక్తులను మధ్యవర్తులుగా పెట్టుకొని అమాయకులైన యువకులను మోసాలకు పాల్పడ్డారు. ఆల్ ఇండియా హ్యూమెన్ రైట్స్ అసోసియేషన్ పేరిట జన్నారం మండల కేంద్రంలో కార్యాలయాన్ని ప్రారంభించి ఓ కమిటీని వేసి జిల్లా సలహాదారునిగా షేక్ సర్దార్ వ్యవహరిస్తూ జన్నారం మండలం పొన్కల్‌కు చెందిన షేక్ అహ్మద్‌ను అసోసియేషన్ సెక్రటరిగా నియమించుకొని కార్యకలాపాలు కొనసాగించాడు. సర్కారీ నౌకరీ వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేసుకొని అందులో ఫేక్ నోటిఫికేషన్లు వేయిస్తూ అమాయక యువకులను ఆ వెబ్‌సైట్‌ను చూడమనే వారు. అలా 75మంది యువకుల వద్ద ఒక్కో యువకుని వద్ద నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.7లక్షల వరకు వసూలు చేశారు. దీనికి సర్దార్ ఖాన్‌తో పాటు అబ్దుల్ రహీమ్, మనోహర్‌లు మధ్యవర్తులుగా వ్యవహరించారు. ఈ మేరకు పొన్కల్‌కు చెందిన షేక్ అహ్మద్ సర్దార్ ఖాన్, అబ్దుల్ రహీమ్, మనోహర్‌లపై 39 మంది యువకుల నుంచి రూ.89 లక్షలు వసూలు చేసి మోసగించాడని జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 15న ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్సై తహసీనోద్దీన్, లక్షెట్టిపేట సీఐ ప్రతాప్ నేతృత్వంలో కేసును నమోదు చేసి విచారించి నిందితులు అబ్దుల్ రహీమ్‌ను, రవికిరణ్ అలియాస్ మనోహర్, షేక్ షారుక్‌లను అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై చెప్పారు.

భారీగా క్లోరోహైడ్రేడ్ స్వాధీనం

నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్ : కల్తీకల్లుకు ఉపయోగించే 120 కిలోల క్లోరో హైడ్రేడ్‌ను పట్టుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నగరంలోని సుభాష్‌నగర్‌లో గల డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వో భీంగల్ స్టేషన్ పరిధిలోని ధర్పల్లి మండలంల గోవింద్ పేట్ గ్రామంలో కల్తీకల్లు అమ్ముతున్నట్లు పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిజామాబాద్ సిఐ దీపిక ఎస్ఎ స్రవంతి సిబ్బంది కలిసి గోవింద్ పల్లి గ్రామంలోని కల్లు దుకాణంపై దాడి చేసి 15 ప్లాస్టిక్ బాక్సుల్లో క్లోరో హైడ్రేట్‌తో కూడిన కల్లును పట్టుకుని ధ్వంసం చేశారు. నిందితుడు రాజేశ్వర్ గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ధర్పల్లికి చెందిన లింగాల రాజేశ్వర్ గౌడ్ కల్లు తయారు చేసినట్లు తెలిపాడని అన్నారు. ధర్పల్లికి చెందిన లింగాల రాజేశ్వర్ గౌడ్ ఇంటిపై దాడి చేసి మూడు ప్లాస్టిక్ సంచుల్లో ఒక్కోకొక్క సంచిలో ముప్పై కిలోల చొప్పన మత్తుపదార్థం మొత్తం తొంభై కిలోల క్లోరో హైడ్రేడ్ లభించిందని తెలిపారు. అయితే మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన మంద అరుణ్ వద్ద నుంచి క్లోరో హైడ్రేడ్‌ను తీసుకువచినట్లు రాజేశ్వర్ గౌడ్ ఎక్సైజ్ అధికారులకు తెలిపాడని దాని ఆధారంగా ధర్మోరాలో అరుణ్‌గౌడ్ ఇంటిపై దాడి చేయగా ముప్పై కిలోల క్లోరో హైడ్రేడ్‌తో పాటు ఓ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరుణ్‌కుమార్ గౌడ్‌ను విచారించగా క్లోరో హైడ్రేడ్ వ్యాపారం ఆర్మూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సునీల్ గౌడ్‌తో కలిసి నిర్వహిస్తున్నాట్లు తెలిపారని అన్నారు.



ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా తెలంగాణ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా తెలంగాణ అడవులు, అర్బన్ పార్కులను ప్రకటించనున్నట్టు అటవీ శాఖా మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం (మార్చి 21)ని పురస్కరించుకొని హైదరాబాద్ శివారు కండ్లకోయ అర్బన్ ఫారెస్టు పార్కు (ఆక్సిజన్)లో పక్షుల కేంద్రం పనులను మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఈ అర్బన్ పార్కు ఆకర్షణీయంగా ఉందన్నారు. ఆరోగ్య తెలంగాణ రాష్ట్ర లక్ష్యంగా అటవీ బ్లాకుల్లో అర్బన్ పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంద న్నారు. త్వరలో కీసర, శామీర్‌పేటలో ఉన్న పార్క్‌లను అభివృద్ధి చేస్తామన్నారు. ఆ తరువాత అటవీ అధికారులతో సమావేశమైన ఆయన ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న అనర్థాలు, పర్యావరణ పరంగా పొంచి ఉన్న ముప్పుపై చర్చించారు. అడవుల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలు వ్యూ ప్రాయింట్లు, వాటర్‌ఫాల్స్, ఫారెస్టు అర్బన్ పార్కులను చూడడానికి సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోం దన్నారు. ఇదే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతు న్నాయని అధికారులు మంత్రితో పేర్కొన్నారు. దీనికి స్పందించిన మంత్రి ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కేరళ ప్రభుత్వం కొన్ని అటవీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్‌ను తీసుకెళ్లే సందర్శకుల నుంచి నామమాత్రం రుసుం తీసుకొని ఆ తరువాత ప్లాస్టిక్‌ను తిరిగి ఇస్తే ఆ మొత్తాన్ని వెనక్కి ఇస్తోందని అధికారులు మంత్రితో పేర్కొన్నారు. అదే రీతిలో మన దగ్గర క ూడా ప్రయోగాత్మకంగా అర్బన్ పార్కుల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక్కడ సక్సెస్ అయితే అన్ని ప్రాంతాలకు దీనిని విస్తరించాలన్న ఆలోచనలో ఉన్నట్టు పీసీసీఎఫ్ పీ.కె.ఝా వెల్లడించారు. అంతక ుముందు కండ్లకోయ పార్కును సందర్శించిన మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎం.వీ.రెడ్డి, ఇతరన ఉన్నతాధికారులు పక్షుల కేంద్రం శంకుస్థాపనలో పాల్గొన్నారు.

రైతులకు న్యాయం
జరిగే వరకు పోరాటం తప్పదు



టీజేఏసీ ఛైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం

భైంసా, ప్రభ న్యూస్ : ప్రత్యేక రాష్ట్రంలో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడదామని టీజేఏసీ ఛైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. బుధవారం భైంసా పట్టణంలోని కాటన్ మార్కెట్ యార్డులో వ్యవసాయ సంక్షభంపై నిర్వహించిన రైతాంగ సమాలోచన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల తరహాలో రైతు పోరాటాలను చేయాలని రైతులకు సూచించారు. రాష్ట్రంలో 55 శాతం ఉన్న రైతులకు వ్యవసాయం తప్ప వేరే పనిచేసే అవకాం లేదని తమతో పాటు ఎందరికో ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. రైతులతో పాటు కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ట్రాక్టర్‌లు, పరికరాలు టీఆర్ఎస్ కార్యకర్తలకే దక్కుతున్నట్లు అన్నారు. ఐక్యంగా పోరాడి న్యాయం సాధించుకుందామని రైతులకు కోరారు.

అన్న చేతిలో తమ్ముడి హతం

తానూర్, ప్రభ న్యూస్ : సాగునీటి కోసం క్షణికావేశంలో తన సొంత తమ్ముణ్నే హతమార్చిన సంఘటన నిర్మల్ జిల్లా, తానూర్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని జౌలా(కె) గ్రామంలో ఇఫ్తెకర్ గంగాధర్ అనే రైతుకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు దత్తు, చిన్న కుమారుడు శంకర్. గంగాధర్‌కు 16 ఎకరాల భూమి ఉండగా ఆయన వృద్ధుడు కావడంతో ఇరువురు కొడుకులకు ఒక్కొక్కరికి 6 ఎకరాల భూమిని పంచి ఇచ్చాడు. మిగిలిన నాలుగెకరాల భూమిని తాను ఉంచుకొనగా అందుగా ఇటీవల బోరు బావి తవ్వించాడు. ఆ బోరు బావికి నీరు ఎక్కువ ఉండడంతో సాగునీటి కోసం ఇరువురు అన్నదమ్ముల మధ్యన గొడవలు ప్రారంభమయ్యాయి. తండ్రి ఇద్దరిని పిలిపించి వారానికి ఒకరు తమ భూమికి సాగునీరు ఇచ్చుకుని పంటలు పండించుకోవాలని సూచించాడు. ఇదే విషయమై పలుమార్లు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు సైతం చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తమ్ముడు శంకర్ అన్న దత్తుపై దాడికి పాల్పడ్డాడు. మాటామాటా పెరగగా కోపోద్రిక్తుడైన అన్న దత్తు కర్రతో తమ్ముడు శంకర్‌పై దాడిచేయగా తీవ్రంగా గాయపడ్డాడు. శంకర్‌ను స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రి నుంచి నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స జరుపుతుండగా మరణించాడు.

ప్రభుత్వ ఉద్యోగుల అంతర్ రాష్ట్రస్థాయి
క్రీడల నిర్వహణ అభినందనీయం



ఎంపీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్ : అంతర్ రాష్ట్ర స్థాయి ప్ర భుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ నిజామాబాద్ జిల్లాలో నిర్వహించడం గర్వకారణమని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ గ్రౌండ్‌లో జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర స్థాయిలో స్పోర్ట్స్‌మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. 31 జిల్లాల నుంచి స్పోర్ట్ లో పాల్గొనడానికి వచ్చిన మహిళా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసే బాధ్యత టీఎన్జీవోల నాయకులేదనన్నారు. కొత్త రాష్ట్రం ముందుకెళ్లాలంటే ప్రభుత్వంలో ఉండే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సాధ్యపడేది కాదని ప్రజాప్రతినిధులు అందరూ చట్టాలు చేయగలగుతారని, పాలసీలు క్రియేట్ చేయగలుగుతామని కార్యక్రమాలు రూపకల్పన చేయగలుగుతారని కానీ రూపకల్పన చేసినటు వంటివి ఇంప్లిమెంట్ చేయడం సంపూర్ణంగా ఉద్యోగస్తుల మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఈ విషయం తెల్సిన ముఖ్యమంత్రి మొట్టమొదట సంవత్సరం మొట్టమొదటి మీటింగ్‌లో ఉద్యోగులకు చెప్పడం జరిగిందన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 22 మార్చి 2018

లింగాయత్.. సిద్ధూ అస్త్రం

లింగాయత్ అనేది ఒక సామాజిక వర్గం. ఆ వర్గానికి చెందిన వారు కర్నాటకలో అధిక సంఖ్యలో ఉన్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించిన బసవణ్ణ లింగాయత్‌లకు మూల పురుషుడు. లింగాయత్‌లలో ఉప వర్గం వీర శైవులు. ఇరు సామాజిక వర్గాలకా బసవణ్ణే ఆరాధ్యుడు. తెలుగు కవి పాల్కురికి సోమనాథుడు రాసిన బసవ పురాణం వీరికి మహాగ్రంథం. ఎన్నికల సమయంలో వీరిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్. బీజేపీలది ఒకే తీరు. ప్రస్తుత ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్ధ రామయ్య మరో అడుగు ముందుకు వేసి లింగాయత్‌లకు మతం హోదా కల్పిస్తూ కేంద్రానికి సిఫార్సు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి అమలు జేయలేకపోయిన కమలనాథులకు ఇప్పుడు ఇది మరో పెను సమస్యగా పరిణమించింది. అసలు వారిని అలా ఇరుకున పెట్టేందుకే సిద్ధ రామయ్య ఈ సిఫార్సు చేశారేమోనన్న ఆరోపణ నిరాధారం కాకపోవచ్చు. కర్నాటకలో ఐదేళ్ళ నుంచి అధికారంలో కొనసాగుతున్న సిద్ధరామయ్య ప్రభుత్వం పట్ల వ్యతిరేకత సాధారణ స్థాయిలోనే ఉంది. అవినీతి ఆరోపణలు వచ్చినా, అవి వెనుకటి బీజేపీ పాలనతో పోలిస్తే తక్కువే. యెడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అవినీతి, అక్రమాలపై లోకాయుక్త ఇచ్చిన తీర్పుల ఫలితంగా, యెడ్యూరప్ప, గాలి జనార్ధనరెడ్డి, బి.శ్రీరాములు వంటి మంత్రివర్గ సహచరులు జైలుకి వెళ్ళారు. ఇతర వెనకబడిన వర్గాల (ఒబీసీల)కు చెందిన సిద్ధరామయ్య తిరిగి అధికారాన్ని చేపట్టాలని ఆ రాష్ట్రంలోని వారే కాక, తెలుగు రాష్ట్రాల వారు కూడా పలువురు కోరుకుంటున్నారు. ఆయన తరఫున ప్రచారానికి వెళ్తామని ప్రకటనలు కూడా చేశారు. ఎన్నికల ముందు సంక్షేమ పథకాలను లెక్కకు మిక్కిలిగా సిద్ధరామయ్య ప్రవేశపెట్టారు. వాటిల్లో పేదలకు సబ్సిడీ భోజనం ముఖ్యమైంది. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రభుత్వ వ్యతిరేకత పని చేస్తుందేమోనన్న బెదురు ఆయనలో ఉంది. దానికి తోడు కమలనాథులు మతం కార్డును ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నారన్న వార్తలు వచ్చాయి. వారికన్నా తాను ఒక అడుగు ముందుకు వేయాలన్న ఉద్దేశంతోనే ఆయన లింగాయత్ వర్గాన్ని మతంగా ప్రకటించాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. రిజర్వేషన్లు, ప్రత్యేక హోదాలు, ప్రత్యేక సాయం వంటివి ఎన్నికల ముందు ప్రచారానికి రాజకీయ పార్టీల అస్త్రాలు. తమ ప్రయోజనం సిద్ధించగానే ఆ అస్త్రాలను అమ్ముల పొదిలోకి నెట్టేస్తుంటాయి. ఈ విషయంలో అన్ని పార్టీలదీ ఒకే తీరు. సిద్ధ రామయ్య వేసిన ఎత్తుకు ప్రధానమంత్రి మోడీ పై ఎత్తు ఎలా ఉంటుందో కొద్ది రోజుల్లో తెలియవచ్చు. ఈశాన్యంలో కాషాయి జెండాను ఎగుర వేశామన్న సంబరంలో ఉన్న కమలనాథులు కర్నాటకలో తిరిగి అధికారాన్ని సాధించేందుకు అన్ని వ్యూహాలకూ పదును పెడుతున్నారు. సిద్ధ రామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కారణంగా వేగుల నుంచి అందిన సమాచారం మేరకే ఆయన కమలనాథుల ముందరకాళ్ళకు బంధం వేసి ఉంటారు. అయితే, ఈ ఎత్తుగడ ఎంతవరకూ పారుతుందనేది ఊహకందని విషయం. లింగాయత్ వర్గాన్ని మైనారిటీ కమిషన్ చట్టంలోని సెక్షన్ 2(డి) కింద గుర్తించాలని ఆయన సిఫార్సు చేశారు. దీంతో తమకు లభించే ప్రయోజనాలు దెబ్బతింటాయని మైనారిటీ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. దశాబ్దాలుగా కర్నాటకలో మైనారిటీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకుంటోంది. కర్నాటకలో లింగాయత్‌లకు మైనారిటీ ప్రతిపత్తిని కల్పిస్తామని కాంగ్రెస్ చాలా కాలంగా వాగ్దానం చేస్తోంది. అదే స్థాయిలో ఆ పార్టీకి ప్రతిఘటనా ఎదురవుతోంది. ఎన్నికల ముందగు జాప్యం చేయడం వల్ల నష్టం వాటిల్లుతుందని సిద్ధరామయ్య కేంద్రానికి సిఫార్సు చేశారు. ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేకపోవడం వల్ల పార్లమెంటులోనూ, వెలుపలా తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న బీజేపీ ఈ విషయంలో ఆచితూచి అడుగు వేస్తోంది. సిద్ధ రామయ్య ఈ సిఫార్సు చేయడం ద్వారా కొరివితో తలగోక్కున్నట్టు అయింది. వీర శైవులు తమ సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. మంత్రివర్గంలోనే దీనిపై విభేదాలు ఏర్పడ్డాయి. వీటిని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి కమలనాథులు పావులు కదుపుతున్నారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పుట్టిన లింగాయత్ సామాజికవర్గంలోనూ, దాని ఉపకులమైన వీరశైవుల్లోనూ 92 ఉపకులాలు ఎందుకు పుట్టాయన్నది జగద్విదితం. శైవుల్లో శాకాహారులు, మాంసాహారులు, ఆచారాలు పాటించేవారు, అందరితో కలిసిపోయేవారు ఇలా పెక్కు చీలికలు ఉన్నాయి. పెళ్ళిళ్ళు, ఇతర సామాజిక కార్యక్రమాల్లో వీరందరూ కలవరు. ముఖ్యంగా గౌడ లింగాయత్‌ల పెత్తనం ఎక్కువైందన్న ఫిర్యాదులు చాలాకాలంగా వస్తున్నాయి. యెడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీనిపై విభేదాలు భగ్గుమన్నాయి. తెలుగునాట అలనాడు ఎప్పుడో చాపకూటి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అమలు జేసిన బ్రహ్మనాయుడు మాదిరిగా కర్నాటకలో పురంధరదాసు, కనకదాసు వంటి భాగవతోత్తములు శతాబ్దాల క్రితమే విస్తృతంగా ప్రచారం చేశారు. లింగాయత్‌లకు ప్రస్తుత గురువు సిద్ధ గంగ పీఠాధిపతి. ఆయన నేతృత్వంలోని సిద్ధ గంగ మఠానికి వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అవి తమవేనంటూ దళితులు ఆ మధ్య పెద్ద ఎత్తున ఆందోళన సాగించారు. సిద్ధ గంగ పీఠాధిపతికి మహిమలు ఉన్నాయన్న ప్రచారాన్ని ఆయన శిష్యులు విస్తృతంగా చేయడం వల్ల గత ఎన్నికల ముందు ఆయన దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ రాగా, ఆమెకు యెడ్యూరప్ప ఎర్రతివాచీ స్వాగతం పలికారు. దాంతో ఆయన కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తున్నారన్న ఊహాగానాలు వ్యాపించాయి. కర్నాటకలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పీఠాధిపతుల ప్రాభవం పెరుగుతూ ఉంటుంది. సంఖ్యాపరంగా లింగాయత్‌ల బలం ఎక్కువ కావడం వల్ల వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించడం రాజకీయ పార్టీల సహజ లక్షణమని సరిపెట్టుకోవడానికి వీలులేదు. మైనారిటీ వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్లలో కోతపెట్టి లింగాయత్‌లకు ఇస్తే వారు అగ్గిమీద గుగ్గిలం అవుతారు. కాంగ్రెస్‌కి ముస్లింలను ఓటు బ్యాంకుగా చేసేందుకు మాజీ రైల్వే మంత్రి సికె జాఫర్ షరీఫ్ వంటి మైనారిటీ నాయకుల శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. సిద్ధ రామయ్య అధిష్టానాన్ని సంప్రదించే ఈ నిర్ణయం తీసుకున్నారా లేదా అన్నది ఇదమిత్థంగా తెలియదు. ఏమైనా ఈ నిర్ణయం వల్ల కాంగ్రెస్‌కు మేలు కన్నా చేటే ఎక్కువ.

మంచి మాట

అస్తిత్వాన్ని చైతన్యం నిర్ణయించదు.
అస్తిత్వమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది.
-కార్ల్ మార్క్స్

అప్రమత్తతతోనే ప్రమోదం

జలం జీవనాధారం.. తాగడానికి గుక్కెడు నీరు లేక గొంతెండిపోయి విలవిలలాడుతున్న వారు కోట్ల సంఖ్యలో ఉంటారు. విధిలేని పరిస్థితుల్లో అపరిశుభ్రమైన నీటిని తాగి, వ్యాధుల బారిన పడి, ఆపై మృత్యు ఒడికి చేరుతున్నారు. ప్రకృతిలో సహజంగా లభించే జీవన వనరులలో జలం ఒకటి. కొండకోనల్లోంచి దూకుతూ.. నదులుగా మారి పరిసరాలను సస్యశ్యామలం చేస్తూ పారుతున్న జలాలను ఇంతవరకూ చూశాం. ప్రస్తుతం ఆ స్థానంలో కశ్మలంతో నిండిన నీళ్ళు దర్శనమిస్తున్నాయి. పారిశ్రామికవ్యర్థాలు.. రసాయనిక అవశేషాలు.. ఇలా అంతులేని కాలుష్యకారకాలు నీటిలో కలుస్తూ విషతుల్యం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి. గోదావరి పక్కనే ఉన్నా ఇదే దృశ్యం. నైలు నది సమీపంలో ఉన్నా ఇదే సన్నివేశం. నదులుండి ఒకడు బాధపడితే.. నదులు లేక బాధపడేవాడొకడు. భూగర్భ జలాలు ఇంకిపోయి... మట్టం పాతాళానికి చేరిపోతోంది. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి సంక్షోభాన్ని నివారించేందుకు మనవంతు కృషిని చేద్దాం.


జనాభాకు అవసరమైన నీరు భారత్‌లో అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని అధిగమించడం ఎలా? భారత్‌లో 6కోట్ల 30లక్షల మందికి పరిశుభ్రమైన జలం అందుబాటులో ఉండడం లేదు. దీన్ని అధిగమించడానికి అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ సంక్షోభం సూచిస్తోంది. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలో ఇంకేలా చేయకపోతే.. పరిస్థితులు మరింత దిగజారిపోతాయి. నీటి పరిరక్షణకు పెద్ద మొత్తంలో ఆర్థిక పెట్టుబడులు పెట్టాలి.

ప్రపంచంలో ప్రతి వనరూ అదృశ్యమైపోతున్నాయి. అందులో నీరు ప్రధానమైనది. కుండలో నీళ్ళు నిండుకోకుండా చూసుకోవాలి. పరిశుభ్రత మొదలు వివిధ పనులలో వాడకం నీటిని వృధా చేయకుండా చూసుకోవాలి. ఇకపై నీటిని విచ్చలవిడిగా వాడటానికి వీలు లేదు. నీటి సంక్షోభం రక్కసిలా మారి ప్రపంచాన్ని కమ్మేయకముందే ప్రతి ఒక్కరూ మేల్కొనాలి. ఐక్య రాజ్య సమితి సర్వే ప్రకారం భూమిపై 2.1 బిలియన్ల మందికి సురక్షితమైన నీరు అందుబాటులో లేదు. ఇది ప్రపంచ జనాభాలో 28శాతానికి సమానం. వాతావరణ మార్పులు, ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న జగడాలు, ఎండిపోతున్న నీటి వనరులు దీనికి కారణం. భారత్‌లో మంచినీటికి నోచుకోని వారి సంఖ్య కోట్లలోనే ఉంది. గృహ, పారిశ్రామిక అవసరాలకోసం విచక్షణారహితంగా నీటిని విచ్చలవిడిగా వాడేస్తున్న కారణంగా అది ఇక నిత్యం లభించే జాబితా నుంచి తొలగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి కేప్‌టౌన్‌లో చుక్క నీరు లభ్యంకాని పరిస్థితి ఏర్పడింది. కరవు, తదితర కారణాలున్నప్పటికీ.. నీటి వినియోగం ఏమాత్రం తగ్గకపోవడం దీనికి ప్రధాన హేతువు. ఆ ప్రాంతంలో నీటి వనరులు క్రమేపీ అంతరించిపోతూ వచ్చాయి. నీటి పరిరక్షణకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం ఆత్మహత్యాసదృశంగా మారింది. సహజ నీటి వనరులు కనుమరుగయ్యాయి. ఇవి ఆ నగరాన్ని కోలుకోలేని స్థితికి చేర్చేశాయి. సావో పౌలో, బీజింగ్, కైరో, మెక్సికో నగరాలు సైతం మంచినీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

నీరు అస్సలు లభించని పరిస్థితులున్న నగరాల్లో భారత్‌లోని బెంగళూరు ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. ఈ సంక్షోభం త్వరలో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాలనూ తాకబోతోంది. ఈ నగరాల్లో భూగర్భ జలాలు ఇంచుమించుగా కనుమరుగయ్యాయి. వీటిమీద ఎక్కువగా ఆధారపడడమే దీనికి ప్రధాన కారణం. ఇదే జల వనరులు అదృశ్యానికి దారితీస్తున్నాయి. పరిస్థితి మరింత అధ్వానం కాకముందే కళ్ళు తెరిస్తే మేలు. అది భూగర్భ జలాలు కానీ, నీటి వనరులు కానీ.. ఏదైనప్పటికీ వృధాగా ఖర్చుచేయడం మానాలి. లేకపోతే.. నీరు అదృశ్యమైపోతుంది. భారత్‌లో ప్రస్తుతం 395 బిలియన్ క్యూబిక్ మీటర్ల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. మరోపక్క, 2015నుంచి నీటి వినియోగం 66శాతం పెరిగింది. 2004లో ఇది 58శాతమే. జల నిపుణులు ఈ అంశంపై తీవ్రంగా కలతచెందుతున్నారు. 2025నాటికి భారత్‌లో భూగర్భ జలాల వినియోగం 75శాతానికి చేరుతుందని అంచనా. గణాంకాల దృష్ట్యా చూస్తే ఇది ఆందోళన కలిగించే అంశం. కేప్‌టౌన్ తరహా సంక్షోభాన్ని తప్పించుకునేందుకు దేశంలోని పట్టణ ప్రాంతాలు తమ నీటి వాడకాన్ని గణనీయంగా తగ్గించుకోవాలి. వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగ పద్ధతులపై ఆధారపడాలి.

నేడు వరల్డ్ వాటర్ డే

పళ్ళు తోముకునే సమయంలో కొందరు నీటిని ఎక్కువగా వినియోగిస్తారు. షేవ్ చేసుకునే సమయంలోనూ కుళాయిని తిప్పి ఉంచుతారు. పాత్రలు శుభ్రం చేసుకునేటప్పుడైనా, భోజనం తరవాత చేతులు కడుక్కునే సమయంలోనైనా అందరూ ఇదే తీరు. ఎంతో నీరు వృథా అయిపోతుంటుంది. ఈ సందర్భంలో మన పెద్దలు చెప్పిన మాట ఒకటి గుర్తుకు రాక మానదు. నీళ్ళు ఎక్కువగా వాడితే డబ్బు కూడా ఎక్కువగా ఖర్చయిపోతుంది.. ఆ ఇంటిలో లక్ష్మి నిలబడదని పెద్దలు అన్న విషయం మదిలో మెదిలిందా.. నీటి వినియోగం ఏ రంగంలోనైనా తక్కువగా చేయాలి. దానితో పాటు పరిరక్షించుకోవాలి. లేకుంటే భవిష్యతరాలు నీటికి కటకటలాడతాయి. కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్ళి తెచ్చుకోవడానికి సైతం నీరు దొరకదు.. ఇది నిజం..



గొట్టపు బావులు, బోర్ వెల్స్, నీటిని తోడే యంత్రాలు భూగర్భ జలాల పాలిట శాపంగా పరిణమించాయి. వీటి వినియోగం పూర్తిగా తగ్గాలి. దీనివల్ల భూగర్భంలో మిగిలున్న కొద్దిపాటి జలాన్ని భావితరాల కోసం సంరక్షించే అవకాశముంటుంది. పారిశ్రామిక అవసరాలకు రీ సైకిల్డ్ వాటర్‌ను వినియోగించుకోవచ్చు. వాణిజ్యావసరాలకూ వీటిని వాడవచ్చు.

కొద్ది సంవత్సరాలుగా భారత్‌లో నీటి అవసరాలు విపరీతంగా పెరిగిపోయాయి. 2000 సంవత్సరంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదిక మేరకు భారత్‌కు 634 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరమని తేలింది. 2025నాటికి ఇది 1093బిలియన్ క్యూబిక్ మీటర్లకూ, 2050నాటికి 1447 బిలియన్ క్యూబిక్ మీటర్లకూ పెరుగుతుందని అంచనా వేసింది. తలొక్కింటికీ అవసరమైన నీటి లభ్యత కూడా తగ్గుతూ వస్తోంది. 1951లో ఇది 5177క్యూబిక్ మీటర్లుగా ఉంది. 1991లో అది 2237క్యూబిక్ మీటర్లకు తగ్గింది. 2001లో 1816క్యూబిక్ మీటర్లకూ, 2011లో 1545 క్యూబిక్ మీటర్లకూ తగ్గిపోయింది. 2050నాటికి ఇది 1140క్యూబిక్ మీటర్లకు పడిపోతుంది. ఈ గణాంకాలు దేశం ఎదుర్కొనబోయే నీటి సంక్షోభాన్ని సూచిస్తున్నాయి.

పశ్చిమ ఆఫ్రికాలోని సియెరా లియోన్ అనే ఓ దేశం 2010నాటికి ప్రపంచంలోనే అత్యంత దుర్భరమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మనిషికి పది లీటర్ల కంటే నీరు లభించడం లేదు. ఆ పరిమాణానికి కూడా విపరీతంగా డబ్బును వెచ్చించాల్సి వచ్చింది. 2011నుంచి ఆ దేశంలో వర్షపు నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టారు. ఆ దేశంలో 40శాతం విస్తీర్ణం ఈ పద్ధతిని పాటిస్తున్నారు. వాన నీటి సంరక్షణ పద్ధతిలో నిల్వ చేసిన జలాలను వివిధ అవసరాలకు వినియోగించుకోవచ్చు. వ్యవసాయానికి సైతం ఈ నీరు ఉపయోగపడుతుంది. భారత్‌లో వ్యవసాయానికి భూగర్భ జలాలనూ, నదులు, చెరువుల నీటిని ఎక్కువగా వాడతారు. సింగపూర్, థాయ్‌ల్యాండ్, జపాన్, ఇండోనేసియా, బంగ్లాదేశ్ వంటి దేశాలు వ్యవసాయానికి వాన నీటిని విజయవంతంగా వినియోగిస్తున్నారు. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌ను చూసైనా భారత్ పాఠం నేర్చుకోవాలి.

పట్టణీకరణ, నీటి సంక్షోభం మధ్య సంబంధంపై 2013లో వరల్డ్ వాటర్ కౌన్సిల్ ఒక సర్వే నిర్వహించింది. హేతుబద్ధంగా లేని పట్టణీకరణ, పెరుగుతున్న ఆర్థిక వనరులు నీటి మట్టాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆ అధ్యయనం తేల్చింది. భారత్‌లో బెంగళూరు, ఢిల్లీ, ముంబై, తదితర నగరాల అనూహ్య విస్తరణ భూగర్భ జల మట్టాలను తగ్గించేస్తోంది. నదీ తీరాలలో నివసించే జనాభా పెరుగుదల సైతం పట్టణీకరణ నీటిని ఏ విధంగా ప్రభావితం చేస్తోందో చెప్పడానికి మంచి ఉదాహరణగా నిలుస్తోంది. ఒక జల వనరుకు సమీపంలోని వాణిజ్య లేదా నివాస సముదాయాలను తమ పరిధిని నియంత్రించేలా చేయడం నీటి సంరక్షణ దిశగా చేపట్టే ఒక చర్యగా చెప్పొచ్చు. భారత్‌లో నీటి సంక్షోభాన్ని నివారించాలన్న దృఢనిశ్చయం ఉంటే ఇది ఒక చక్కటి చర్య కాగలదు. భారత్‌లో నీటి సంరక్షణ ప్రాజెక్టులపై ఎక్కువ మొత్తాన్ని వెచ్చించాలి. 2013లో నీటి వినియోగం వెయ్యి బిలియన్ క్యూబిక్ మీటర్లు. చిన్న దేశాలతో పోలిస్తే మన దేశంలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్నట్లే. అవసరానికి తగ్గట్లుగా భారత్‌లో ఎక్కువ మొత్తాలను బడ్జెట్లో కేటాయించాలి. నమామి గంగా కార్యక్రమానికి 20వేల కోట్ల రూపాయలను కేటాయించడం ఇందుకో ఉదాహరణ. ఈ కార్యక్రమం గంగా నదిని పరిశుభ్రం చేసేందుకు ఉద్దేశించారు. దీనివల్ల గంగా ప్రవాహం పెరిగి, నీరు మరిన్ని ప్రాంతాలకు చేరుతుంది. ఇలాంటి తరహా ప్రాజెక్టులను భారత్ మరిన్ని చేపట్టాలి. 2017లో చైనా 64వేల కోట్ల రూపాయలను నీటి సంరక్షణ ప్రాజెక్టులకు కేటాయించింది. భూగర్భ జలాల వాడకాన్ని తగ్గించడం కోసం ఆ దేశం నీటిని సంరక్షించడానికి పెద్దపెద్ద నిర్మాణాలను చేపడుతోంది. బ్రెజిల్ ప్రభుత్వం నీటికి రేషన్ కేటాయించి పౌరులను జాగృతం చేశారు. ఈ చర్య రిజర్వాయర్ల నుంచి నీటి వాడకాన్ని 22శాతం మేర తగ్గించింది. వినియోగం.. రిజర్వాయర్లను నింపడం మధ్య వ్యత్యాసాన్ని కూడా ఇది పెంచింది. భారత్‌లో నమామి గంగా ప్రాజెక్టు ఒక్కటే పరిస్థితులను చక్కదిద్దలేదు. భూగర్భ జలాలను పెంచడాన్ని ప్రాధాన్యంగా తీసుకుని, తగిన మొత్తాన్ని ఇందుకోసం వెచ్చిస్తే ఫలితముంటుంది. తూర్పు ఆఫ్రికాలో అతి పేద దేశం టాంజానియా. 1990 దశాబ్దం మధ్యలో ఆ దేశంలో మంచినీటి సంక్షోభం తీవ్రస్థాయికి చేరింది. దీన్ని అధిగమించడానికి నీటిని సంరక్షించే పద్ధతులపై ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఇది సత్ఫలితాలను ఇచ్చింది. 2010నాటికి దేశంలోని 50శాతం వ్యవసాయం వర్షపు నీటితోనే నిర్వహించుకునే స్థాయికి ఎదిగింది. ఆర్థికంగా ఎదగడం ఒక్కటే నీటి పరిరక్షణకు కీలకం కాదని చెప్పడానికి ఇది చక్కటి ఉదాహరణ. ప్రజలలో అవగాహనను పెంచి, అప్రమత్తం చేయడం, నీరు నిరంతరం లభించే వనరు కాదని వారికి తెలియజెప్పడం నీటి పరిరక్షణ ఉద్యమంలో భాగం చేయాలి. అప్పుడే భవిష్య తరాలకు మంచినీటిని అందించగలుగుతాం.

-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి

కేంద్రీకరణ.. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల ఒక ఆర్థిక సదస్సులో మాట్లాడుతూ తమ ప్రభుత్వం 400 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందనీ, వాటి ఫలితాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని ప్రకటించారు. వరుస ఎన్నికల విజయాలతో ఆయనలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్న మాట నిజమే. అలాగే, సమీప భవిష్యత్ లో ఆయనకు ఎదురు నిల్చే నాయకుడు లేని మాటా నిజమే, కానీ, అంతటి స్థాయిలో ఉన్న నాయకుడు ఏం చెబితే అది జనం నమ్మితీరాలని అనుకుంటే వాస్తవాన్ని విస్మరించినట్టే. ఆయనే పేర్కొన్నట్టు సంక్షేమ పథకాల ఫలాలన్నీ లబ్ధిదారులకు చేరుతున్నట్లయితే, పేదల సంఖ్య తరగడం లేదే. దేశంలో సంపద పెరుగుతోంది, కానీ అది కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతం అవుతోందని ఆక్స్ ఫోమ్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఆర్థిక సదస్సులో మోడీ ప్రకటించిన సమయంలోనే ఈ సర్వే నివేదిక వెల్లడైంది. అంటే ప్రభుత్వానికి అందే సమాచారం సరైనది కాదని అనుకోవాల్సి ఉంటుంది. పూర్వపు ప్రభుత్వం అమలులో పెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి మంచి పథకాలకు కూడా నిధుల్లో కోత విధించడం వల్ల అది సక్రమంగా అమలు జరగడం లేదు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి, తెరాస అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు ఇటీవల డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఇదే మాదిరిగా డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని క్షేత్ర స్థాయిలో అమలు జరపాల్సింది రాష్ట్రాలే అయినప్పుడు, రాష్ట్రాల మాటకు కేంద్రం విలువ ఇవ్వాలి కదా. గ్రామాలకు అనుసంధాన రోడ్లు వేయించుకోవాలన్నా కేంద్రం నుంచి అనుమతులు తెచ్చుకోవల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఇటీవల ముఖ్యమంత్రులు చేస్తున్న వ్యాఖ్యల్లో అసత్యంలేదు. రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించిన నిధులకు లెక్క చెబితేనే మరుసటి సంవత్సరం నిధులు విడుదల చేస్తామని కేంద్రం ఖరాకండీగా చెబుతోంది. అంటే ఆర్థిక కేంద్రీకరణ జరుగుతోంది. అధికారాలు కేంద్రీకృతమైతే ఫెడరల్ వ్యవస్థ స్వరూపమే మారిపోతుంది. అందుకే, ఇప్పుడు బీజేపీయేతర ముఖ్యమంత్రులంతా ఇప్పుడు ఫెడరల్ స్ఫూర్తిని పాటించాలంటూ గళమెత్తుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద నవ్యాంధ్రకు రావల్సిన నిధుల విషయంలో కేంద్రం ఇదే మెలిక పెట్టింది. నిధుల కేటాయింపులపై కేంద్రం పర్యవేక్షణ ఉండటంలో తప్పు లేదు కానీ, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కూడా ప్రజల చేత ఎన్నుకోబడినవే కనుక, నిధులు ఖర్చు చేయడంలో వాటికి ఆమాత్రం స్వేచ్ఛ లేకపోతే ఎలా అనే ప్రశ్న సహేతుకమైనదే. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ అంశం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశం కావడం వల్ల ఈ అంశాలన్నీ బయటకు వస్తున్నాయి. కేంద్రంలోనూ, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సమస్యలేవీ ఉత్పన్నం అయ్యేవి కావు. కేంద్రంలో, రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే ఈ వివాదాలు తలెత్తుతున్నాయి. అయితే, సంక్షేమ పథకాల నిధుల బట్వాడాకు ఆధార్ అనుసంధానం ప్రవేశపెట్టడం వల్ల కొంత మేర మేలు జరిగిన మాట వాస్తవమే. కానీ, ఆధార్‌ని సంక్షేమానికి ముడిపెట్టవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం వల్ల అది కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఒక్క రాష్ట్రాల విషయంలోనే కాదు, వివిధ ప్రభుత్వ శాఖల పద్దులకు కేటాయింపులో కూడా మోడీ ప్రభుత్వం వ్యయకర్తనానికి ప్రాధాన్యం ఇస్తున్న మాటనిజమే. ప్రభుత్వ వ్యయంలో దుబారా తగ్గించడం కోసం పూర్వపు ప్రభుత్వాలు కూడా ప్రయత్నాలు చేశాయి. అయితే, రాజకీయ పరమైన ఒత్తిడుల మేరకు తాము విధించుకున్న



నియమాలనే ఉల్లంఘించాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి తప్పవని వాదించేవారున్నారు. ఏనాడూ బ్యాంకు ముఖం చూడని నిరుపేదల కోసం జన్‌ధన్ యోజన పేరిట జీరో బ్యాలెన్స్ ఖాతాలను తెరిపించామంటూ ప్రధానమంత్రి పదే పదే ప్రకటిస్తున్నారు. ఈ ఖాతాల్లో 75 వేల కోట్ల రూపాయిలు జమ అయ్యాయని చెబుతున్నారు. కూటికి లేని నిరుపేదలు ఇంత పెద్ద మొత్తాలను బ్యాంకులలో ఎలా జమ చేయగలిగారన్నది అంతు చిక్కని విషయమే. పెద్దనోట్లు రద్దు సమయంలో పాత నోట్లను మార్చుకోవడానికి మార్గాల అన్వేషణలో నల్ల కుబేరులు ఈ జన్‌ధన్ ఖాతాల్లో వేల కోట్ల రూపాయిలను జమ చేసినట్టు కథనాలు వెలువడ్డాయి. జన్‌ధన్ పథకం విఫల ప్రయోగమని బ్యాంకింగ్ రంగానికి చెందిన నిపుణులే పేర్కొంటున్నారు. నల్ల ధనాన్ని దాచుకోవడానికి మాత్రమే ఈ ఖాతాలు ఉపయోగపడుతున్నాయన్న ఆరోపణల్లో అసత్యంలేదు. డబ్బు జమ చేసే చలానాలను పూరించలేని నిరక్షరాస్యుల ఖాతాల్లో ఇంత పెద్ద మొత్తం జమ అయిందంటే నమ్మశక్యం కాని విషయం. అందువల్ల జనధన్ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు సరికదా, మధ్య తరగతి వారి సేవింగ్స్ ఖాతాల్లో కనీస నిల్వ ఐదువేలు ఉండి తీరాలన్న నిబంధన ప్రవేశపెట్టడం వల్ల ఈ వర్గాలు చాలా నష్టపోయాయి. దీనిపై ఆందోళన జరిపితే చివరికి ఆ పరిమితిని వెయ్యి రూపాయిలకు తగ్గించారు. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలను ప్రవేశ పెడుతున్నట్టు, మూలధనాన్ని సమకూరుస్తున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తరచూ ప్రకటనలు చేస్తున్నారు అయితే, రుణాల ఎగవేత దారుల వల్ల బ్యాంకుల్లో మూల ధనం నిల్వలు తరిగి పోవడంతో వాటికి ప్రత్యేకంగా మూల ధనాన్ని విడుదల చేస్తున్నారు. అంటే, ప్రస్తుతం ఈ మూలధనాన్ని విడుదల చేయకపోతే అవి మూత బడటం ఖాయం. ఇప్పటికే, స్టేట్ బ్యాంకు అనుబంధ బ్యాంకులను నడపలేక విలీనం చేశారు. ఇలాంటివి ఇంకా ఎన్నో చర్యలను తీసుకుంటే తప్ప బ్యాంకింగ్ రంగాన్ని గట్టెక్కించడం సాధ్యం కాదని ఆ రంగానికి చెందిన నిపుణులే పేర్కొంటున్నారు.

ప్రధానమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం వల్ల కోటి ఉద్యోగాలు కొత్తగా రావల్సి ఉండగా, అది కేవలం కాగితాలకే పరిమితమైనదిగా కనిపిస్తోంది. మేక్ ఇన్ ఇండియా విఫలం అయిందనివేరే చెప్పనవసరలేదు. రాఫెల్ యుద్ధ విమానాల దిగుమతి ఇందుకు నిదర్శనం. మోడీఆలోచన ప్రకారంఅటువంటి విమానాలనూ, వాటి విడిభాగాలనూ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద మన దేశంలో తయారు చేయాల్సి ఉంది. విదేశీ కంపెనీలనుంచి తగిన చొరవ లేకపోవడం వల్ల విదేశీ పరిజ్ఞానంతో అటువంటి విమానాలను మన దేశంలో తయారు చేయడం ఇప్పట్లో సాధ్యంకాదని తేలడం వల్లనే వాటిని ప్రభుత్వం దిగుమతి చేసుకుంటోంది. మోడీ సంకల్పం మంచిదే, ఆయన వేస్తున్న అడుగులూ సరైనవే. కానీ, ఆయనకు లభిస్తున్న ప్రోత్సాహం అంతంత మాత్రంగా ఉంది. ఈ కార్యక్రమాలే కాదు, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలకు కూడా సరైన ప్రోత్సాహం లభించడంలేదు. మోడీ అధికారంలోకి వచ్చి రేపు జూలైకి నాల్గేళ్ళు పూర్తి అవుతుంది. ఒక్క ఏడాది మాత్రమే గడువు ఉంది. ఈ ఏడాది వ్యవధిలో ఆయన తలపెట్టిన, లేదా ప్రవేశపెట్టిన కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకుని వెళ్తారనేది శేష ప్రశ్న.

-పద్మనాభస్వామి

ఆరోగ్య హక్కు కావాలి

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాట అక్షరాలా సద్దిమూటే. నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితులు, సామాజిక సమస్యలతోపాటు మూఢనమ్మకాలు ప్రబలంగా పాతుకుపోయిన మన సమాజంలో అధికులకు ఆరోగ్యంపై అవగాహన తక్కువ. అందువల్లనే నేడు దేశంలో అత్యధికులు వ్యాధి ముదిరేవరకూ నిర్లక్ష్యం, సొంత వైద్యం, అనర్హులైన వైద్యుల పర్యవేక్షణలో కాలం గడుపుతూ ఇళ్లూ ఒళ్లూ గుల్లచేసుకుంటూ అనంతరం పెద్ద వైద్యశాలలకు పరుగెడుతున్నారు. ప్రభుత్వాలు కూడా ప్రాథమిక వైద్యశాలలను నిర్లక్ష్యం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వాటి నిర్వహణ అస్తవ్యస్తమవటంతో పేద ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి విరుగుడుగా అందరికీ ఆరోగ్య పరీక్షలు వారి వద్దకే వెళ్లి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేయడం అభినందనీయం మరియు అత్యంతావశ్యకం కూడా. ముఖ్యంగా మన సమాజంలో మారిన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, దురలవాట్ల మూలంగా జీవనశైలి వ్యాధులు (మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఇత్యాది) పెరుగుతుండగా మరొకవైపు శుభ్రత లేమి, అవగాహన లేమి మరియు వివిధ కాలుష్యాలతో అంటువ్యాధులు సైతం ప్రజల్ని ప్రభావితం చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఉచితంగా, చేరువలో ప్రభుత్వమే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయబూనుకోవటం వల్ల ప్రజలకు అవగాహన పెరగటమే కాక చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా వర్తించేలా ఆయుష్మాన్ భారత్ పథకం ప్రవేశపెట్టడం అభినందనీయమే అయినా కిందిస్థాయి వరకు నాణ్యమైన వైద్యసేవలు చేరువ చేయటం వల్ల పేద ప్రజలకు చాలా మేలు కలుగుతోంది అనటంలో అతిశయోక్తి లేదు.

-వినోద్ కుమార్ సుద్దాల
రీసెర్చి స్కాలర్

అభిప్రాయం

ఐసిస్ చర్య తీవ్ర విషాదం

ఇరాక్ లో మోసుల్ పట్టణంలో ఐసిస్ తీవ్రవాదుల బందీలుగా ఉన్న 39 మంది అమాయక భారతీయులు ఊచకోతకు గురికావడం జాతీయ విషాదం. గుండెల్ని కలచివేసే వార్త. భారత్ నుండి పొట్ట చేత బట్టుకొని ఆ పట్టణం చేరిన అభాగ్యులు 2014లో ఉగ్రవాదుల పాల బడ్డారని తెలిసినా, క్షేమంగానే ఉంటారన్న ఆశ ఇంతవరకూ ఉంది. అయితే కరడు గట్టిన ముష్కరులకు ప్రాణం తియ్యడం తప్ప మరోటి చేతగాదని ఈ ఊచకోత ద్వారా మరోసారి నిరూపితమైంది. అభాగ్యుల కుటుంబాలకు ప్రభుత్వం, పౌరసమాజం అండగా నిలబడాల్సిన సమయమిది. 'తమ వారి మరణ వార్తని తెలియబర్చడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని' వారి బంధువులు ఆక్షేపించడంలో తప్పు లేదు. దుర్వార్త తెలిసిన షాక్ లో ఆవేదన చెందడం అర్థం చేసుకోదగ్గది. అయితే ఆ రకమైన విమర్శలు ప్రతిపక్షాలు చెయ్యకూడదు. పూర్తి నిర్ధారణ జరగకుండా, ఐడెంటిటీ ధ్రువీకరించుకోకుండా మరణం లాంటి సీరియస్ విషయాన్ని ప్రభుత్వం ఎలా ప్రకటిస్తుంది? లోక్ సభ లో కూడా ప్రతిపక్షాలు మరింత హుందాగా ప్రవర్తించాల్సింది. ఇంతటి పెను విషాదాన్ని మానవత్వపు కోణంలో తప్ప మరే కోణంలోనూ చూడరాదు. మోసుల్ పట్టణం ఐసిస్ ముష్కరుల కబంధ హస్తాలనుండి విముక్తి అయ్యిండొచ్చు. ప్రపంచంలో అన్ని ప్రాంతాలూ ఉగ్రవాదం నుండి విముక్తి కావాలి. అంతవరకూ ప్రమాదం పొంచి ఉన్నట్టే. ఏ మూల విషబీజాలున్నా, అన్ని దేశాలకూ అవి ప్రమాదకరమే. ప్రపంచదేశాలు తమతమ స్వార్థాన్ని పక్కన పెట్టి ఉగ్రవాదంపై ఏకోన్ముఖ పోరు సల్పకుంటే అందరికీ ప్రమాదమే.



డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

ఆదిలాబాద్‌లో పత్తి కుంభకోణం

● రంగంలోకి దిగిన సీబీఐ ● సీసీఐ అధికారులు, వ్యాపారులపై కేసులు



ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : అవినీతి మనస్థత్వం గల సీసీఐ అధికారులు, వ్యాపారులు కలిసి ఆదిలాబాద్ జిల్లాలో భారీ పత్తి కుంభకోణానికి పాల్పడ్డారు. సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోళ్లు చేసినట్లు రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయలు స్వహా చేశారు. ఈ వ్యవహారంపై సిబిఐ విచారణ జరుపడంతో పత్తి కుంభకోణం వెలుగు చూసింది. నాలుగేళ్ల క్రితం జరిగినఈ కుంభకోణంపై సిబిఐ కూపీలాగి అక్రమార్కులపై కేసులు నమోదు చేయడం సంచలనం సృష్టించింది. 2014-15లో మార్కెట్లో పత్తి ధర తక్కువగా ఉండటం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ఎక్కువ ఉండటంతో వ్యాపారులకు, సీసీఐ అధికారులకు కలిసివచ్చింది. జిల్లాలో కొంతమంది వ్యాపారులు సీసీఐ అధికారులను మచ్చిక చేసుకుని రైతుల పేరిట బోగస్ పత్రాలు సృష్టించి మద్దతు ధరకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించారు. ఈవ్యవహారంలో వందలాది కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సిబిఐ విచారణలో వెల్లడి కావడంతో కేసులు నమోదు చేసిన సిబిఐ అనుమానితులపై విచారణను ముమ్మరం చేసి ఎనిమిది మంది సీసీఐ అధికారులు, 16 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసింది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2014-15 సంవత్సరంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేసింది. జిల్లావ్యాప్తంగా 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన సీసీఐ సుమారు రూ. 2000 కోట్ల విలువ గల పత్తిని కొనుగోలు చేసింది. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు రైతుల వద్ద నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడ పత్తిని కొనుగోలు చేసి బోగస్ పత్రాలతో సీసీఐకి విక్రయించారు. నాణ్యతకు తిలోదకాలిచ్చి నాసిరకం పత్తిని సైతం వ్యాపారుల నుంచి మద్దతు ధరతో సీసీఐ కొనుగోలు చేసింది. ఒక్కొక్క క్వింటాలుకు వెయ్యి నుంచి 15వందల రూపాయల వరకు అధిక ధరను పొందారు. సీసీఐ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు ఏమాత్రం ప్రయత్నించకుండా వ్యాపారులకే పెద్దపీట వేసి కుంభకోణానికి తెర లేపింది. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ. 400ల కోట్లు నష్టం వాటిల్లింది. సీసీఐ కొనుగోలు చేసిన కేంద్రాలన్నింటిలో సిబిఐ అధికారులు విచారణ ముమ్మరం చేశారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, పొచ్చర, నేరడిగొండ, జైనూర్, నార్నూర్, చెన్నూర్ పత్తి కొనుగోలు కేంద్రాల్లో 56,143 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాల ద్వారా రూ. 1.68 కోట్ల నష్టం సంభవించినట్లు గుర్తించారు. అప్పట్లోనే పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై భారీ ఎత్తున ఆందోళనలు సాగాయి. రైతుల పేరిట వ్యాపారులు పత్తిని విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై స్పందించిన ముంబాయి సిసిఐ అధికారులు పత్తి విక్రయాల్లో రైతులను గుర్తించే పని మార్కెట్ అధికారులదేనని చేతులెత్తేసింది. దీంతో అప్పట్లో రాష్ట్ర అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ పత్తి విక్రయానికి వచ్చే రైతులు పహణీలు పట్టా పాసు బుక్కులు తీసుకుని రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకరైతు పేరు మీద నాలుగు సార్లు కంటే ఎక్కువ పత్తి అమ్మినట్లు ఉన్నటువంటి వాటిని గుర్తించాలని ఆదేశించారు. బిడ్డింగ్ స్లిప్పుల ద్వారా పలు మార్లు పత్తిని అమ్మిన రైతుల పేర్లు క్షేత్ర స్థాయిలో విచారణ ద్వారా రైతుల పంట సాగు, దిగుబడి వివరాలుసేకరించి అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

ధర వ్యత్యాసమే స్వాహకు దారి తీసింది

2014-15లో కేంద్రప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 4050 నిర్ధారించింది. బహిరంగ మార్కెట్లో మాత్రం రూ. 3750 మాత్రమే క్వింటాలుకు లభించింది. దీంతో పలువురు వ్యాపారులు బినామి రైతుల పేరిట వేల క్వింటాళ్ల పత్తిని రూ. 4050 చొప్పున విక్రయించారు. ఒక్కో క్వింటాలుపై సుమారు రూ. 300 లాభం పొందారు. రూ. 22.61 కోట్ల విలువైన 56143 క్వింటాళ్లను సిసిఐకు విక్రయించారు. దీనిపై సిసిఐ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సంబంధిత కేంద్రాల్లోని సిపిఓలు ఈనెల 19న హైదరాబాద్ సిబిఐ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీనిపై నేరపూరిత కుట్ర, చీటింగ్ కేసులపై వివిధ సెక్షన్లలో సిబిఐ మూడు కేసులు నమోదుచేసి విచారణ చేపడుతుంది. విచారణ అధికారులుగా జీఎస్ డెనిల్ శాంతికుమార్, జెబి వశిష్ట్ , దేబాకర్ మిశ్రాలను నియమించారు. నేరడిగొండ, బోథ్‌లలో వ్యాపారులను విచారించారు. ఈ కేసు నమోదు చేసిన సిబిఐ అనుమానితులుగా ఆరుగురు సిపిఓలు, 15 మంది వ్యాపారులపై విచారణను వేగవంతం చేసింది.

సిబిఐ విచారణ

ఆసిఫాబాద్, పొచ్చర, నేరడిగొండ, జైనూర్, నార్నూర్, చెన్నూర్ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై సిబిఐ ఆసిఫాబాద్‌లో కాటన్ పర్చేజింగ్ ఆఫీసర్ తోపాటు నలుగురు వ్యాపారులను అనుమానితులుగా గుర్తించింది. అనుమానితుల్లో సిపిఓ సుమిత్ సుభాష్ రావు, దేశ్‌ముఖ్, వ్యాపారులు మోబిన్, విరాని, జివాని, రిజ్వాన్, బోన్కురి మల్లికార్జున్, గుంటూరు ప్రేమ్‌చంద్ జగన్‌లు ఉన్నారు. నేరడిగొండ, పొచ్చర కొనుగోలు కేంద్రాల్లో సీనియర్ సిపిఓ సికె బట్టి, సిపిఓ రుజావెల్డ్ భగవాన్‌సహారే, వ్యాపారులు కత్తూరి రాకేష్, కె రూపేష్, కె శ్రీదేవి, కె. సుజాత, కె స్వప్న, మాత హరిచంద్‌తోపాటు ఇతరులను అనుమానితులుగా గుర్తించిన సిబిఐ విచారణ ప్రారంభించింది. జైనూర్, నార్నూర్ , చెన్నూర్ కేంద్రాల్లో సిపిఓ మహేశ్ రమేశ్ రావు కిట్కులే, సిపిఓ బాయిస్, రూపేష్ సింగ్, సీనియర్ సిపిఓ, కెవి కృష్ణారెడ్డి, వ్యాపారులు మదద్ అలీ తేజాని, షేక్ జమీర్, పుస్కర్, రామేశ్వర్, గౌరిజవోలు రంగారావులపై సిబిఐ విచారణ ప్రారంభించింది.

ప్రతిపక్షాలవి అనవసర ఆరోపణలు

● మండలి చైర్మన్ స్వామిగౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కంటి పరీక్షలపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండలి చైర్మన్ స్వామిగౌడ్ వాపోయారు. బుధవారం ఉదయం సరోజినీ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయనను గాంధీ ఆస్పత్రిలో స్కానింగ్ చేయిం చుకోవాలని సరోజినీ వైద్యులు సూచించడంతో గాంధీ ఆస్పత్రికి మధ్యా హ్నం రెండుగంటలకు వెళ్లారు. స్కానింగ్ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పక్ష నేతలు తనకు మంచి మిత్రులని స్వామిగౌడ్ పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రతిపక్షాలు తనపై దాడి చేయడమే కాకుండా తనకు తగిలిన దెబ్బపై లేనిపోనివి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే కోర్టుకు: జూపల్లి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉప ఎన్నికల్లో ఓటమి భయం లేకుంటే ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు విషయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఎందుకు కోర్టుకు వెళ్ళిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. బుధవారం శాసనసభలాబీలో తనను కలిసిన కొందరు మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ విధంగా స్పందించారు. ఆ రెండు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే విజయం తెరాసదేనని ధీమా వ్యక్తం చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యేల విషయంలో అధికార పార్టీ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ప్రశ్నాపత్రం లీక్..

ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మరికల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఇంగ్లీషు ప్రశ్నపత్రం లీక్ అయిన సంగతి విదితమే. ఈ కేసు దర్యాప్తులో లభించిన సాక్ష్యాధారాల ఆధారంగా ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లు లక్ష్మన్న, గోపాల్, కె.సుధాకర్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ డాక్టర్ బి. అనూరాధ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతాయుతమైన వృత్తిలో ఉంటూ సున్నితమైన అంశాల పట్ల నిర్లక్ష్యం వహించడం, వ్యక్తిగత లాభాపేక్షతో వ్యవహరించడం ఏమాత్రం సహించరానిదని ఎస్పీ అనురాధ ఈ సందర్భంగా తెలిపారు.

ఈవ్‌టీచర్ అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రేమ పేరుతో అమ్మాయిలను మోసగిస్తూ వారితో దిగిన ఫోటోలను ఫేస్‌బుక్‌లో పెడతానంటూ బెదిరిస్తున్న ఓ యువకుడిని బుధవారం షీటీం పోలీసులు అరెస్ట్ చేశారు. గోల్కొండ ప్రాంతానికి చెందిన అల్తాన్ ఖాన్ తరచూ అమ్మాయిలను వేధించేవాడు. వారితో రహస్యంగా దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడు. అల్తాన్‌ఖాన్ చర్యలకు విసుగు చెందిన ఓ అమ్మాయి షీటీం పోలీసులు ఆశ్రయించింది. టోలీచౌక్ చౌరస్తా వద్ద మాటువేసిన పోలీసులు అల్తాన్‌ఖాన్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో అమ్మాయిలను వేధించిన కేసులో అల్తాన్‌ఖాన్ అరెస్టయినట్లు పోలీసులు తెలిపారు.

వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో మహిళ అసభ్య పోటోలు పంపుతూ...

వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో మహిళ అసభ్య ఫోటోలు పంపుతూ వేధిస్తున్న చింతకాయల సురేష్(26)ని రాచకొండ సైబర్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. సురేష్, బాధితురాలు ఒకే కాలేజీలో చదివేవారు. ఆ సమయంలో వారి మధ్య స్నేహం కుదిరింది. అనంతరం బాధితురాలితో తనను పెళ్లి చేసుకోమని సురేష్ కోరాడు. అయితే దానిని ఆమె తిరస్కరించింది. అప్పట్నించీ బాధితురాలిపై ద్వేషం పెంచుకున్న సురేష్ ఒక రోజు ఆమె ఇబ్రహీంపట్నం బస్‌స్టాండ్ వద్ద బస్ కోసం వెయిట్ చేస్తుండగా ఆమె దగ్గర్నించీ బలవంతంగా సెల్‌ఫోన్ తీసుకున్నాడు. ఆమె పర్సనల్ ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. వాటిని మార్ఫ్ చేసి ఆమె లవర్‌కు పంపాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు సురేష్ ఇంటికి వెళ్లి నిలదీసింది. దీంతో సురేష్ తల్లిదండ్రులు ఆమె ఫోన్‌ను తిరిగి ఇచ్చేసి సెటిల్ చేశారు. అనంతరం ఆమె మహేష్‌ని పెళ్లాడింది. మళ్లీ యధావిధిగా బాధితురాలి అసభ్య ఫోటోలను ఆమె భర్తకు పంపసాగాడు. బాధితురాలి ఫిర్యాదునందుకున్న పోలీసులు సురేష్‌ని అరెస్టు చేశారు.

27 రెసిడెన్షియల్ స్కూళ్ల స్థాయి పెంపు

● 405 పోస్టులు మంజూరు...రూ. 117 కోట్లు కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని 27 రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాయిని ఇంటర్మీడియట్ వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్కూల్స్ నుంచి ఇంటర్ వరకు పెరిగిన వాటిలో 13 బాలుర స్కూల్స్ ఉండగా 14 బాలికల స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 2018-19 సంవత్సరం నుంచే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలను చేపట్టనున్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులను ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది నుంచే అడ్మిషన్లను తీసుకోవాలని నిర్ణయించినట్టు ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్మీడియట్ వరకు స్థాయి పెంచిన వాటిలో 405 పోస్టులకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ. 117.79 కోట్లు నిధులను కేటాయించింది.

కొలనుపాక ఆలయాల అభివృద్ధికి రూ. 6 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రసిద్ద పుణ్యక్షేత్రం యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో భారీనిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుండగా, ఈ ఆలయం సమీపాన ఉన్న చారిత్రక ప్రాంతాల అభివృద్ధికి టూరిజం సర్క్యూట్ ఏర్పాటుచేస్తున్నారు. ఆలేరు ఎమ్మెల్యే గొంగడి సునిత కృషితో ప్రభుత్వం వీటికి సంబంధించిన నిధులు బుధవారం మంజూరుచేసింది. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములును కలిసి ఆలేరు మండలంలోని కొలనుపాక హెరిటేజ్ కాంప్లెక్స్‌పై విజ్ఞప్తిచేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సునిత కృషి వల్ల కొలనుపాక గ్రామంలోని సోమేశ్వరస్వామి, ప్రతాపరుద్ర, ద్వికుట, మహాలక్ష్మి వీరనారాయణస్వామి తదితర ఆలయాల అభివృద్ధికి రూ.6కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

25న సకల ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంట్రిబ్యూటరి పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించేసకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ వి.శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కాంట్రిబ్యూటరి పింఛన్ విధానాన్ని రద్దు చేసేంత వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ స్పూర్తితో పోరాటం కొనసాగించాలని కోరారు. సిపిఎస్ రద్దుతో పాటుగా 11వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని, ఆంధ్రలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి రప్పించాలనే డిమాండ్లతో ఉద్యమించవలసి ఉందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతూ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో లేఖ రాయించడానికి ప్రయత్నిస్తామని శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. తెలంగాణ గెజిటెడ్ అధి కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వి. మమత, ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు మోహన్‌సింగ్, శ్రీనివాస రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మెడికల్ పీజీకి 'నీట్' అర్హుల నుంచి

దరఖాస్తులకు ఆహ్వానం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : మెడికల్ పీజీ అడ్మిషన్ల కొరకు నీట్‌లో అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు కాళోజీ హెల్త్ యూనివర్శిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొంది. తదుపరి వివరాలకు కాళోజీ హెల్త్ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

ఆర్టీసిలో వేతన సవరణ జరగాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సకల జనుల సమ్మె కాలానికి ఆర్టీసీ కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో వేతన సవరణ వెంటనే జరగాల్సి ఉందన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహిస్తున్న రీలే దీక్షా శిభిరాన్ని వెంకటరెడ్డి బుధవారం సందర్శించి ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వేతన సవరణ విషయంలో సంవత్సర కాలంగా యాజమాన్యం, ప్రభుత్వం మౌనంగా ఉండటం సహేతుకం కాదన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్‌టి పరిధిలోకి తెచ్చి ప్రభుత్వ రంగంలోని రవాణా వ్యవస్థను పరిరక్షించుకొనవలసి ఉందన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి. నరసింహన్, అధ్యక్షులు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి తదితరులు మాట్లాడారు.

1నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ రాజకీయాల్లో అస్థిరత ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఒక పార్టీ పాలనకు కాలం చెల్లనుందని, భవిష్యత్‌లో బహుళ పార్టీల పాలనే రానుందని ఆయన వివరించారు. ఏప్రిల్ 1 నుంచి 4 వరకు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వామపక్షాలకు సీట్లు తగ్గడంతో రాజకీయాలు కలుషితం అవుతున్నాయన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రజాస్వామిక విలువలు తగ్గాయన్నారు. ఎస్సీ రిజ ర్వేషన్ల వర్గీకరణకు కేసీఆర్ నాయకత్వం వహిస్తానంటే ఎవరు అడ్డుపడుతున్నారో చెప్పాలని చాడ ప్రశ్నించారు.

ప్రారంభించని కంపెనీలను విశ్లేషించండి

● పరిశ్రమల శాఖపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఎస్-ఐపాస్ ద్వారా అనుమతులు తీసుకున్న కంపెనీలు ఆరు నెలల్లోగా ప్రారంభించకుంటే దానికి కారణాలను విశ్లేషించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధికారులను ఆదేశించారు. పరిశ్రమలకు అనుమతులతో పాటు వివిధ శాఖల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బుధవారం సచివాలయంలో పరిశ్రమల శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కమిషనర్ నదీమ్ అహ్మద్, టిఎస్-ఐఐసి ఎండి వెంకట నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ, టిఎస్-ఐపాస్ ద్వారా 1,24,664 కోట్ల పెట్టుబడి విలువగల 6,609 యూనిట్లకు అనుమతి ఇవ్వగా, 38,203 కోట్ల పెట్టుబడితో 3,382 యూనిట్లు ప్రారంభం అయ్యాయమని, టిఎస్ - ఐపాస్ ద్వారా ఇప్పటికే ప్రారంభమైన 4,383 యూనిట్ల ద్వారా 1,87,978 ఉద్యోగాలు లభించాయని, మరో 684 యూనిట్ల అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాయని సీఎస్ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్, ఎలక్ట్రికల్ వెహికిల్ పాలసీలపై సంబంధిత శాఖల అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. వీటికి సంబంధించి ముసాయిదా విధానాలు రూపొందించాలని, త్వరలోనే వీటిపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సులభతర వ్యాపారానికి సంబంధించి 372 సిఫారసులకుగానూ 362 అనుమతి పొందాయని, మరో 4 వర్తించవని, మరో 6 వివిధ శాఖల్లో ఉన్నాయని సీఎస్ వివరించారు. 78 అంశాలపై ఫీడ్ బ్యాక్ నిర్వహించనున్నందున భాగస్వాములతో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని సీఎస్ వివరించారు. టిఎస్-ఐఐసికి సంబంధించి 23 మెగా ప్రాజెక్టులపై సమీక్షించారు. ప్రతి ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి భౌతిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని, పనుల పురోగతిని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. మెగా టెక్స్‌టైల్ పార్కు, ఫార్మాసిటీ, నిమ్జ్ తదితర అంశాలపై సమీక్షించారు.

రూ.50 లక్షల గుట్కా పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇటీవలి కాలంలో పోలీసులు గుట్కా విక్రయాలపై కఠిన వైఖరిని అవలంబిస్తున్న క్రమంలో పలువురు గుట్కా విక్రేతలు పట్టుబడ్డారు. లారీల ద్వారా గుట్కా రవాణాకు యత్నించిన సందర్భంలో పట్టుబడుతుండటంతో కార్లలో గుట్కా ప్యాకెట్లను రవాణా చేస్తున్నారు. శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించి 12 కార్లలో దాదాపుగా రూ. 50 లక్షల విలువ చేసే గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి గుట్కాను రవాణా చేస్తున్నారని పోలీసులు గుర్తించారు.

కనిష్క్ గోల్డ్ 14 బ్యాంకులకు

కుచ్చుటోపీ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. రూ.824.15 కోట్ల మోసం జరగగా నష్టాన్ని పూడ్చుకోవడానికి అందుబాటులో ఉన్న సెక్యూరిటీ కేవలం రూ.156.65 కోట్లు మాత్రమేనని ఎస్‌బిఐ ఆరోపించింది. ఫిర్యాదులో నిర్దేశిత అవకతవకలు ఉన్న కారణంగా వాటిని సవరించే నిమిత్తం ఎస్‌బిఐతో సంప్రదింపులు జరుపుతున్నట్టు సిబిఐ అధికారులు తెలిపారు. కంపెనీ రుణ సదుపాయాలు పొందే నిమిత్తం 2009 నుంచి రికార్డులు, ఆర్థిక స్టేట్‌మెంట్లుగా తప్పుడుగా సమర్పించి అంతా బ్రహ్మాండంగా ఉందనే భావనను కలిగించిందని ఎస్‌బిఐ ఆరోపించింది. కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్, దాని డైరెక్టర్లు బ్యాంకు హక్కులు, ప్రయోజనాలను తోసిరాజని నిధులను పక్కదారి పట్టించారని పేర్కొంది. కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్, దాని ప్రమోటర్ డైరెక్టర్ భూపేష్ కుమార్ జైన్, తదితరులపై కేసు నమోదు చేయాలని సిబిఐని ఎస్‌బిఐ కోరింది. పలు బ్యాంకులు 2017-18లో కంపెనీ ఖాతాను మోసపూరితమైన, నిరర్థక ఆస్తి(ఎన్‌పిఎ) అని నిర్ధారించారని తెలిపింది.

వహ్ తాబ్...

(మొదటి పేజీ తరువాయి)

పసికందును కూడా తీసుకెళ్లింది. పరీక్ష రాస్తున్న సమయంలో పసికందు ఏడవడం ప్రారంభించింది. ఇన్విజిలేటర్ అనుమతితో, వెంటనే పరీక్ష టేబుల్ మీదనుంచి లేచివచ్చి, వేరొక విద్యార్థిని కుర్చీ వెనుక నేలపై కూర్చుంది. ఒకవైపు బిడ్డకు స్తన్యమిస్తూ, మరొకవైపు పరీక్ష రాయడం కొనసాగించింది. అరుదైన, అద్భుత దృశ్యాన్ని మహిళా ఇన్విజిలేటర్ ఇర్ఫాన్ తన ఫోన్ కెమేరాలో బంధించింది. తర్వాత ఈ ఫొటోలను అంతర్జాలంలో పోస్ట్‌చేసింది. అంతే క్షణాల్లో వైరల్ అయింది. ప్రపంచం అంతా ఆమెకు జేజేలు పలికింది. తాబ్‌కు ముగ్గురు సంతానం. పరీక్ష రాసేందుకు ఆమె ఆరు గంటలు ప్రయాణించి నిల్లి నగరానికి చేరుకుంది. పేదకుటుంబానికి చెందిన రైతుతో ఈమెకు వివాహం అయింది. కుటుంబ బాధ్యతలు, కట్టుబాట్లను అధిగమించిన ఆమె పట్టుదలకు ప్రపంచం హ్యాట్సాఫ్ చెబుతోంది. బ్రిటీషు సంస్థ ఆర్థిక సహాయంతో ఆమె ఉన్నత విద్యను అభ్యసిస్తోంది.

ప్రత్యేక హోదాకోసం సైకిల్ యాత్ర

● తిరుపతి టు ఢిల్లీ వయా హైదరాబాద్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా కోసం ఢిల్లీకి సైకిల్ యాత్ర చేపట్టాడో ఔత్సాహికుడు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కొల్ల వెంకట్ తిరుపతి నుంచి సైకిల్ మీద యాత్ర చేపట్టి 36 రోజుల్లో దేశ రాజధానికి చేరుకున్నారు. ప్రత్యేక హోదా అనేది 5 అక్షరాల మాట కాదు 5 కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవం అనే బోర్డు సైకిల్‌పై పెట్టుకుని యాత్ర సాగించారు. గతేడాది కూడా హోదా నినాదంతో ఆయన సైకిల్ యాత్ర చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని కేంద్రం తేల్చి చెప్పిన రోజున తన యాత్రకు శ్రీకారం చుట్టానని, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిసి ప్రత్యేక హోదా కోసం పోరాటం మొదలుపెట్టానని వెంకట్ విలేకరులకు వివరించారు. ఏపీ ప్రజలను మోసం చేసి మోడీ విశ్వసనీయత కోల్పోయారని ఆయన అన్నారు. త్వరలోనే ప్రధాని కార్యాలయానికి వినతి పత్రం సమర్పిస్తానని వెంకట్ తెలిపారు.

ప్రతి గ్రామానికి 'భగీరథ' నీరు

భూత్పూర్, ప్రభన్యూస్ : మహబూబ్‌నగర్ జిల్లాలో మొట్టమొదటి మిషన్ భగీరథ నీళ్లను భూత్పూర్ మండలం చేగుంట గేట్ వద్ద స్కోవర్ వాల్వ్ తెరిచి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డి. రోనాల్డ్ రోస్‌లు నీటిని విడుదల చేశారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన కాల్వ వద్ద పూజలు నిర్వహించిన అనంతరం నీటిని విడుదల చేశారు. తదనంతరం మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా ద్వారా తాగు నీరు అందించే పనులలో భాగంగా జిల్లాలో మొట్టమొదటి సారి నీరు చేరిందని, త్వరలో మహబూబ్‌నగర్ శాసన సభ నియోజకవర్గంలో , జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోనికి కూడా నీటిని విడుదల చేయడం జరుగుతుందని , ఈ పనులన్ని నెలాఖరులోపు పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


బెస్ట్ ఆఫ్ లివింగ్ సిటీగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సమాధానమిచ్చారు. బస్‌బేలను ఏర్పాటు చేసేందుకు 47 ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. 826 ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణానికి ప్రతిపాదనను కోరామని, ప్రాజెక్టును నాలుగు ప్యాకేజీలుగా విభజించి మూడు ఏజెన్సీలకు బిడ్లను గుర్తించినట్లు తెలిపారు. ఎల్‌ఓసి జారీ చేసి ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని వెల్లడించారు. సౌత్ జోన్‌లో 85 ఆధునిక బస్ షెల్టర్లను నిర్మించనున్నట్లు చెప్పారు. డిజైన్, నిర్మాణం, నిధులు, నిర్వహణ, బదలీ ప్రాతిపదికన ప్రైవేట్ డెవలపర్‌ను నియమించడంద్వారా పిపిపి వ్యవస్థకింద 826 ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. 180 రోజుల్లోపై బస్ షెల్టర్లను నిర్మిస్తారని స్పష్టం చేశారు. నగరంలో 35 లక్షల మంది ప్రయాణికులు రోజూ ఆర్టీసి బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారని ఆయన తెలిపారు.

జీహెచ్‌ఎంసి పరిధిలో వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం కింద నిధుల సేకరణకు బాండ్లను జారీ చేయనున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రూ.1000 కోట్ల సమీకరణకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే రూ. 200 కోట్లను సేకరించామని స్పష్టం చేశారు. తాము నిధులను సేకరిస్తున్న తీరును, బాండ్ల జారీపై ప్రధాని మోడీ కూడా అడిగారని గుర్తు చేశారు. సహకరిస్తామని కూడా హామీ ఇచ్చారని తెలిపారు. సెబీ గైడ్‌లైన్స్ కఠినంగా ఉన్నాయని చెప్పారు. డబుల్ ఏ రేటింగ్‌తో 8.9 శాతానికి రూ. 1000 కోట్ల నిధి సేకరణకు ప్రణాళిక వేశామన్నారు. ఆదిలాబాద్, రామగుండం జాతీయ రహదారులకు కేంద్ర వైఖరితో ఇబ్బందులు కల్గుతున్నాయని చెప్పారు. 180 ఎకరాలు కంటోన్మెంట్ పరిధిలో ఉన్నాయని, వాటి సేకరణకు అనేక అవరోధాలు కల్పిస్తున్నారని తేల్చి చెప్పారు. కేంద్ర రక్షణ శాఖ రోజుకోతీరుతో వ్యవహరిస్తోందన్నారు. 100 ఎకరాలకు డబ్బులు కూడా కట్టినట్లు వెల్లడించారు. మరో 100 ఎకరాలకు షామీర్‌పేటలో 600 ఎకరాలను కేటాయిస్తామని సుముఖత వ్యక్తం చేసినా రక్షణ శాఖ రోజుకొ పేచీ పెడుతోందన్నారు. ఇప్పుడేమో శాశ్వతంగా ఏడాదికి రూ 30 కోట్ల చొప్పున ఇవ్వమని లేఖ రాశారని ఎద్దేవా చేశారు.

రామరథ యాత్రపై నిర్ణయం వాయిదా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల ద్వారా వీహెచ్‌పీ నిర్వహించతలపెట్టిన శ్రీరామ రథయాత్రకు అనుమతి నిరాకరిస్తూ హైదరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. అయితే తీర్పును మాత్రం హైకోర్టు నేటి (గురువారం)కి వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సీతారామమూర్తి బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీరామ రథయాత్ర అనుమతి నిరాకరణ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ తెలంగాణ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యదర్శి ఎం.గాల్‌రెడ్డి హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ రథయాత్ర ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల గుండా నిర్వహించాలని వీహెచ్‌పీ తలపెట్టింది. ఈ రథయాత్ర జగిత్యాలలో ప్రారంభమై హనుమాన్‌జయంతి నాడు హైదరాబాద్‌లో ముగియనుంది.

ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది హరినాథ్ వాదనలు వినిపిస్తూ.. రథయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ రథయాత్రలో మొత్తం 10 మంది మాత్రమే పాల్గొంటారన్నారు. కేవలం ముగ్గురు రథంపై కూర్చుంటారని, మిగతా వారు రథాన్ని అనుసరిస్తారని, అందువల్ల రథయాత్ర నిర్వహణకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ స్పందిస్తూ.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నందువల్ల రథయాత్రకు అనుమతించడం వీలుకాదన్నారు. రథయాత్ర వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదముందన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం

● పని జరిగిన ప్రదేశాల్లో కనిపించని నామ ఫలకాలు ● ఆధారాలు లేకుంటే అక్రమాలకు అవకాశం ● మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో 3.75శాతం పనులకే నామ ఫలకాల ఏర్పాటు ● మిగిలిన ప్రాంతాల్లో పట్టించుకోని సిబ్బంది ● పర్యవేక్షణ చేయని అధికారులు ● ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది



మహబూబ్‌నగర్, ప్రభ న్యూస్ బ్యూరో : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పూర్తి చేసినట్లు పని జరిగిన ప్రాంతంలో నామ ఫలకాలను రాయించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2017-18 ఏడాదికి 83,932 నామఫలకాలను రాయించాల్సి ఉంది. అందులో ఇప్పటి వరకు కేవలం 4,167పనులకు నామఫలకాలు రాయి ంచారు. అంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.75 శాతం పనులకే నామ పలకాలను పూర్తి చేశారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో అవినీతి జరగకుండా ఉండటానికి, ప్రజలకు పని విషయం గురించి సంక్షిప్తంగా తెలియడానికి, పారదర్శకంగా పూర్తి చేసినపని వివరాలను అందరికి తెలిసేలా ఉపాధిహామీ పనుల గురించి నామ ఫలకాలను రాయిస్తారు. అనేకేళ్ల నుంచి ఉపాధి పనుల వివరాలను ప్రజలకు తెలిసేలా ఈ సంప్రదాయం ఉంది.

ఉపాధి చేసిన పనిని మరోమారు చేయడానికి అస్కారం ఉండదు. చేసిన పనికి గుర్తింపు సంఖ్య ఉంటుంది. పని జరిగిన తేదీ, పూర్తి అయిన తేదీ, ప్రాంతం పేరు, మండలం పేరు, చేస్తున్న పనుల పేర్లు, వాటికి కేటాయించిన మొత్తం బడ్జెట్, అందులో పాల్గొన్న కూలీలు, వారి జాబ్ కార్డులు, శ్రమశక్తి సంఘాలు తదితర వాటిని పూర్తిగా నిక్షేపిస్తారు. కూలీలకు ఉపాధి పనులను పారదర్శకంగా కల్పించడానికి అవకాశం ఉంటుంది. ఎవరైనా పనులకు కేటాయించిన నిధులు, పనులు జరిగిన తీరుపై అనుమానాలు వస్తే ఫిర్యాదు చేయడానికి సులువుగా ఉంటుంది. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆ మేరకు జరగకపోవటంతో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. వీటిపై అధికారులు నిఘా ఉంచి పని జరిగిన ప్రదేశంలో శిలాఫలకాలు ఏర్పాటు చేయించాల్సి ఉన్నప్పటికీ ఆమేరకు చర్యలు జరగకపోవటం పలు అనుమానాలకు తావునిస్తోంది.

ఇప్పటికైన అధికారులు స్పందించి ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై నిఘా ఉంచాలని, పని జరిగిన ప్రదేశంలో పూర్తి వివరాలతో ఫలాకాలు ఏర్పాటు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.




భావి భారత్‌లో లక్ష స్టార్టప్‌లు

జైపూర్: అన్ని స్టార్టప్‌లకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ టి.వి.మోహన్ దాస్ పాయ్ అన్నారు. కానీ మార్కెట్ లేకపోవడం, తదితర కారణాలతో వాటిలో 60 శాతం విఫలమవుతాయని అన్నారు. భారత్‌లో దాదాపు 30 వేల స్టార్టప్‌లు రమారమి 3.5 లక్షల నుంచి 4 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తున్నాయని తెలిపారు. ప్రతియేటా 5 వేల నుంచి 6 వేల స్టార్టప్‌లు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. 2025 నాటికి భారత్‌లో ఒక లక్ష స్టార్టప్‌లు ఉంటాయని, వాటిలో దాదాపు 32 లక్షల మంది పనిచేస్తుంటారని పాయ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అన్ని స్టార్టప్‌లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. కానీ వైఫల్యాల రేటు అధికం. స్టార్టప్‌లలో దాదాపు 60 శాతం విఫలమవుతాయని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న మోహన్ దాస్ పాయ్ తెలిపారు. తొలిసారి వ్యాపారంలో వచ్చేవారు ప్రారంభిస్తున్న కారణంగా సరైన మార్కెట్‌ను అవి పొందలేకపోతున్నాయని అన్నారు.



ఎన్నికల్లో వేలు పెడితే ఊరుకోం

• సోషల్ మీడియాకు వార్నింగ్ • కేంబ్రిడ్జి అనాలిటికాతో కాంగ్రెస్‌కు లింకులు • రాహుల్ ప్రొఫైల్‌లో సదరు ఏజెన్సీ పాత్ర • కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపణ



న్యూఢిల్లీ: అవాంఛనీయ విధానాల ద్వారా దేశ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమం వేదికలను కేంద్ర ఐటి, న్యాయ శాఖా మంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో మీడియాతో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు పూర్తి మద్దతు ఇస్తుందని, సామాజిక మాధ్యమాలపై భావాలు ఇచ్చిపుచ్చుకోవడానికి అంగీకరిస్తుందని మంత్రి తెలిపారు. సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్ యూజర్ గోప్యతకు తీవ్రమైన భంగం కలిగించిందనే అభియోగంపై అమెరిగా గోప్యత నిఘా సంస్థ దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికాలో 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంబ్రిడ్జి అనాలిటికా అనే ఒక రాజకీయ సలహాదారు కంపెనీ డోనాల్డ్ ట్రంప్ కోసం జరిపిన ఓటరు సర్వేలో ఫేస్‌బుక్ నుంచి పొందిన డేటాను వినియోగించిందనే వార్తలు వచ్చాయి. దీంతో స్వీయ గోప్యత విధానాలకు కట్టుబడి ఉండే పలు కంపెనీలు ఫేస్‌బుక్ 2011 నాటి ఒక సమ్మతి తీర్మానాన్ని ఉల్లంఘించిందా అనే ఆరోపణలపై ప్రభుత్వ స్వతంత్ర ఏజెన్సీ అయిన అమెరికా సమాఖ్య వాణిజ్య కమిషన్(ఎఫ్‌టిసి) స్పందించింది. కేంబ్రిడ్జి అనాలిటికాతో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలు ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రసాద్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపొందడానికి డేటా తారు మారు, డేటా చోరీపై ఆధారపడుతుందా అని ఆ పార్టీని ప్రశ్నిస్తున్నాను అని అన్నారు. రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్రొఫైల్‌లో కేంబ్రిడ్జి అనాలిటికా పాత్ర ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. 2019 ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ తమ బ్రహ్మాస్త్రంగా పేర్కొంటూ రంగంలోకి దించిన కేంబ్రిడ్జి అనాలిటికాపై కేంద్ర మంత్రి తప్పుపట్టారు. అది రాజకీయ నాయకులకు వలవేయడానికి ముడుపులు, వ్యభిచారిణులను ఉపయోగిస్తుందని, ఫేస్‌బుక్ నుంచి డేటా చోరీ చేస్తుందని ఆరోణలు కేంబ్రిడ్జి అనాలిటికాపై ఉన్నాయని తెలిపారు.

ఐటీఐకి ఊపిరి

• ఎఫ్‌పీఓ ద్వారా ఈక్విటీ షేర్ల విక్రయం

• కేంద్ర మంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ: ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పిఒ) ద్వారా ఐటిఐ లిమిటెడ్‌కు చెందిన 18 కోట్ల ఈక్విటీ షేర్ల విక్రయానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. తద్వారా టెలికామ్ ప్రభుత్వ రంగ సంస్థ(పిఎస్‌యు) కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధన చేరుకోవడానికి మార్గం సుగమమైంది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ అన్ని లిస్టెడ్ కంపెనీలు కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కలిగి ఉండాలనే నిబంధన విధించింది.

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సిసిఇఎ) బుధవారం సమావేశమైంది. దేశీయ మార్కెట్‌లో ఎఫ్‌పిఒ ద్వారా 18 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను సాధారణ ప్రజానీకానికి విక్రయించేలా ఐటిఐకి సిసిఇఎ ఆమోదం తెలిపిందని పేర్కొంటూ ఒక అధికారిక ప్రకటన జారీ అయ్యింది. ప్రస్తుతం ప్రభుత్వం ఐటీఐలో 92.59 శాతం వాటాను కలిగి ఉంది.

కంపెనీకి ఎంతో అవసరమైన వర్కింగ్ కేపిటల్‌ను ఎఫ్‌పిఒ సమకూరుస్తుంది. చేతిలో ఉన్న ఆర్డర్లను సకాలంలో ప్రారంభించడానికి, మార్జిన్లను మెరుగుపరుచుకోవడానికి ఉపకరిస్తుంది. అంతేకాక ఐటీఐ ఉద్యోగులకు భరోసా ఇస్తుంది. ఐటీఐ కొత్త టెలికామ్ సాంకేతికతలో రంగంలో ప్రవేశించడం ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది అని ప్రకటన పేర్కొంది. కంపెనీ ఉద్యోగుల కోసం ఐటీఐ ఎఫ్‌పిఒలో 5 శాతాన్ని రిజర్వ్ చేసుకుంటుంది. ఉద్యోగులకు, రిటైల్ ఇన్వెస్టర్లకు 5 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తుంది. ఎఫ్‌పిఒ కోసం సలహాదారులను మర్చంట్ బ్యాంకర్లను నియమించుకుంటుంది. ఐటీఐ లిమిటెడ్ డిఫెన్స్ కమ్యూనికేషన్, నెట్‌వర్కింగ్ అవసరాలకు సరఫరాదారుగా ఉంది. భారతీయ సైన్యానికి ఎన్‌క్రిప్షన్ ఉత్పత్తులకు సంబంధించి ఒక ప్రధాన సరఫరాదారుగా నిలిచింది. కంపెనీకి ప్రధాన ఖాతాదారులుగా బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, రక్షణ శాఖ, పారామిలటరీ బలగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. కంపెనీకి బెంగళూరు(కర్నాటక), రాయబరేలి, నయిని, మంకాపూర్(అన్ని ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి), పాలక్కాడ్(కేరళ), శ్రీనగర్ (జమ్మూ కాశ్మీర్)లో ఆరు మ్యానుఫేక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. 2017, డిసెంబర్ 31 నాటికి కంపెనీ ఇష్యూడ్ అండ్ సబ్‌స్క్రయిబ్‌డ్ ఈక్విటీ కేపిటల్ రూ.760 కోట్ల వద్ద నిలిచింది.

ఈశాన్య అభివృద్ధికి 3,000 కోట్లు

కేంద్ర కేబినెట్ రూ.3,000 కోట్లతో ఈశాన్య పారిశ్రామికాభివృద్ధి పథకానికి(ఎన్ఇఐ డిఎస్) బుధవారం ఆమోదం తెలిపిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 2020 దాకా పైన పేర్కొన్న కేటాయింపు జరుపుతుంది. అదే సంవత్సరం మార్చికి ముందు మదింపు చేసిన అనంతరం మిగిలిన కాలానికి అవసరమైన కేటాయింపులు జరుపుతుంది. ఈశాన్య ప్రాంతంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎన్ఇఐడిఎస్ ప్రోత్సాహకాలు అందచేస్తుంది. పథకం ద్వారా ఉపాధి కల్పనకు ప్రత్యేక ప్రోత్సాహకాలు సైతం సమకూరుస్తుంది. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల నుంచి లబ్ది పొందుతున్న అర్హమైన పారిశ్రామిక యూనిట్లు ఈ పథకం ప్రయోజనాలను పొందవచ్చు అని ప్రకటన వెల్లడించింది


ఫైల్‌ఫోటో

పెద్దనోట్ల రద్దుకు గ్రామీణ భారతం వెల్‌కమ్



కోల్‌కతా: నోట్ల రద్దు పట్టణ మేధావులకు పెద్దగా పట్టకపోయినప్పటికీ గ్రామీణ భారతీయుల్లో అత్యధికులుదానిని స్వాగతించారని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణమూర్తి అన్నారు. బుధవారం ఇక్కడ ప్రెసిడెన్సీ యూనివర్శిటీ విద్యార్థులతో నోట్ల రద్దుపై ఆయన ఇష్టాగోష్ఠిజరిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. అర్థశాస్త్రంలో తాను నిపుణుడు కానని నారాయణమూర్తి తెలిపారు. అందుకే నోట్ల రద్దు వెనుక తర్కాన్ని అర్థం చేసుకోలేకపోయానని చెప్పారు. పాత 500 నోట్లను రద్దు చేసిన ప్రభుత్వం వెనువెంటనే అంతే విలువ కలిగిన కొత్త నోట్లతో పాటుగా రూ.2,000 నోట్లను ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. ఇదంతా ఎందుకు జరిగిందో ఒక నిపుణుడు మాత్రమే చెప్పగలరు. నాకైతే అర్థం కాలేదు. నిపుణులను అడిగి తెలుసుకోండి అని విద్యార్థులకు సూచించారు. చైనా, జపాన్ దేశాలు తక్కువ సాంకేతిక తయారీపై దృష్టిపెట్టి ముందుకు సాగుతున్నాయని, కానీ భారత్ 1950 నుంచి ఆ వంకైనా చూడలేదని నారాయణమూర్తి వ్యాఖ్యానించారు. దేశంలో పిల్లల్లో 75 శాతం మంది బడికి వెళుతున్నప్పటికీ ఎనిమిదవ తరగతికి వచ్చేసరికి వారు డ్రాపవుట్ అవుతున్నారని అన్నారు. అలాంటివారికి 22 సంవత్సరాలు వచ్చేసరికి ఉద్యోగం కావాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్హత లోపించిన వారు తక్కువ సాంకేతిక తయారీకే సరిపోతారని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు అభిప్రాయపడ్డారు. ఆర్థికవేత్తలు దీని గురించి 1950 నుంచే ఆలోచించి ఉండాల్సిందని తెలిపారు. యాంత్రికీకరణం, మానవుల మధ్య సమతూకం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మనం ఒక నిర్ణయం తీసుకోగలం. మన తయారీ లేదా సేవలకు సంబంధించి నిర్దేశిత స్థాయి వరకు యాంత్రికీకరణను అనుసరించలేమని అన్నారు. మనం ఒక సమతూకం పాటించాలి. ఉత్పత్తులు, సేవల్లో మనం అంతర్జాతీయంగా పోటీ పడాలి. దేశీయ ప్రయోజనాల కోసం మనం యాంత్రికీకరణలో కాస్త నెమ్మదించి ఉండవచ్చు అని నారాయణమూర్తి వ్యాఖ్యానించారు.

రూ.200 కోట్లు డిపాజిట్ చేయండి


• జేఏఎల్‌కు సుప్రీం కోర్టు ఆదేశం • గృహ కొనుగోలుదారులకు ఊరట

న్యూఢిల్లీ: ఫ్లాట్లకు బదులుగా నగదు రిఫండ్ ఆశిస్తున్న గృహ కొనుగోలుదారుల కోసం కోర్టు రిజిస్ట్రీ వద్ద రెండు వాయిదాల్లో రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలని రియాల్టీ కంపెనీ జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్‌ను(జెఎఎల్) సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. ఏప్రిల్ 15న రూ.100 కోట్లు, మే 10న మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎం.ఖన్‌విలకర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం జైప్రకాష్ అసోసియేట్స్‌ను ఆదేశించింది. నేడు కోర్టులో ఉన్న మేనేజింగ్ డైరెక్టర్ అంగీకరించిన దాని ప్రకారం జెఎఎల్ రూ.200 కోట్లను రెండు వాయిదాల్లో డిపాజిట్ చేయాలని పేర్కొంది. మునుపటి ఆదేశాల ప్రకారం రూ.2,000 కోట్లను ఇంకా డిపాజిట్ చేయలేదని కంపెనీని ఆక్షేపించింది. ఇప్పటిదాకా రిజిస్ట్రీ వద్ద రూ.550 కోట్లు డిపాజిట్ చేసినట్టు జెఎఎల్ ధర్మాసనానికి తెలియపరిచింది. 30 వేల పైచిలుకు గృహ కొనుగోలుదారుల్లో కేవలం 8 శాతం మంది మాత్రమే రిఫండ్ కోరుతున్నారని, మిగిలిన 92 శాతం మంది ఫ్లాట్లను అందించాలని ఆకాంక్షించారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించింది. ప్రస్తుతానికి రిఫండ్ కావాలంటున్న గృహ కొనుగోలుదారులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నాము. తదుపరి విడతలో ఫ్లాట్లు కోరుకుంటున్న గృహ కొనుగోలు దారుల నుంచి ఫిర్యాదులు ఏమైనా ఉంటే పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. తన పోర్టల్ ప్రకారం ప్రస్తుతానికి రూ.1,300 కోట్లు రిఫండ్ చేయాల్సి ఉందని కోర్టుకు అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న లాయర్ పవన్ శ్రీ అగర్వాల్ ధర్మాసనానికి తెలియ పరిచారు. గృహ కొనుగోలుదారుల వివరాలతో ఒక ప్రాజెక్టు వారీ చార్టు రూపొందించాలని అగర్వాల్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. తద్వారా దామాషా ప్రాతిపదికగా నగదు పంపిణీపై సరైన ఆదేశం జారీ చేస్తామని తెలిపింది. నేటి(బుధవారం) వరకు పోర్టల్‌లో నమోదు చేసుకున్న గృహ కొనుగోలుదారుల రిఫండ్ అభ్యర్థనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.



స్వదేశీ రైలింజన్ వచ్చేస్తోందోచ్!

బీహార్‌లోని మాధెపురా వద్ద రైల్ లోకోమోటివ్ ప్లాంట్ వద్ద రూపుదిద్దుకుంటున్న మొట్టమొదటి స్వదేశీ 12,000 హార్స్‌పవర్ ఎలక్ట్రిక్ రైలు ఇంజిన్. జూన్‌లో పట్టాలెక్కించనున్నట్లు రైల్వే బోర్డు అధికార వర్గాలు వెల్లడించాయి.



ఇక్ఫాయ్ అధ్యాపకుడు దేబ్‌ప్రతిమ్‌కు రీసెర్చ్ అవార్డు

• ప్రదానం చేసిన కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇక్ఫాయ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ దేబ్‌ప్రతిమ్ పురకాయస్త దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఫ్యాకల్టీ రీసెర్చ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆయన చేసిన మేనేజ్‌మెంట్ డొమెన్‌కు సంబంధించి ఫ్యాకల్టీ రీసెర్చ్ అవార్డు సాధించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ చేతుల మీదుగా మంగళవారం ఢిల్లీలో అవార్డును అందుకున్నారు. గత 10 సంవత్సరాలుగా ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. కెరీర్ 360 అనే సంస్థ ఈ అవార్డులను ప్రధానం చేస్తోంది.

నోట్ల రద్దు నివేదికకు గ్రహణం



న్యూఢిల్లీ: రాజకీయ తప్పిదాలు నోట్ల రద్దుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీని రెండుగా చీల్చాయి. కాంగ్రెస్ నేత ఎం.వీరప్ప మొయిలీ నేతృత్వంలోని కమిటీ రూపొందించిన ముసాయిదా నివేదిక రాజకీయ దురుద్దేశ్యంతో కూడుకున్నదిగా కమిటీలో సింహ భాగం ఆక్రమించిన బిజెపి, దాని మిత్రపక్షాల సభ్యులు ఒక అసమ్మతి నోటులో పేర్కొన్నారు. ఆర్థిక అంశాల సభా సంఘంలో 16 మందికి పైగా ఉన్న పాలక కూటమి సభ్యులు ముసాయిదా నివేదిక తీరు, తెన్నులపై అభ్యంతరం వ్యక్తం చేశారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఛైర్మన్ మొయిలీతో కలుపుకొని కమిటీలో మొత్తం 31 మంది సభ్యులున్నారు. ముసాయిదా నివేదికను ఆమోదించి, పార్లమెంట్ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో సదరు నివేదికను ఉంచేనిమిత్తం ఈ నెల 19న కమిటీ సమావేశమైందని వారు తెలిపారు. 16 మంది పాలక కూటమి సభ్యులు అభ్యంతరం చెప్పారు. దీంతో ముసాయిదా నివేదిక కమిటీ ఆమోదం పొందలేదు. పలువురు బిజెపి సభ్యులు సంతకాలు చేసిన అసమ్మతి నోటు నోట్ల రద్దును అన్ని సంస్కరణలకు అమ్మగా పేర్కొంది. అవినీతి నిర్మూలన, నల్లధనం, తీవ్రవాదులకు నిధుల ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తుందని పేర్కొంది.

ఎయిర్ కార్గోగా గన్నవరం విమానాశ్రయం

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర రాజధాని విజయవాడలోని గన్నవరం విమానాశ్రయాన్ని ఎయిర్ కార్గోగా ప్రకటించారు. ఈ విమానాశ్రయంలో విదేశాలకు వస్తువలు ఎగుమతి, విదేశీ వస్తువుల దిగుమతి కి అనుమతిస్తూ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజు అండ్ కస్టమ్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ జారీతో గన్నవరం ఎయిర్‌కార్గో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుంది. ఇక్కడి ఎయిర్ కార్గో ద్వారా ఏ దేశానికైనా వస్తువలు పంపించొచ్చు, తెప్పించుకోవచ్చు. అయితే అవి రవాణా చేయాలంటే ఫ్రైట్ చార్జీలతో పాటు కస్టమ్స్ పన్నులు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెపుతున్నారు. ఇందుకు ప్రత్యేక కస్టమ్స్ విభాగాన్ని కూడా గన్నవరం విమానాశ్రయంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ నోటిఫికేషన్ వెలువడటంతో విజయవాడకు విమానాల రాకపోకల సంఖ్య పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎగుమతి, దిగుమతుల డిమాండ్‌ను బట్టి అంతర్జాతీయ సర్వీసులు నడుస్తాయి. ఇదిలా ఉండగా ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చాలా ఉత్పత్తులపై ఎక్స్‌పోర్టు కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. ఇప్పటి వరకు భారతదేశంలోని 19 రాష్ట్రాల్లో ఎయిర్ కార్గోల ద్వారా గూడ్స్ రవాణా అవుతుండగా, ఇప్పుడు కొత్తగా గన్నవరం ఎయిర్‌పోర్టు దేశంలోనే 33వ ఎయిర్ కార్గోగా నమోదైంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్టణంలలో ఎయిర్ కార్గో సర్వీసులు నడుస్తున్నాయి.


టఫేకు లీడర్ షిప్ అవార్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ (టఫే) సంస్థ 2018 సంవత్సరానికి ఫ్రోస్టు అండ్ సులీవన్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ లీడర్ షిప్ అవార్డుకు ఎంపికైంది. ప్రపంచ స్థాయి మ్యానుఫ్యాక్చరింగ్ సారథులు, కంపెనీలను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జూన్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ సంస్థ గతంలో క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో, రిస్క్ మేనేజ్‌మెంట్ మోడల్‌లో, డిఫరెన్షియల్ ఎంగేజ్‌మెంట్ మోడల్‌లో లీడర్ షిప్ అవార్డులు గెలుచుకుందని టఫే కార్పొరేట్ హెడ్ సునీతా సుబ్రహ్మణ్యం తెలిపారు.


ఈ ఏడాదికి తొలి ద్రవ్యవిధానం

• ఏప్రిల్ 4, 5 తేదీల్లో ఎంపీసీ భేటీ

• వడ్డీ రేట్ల తగ్గింపుపై పరిశ్రమ ఆశలు



ముంబై: భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బిఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్, మరో ఐదుగురు నిపుణులతో కూడిన ద్రవ్య విధాన కమిటీ(ఎంపిసి) 2018-19 ఆర్థిక సంవత్సరానికి తొలి ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని వచ్చే నెల 4-5 తేదీల్లో నిర్ణయించనుంది. చిల్లర ద్రవ్యోల్బణం రేటు(ఆర్‌పిటి) తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వడ్డీ రేట్లలో మార్పుపై ఎంపిసి ఒక తీర్మానం చేయనుంది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలనే పనిమీద ఉన్న ఆర్‌బిఐ ద్రవ్యోల్బణంపై ఆందోళనలను ఎత్తి చూపుతూ గడచిన మూడు ద్వైమాసిక పాలసీ సమీక్షల్లో కీలకమైన స్వల్ప కాలిక రుణ రేటు(రెపో)ను 6 శాతం వద్ద నిలుపదల చేయగలిగింది. 2018-19 సంవత్సరానికి ఎంపిసి ఆరు సార్లు సమావేశమవుతుందని ఆర్‌బిఐ తెలిపింది. అదే సంవత్సరానికి ద్వైమాసిక సమావేశాల క్యాలెండర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆర్‌బిఐ పై ప్రకటన చేసింది. తొలి సమావేశం ఏప్రిల్ 4, 5 తేదీల్లో, చివరి సమావేశం ఫిబ్రవరి 5,6 తేదీల్లో ఉంటుంది. ఏప్రిల్ 5వ తేదీ మధ్యాహ్నం పాలసీ ప్రకటన జారీ అవుతుంది. 1934 నాటి ఆర్‌బిఐ యాక్టు ప్రకారం ఎంపిసి ఏడాదిలో కనీసం నాలుగు సార్లు అయినా సమావేశం కావాలి. ఒక ఏడాదిలో ఎంపిసి సమావేశాల షెడ్యూల్‌ను ఆ ఏడాదిలో తొలి సమావేశానికి కనీసం వారం రోజుల ముందు ప్రచురించాలి. వినియోగ దారు ధర సూచీ(సిపిఐ) ప్రాతిపదికగా ఉన్న చిల్లర ద్రవ్యోల్బణం ఆధారంగా ఆర్‌బిఐ పాలసీ రేటును నిర్ధారిస్తుంది. ఆహార పదార్థాల చవక కావడం, చమురు తక్కువధరకు లభించడంపై ఫిబ్రవరిలో అది నాలుగు మాసాల కనిష్టానికి 4.44 శాతానికి చేరుకుంది. జనవరిలో చిల్లర ద్రవ్యోల్బణం 5.07 శాతం వద్ద ఉంది. 2017 ఫిబ్రవరిలో సిపిఐ 3.65 శాతంగా నమోదైంది. ఉత్తర దిశగా కదులుతున్న పారిశ్రామిక ఉత్పాదక సూచీ(ఐఐపి)కి ఊతమిచ్చేలా ఆర్‌బిఐ వడ్డీ రేటును తగ్గించాలని పారిశ్రామిక రంగం ఆకాంక్షిస్తున్నది. చిల్లర, టోకు ద్రవ్యోల్బణం రెండూ అధోముఖంగా సాగుతున్న వేళ ఆర్‌బిఐ సాహసోపేతమైన చర్యలు చేపట్టాలని వాదిస్తున్నది. పటేల్ నేతృత్వం వహిస్తున్న ఎంపిసిలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ దేవవ్రత ఉంటారు. వారితో పాటుగా వెలుపల నుంచి మరో ముగ్గురు చేతన్ ఘటే. పమి దువా, రవీంద్ర ధొలికా యా సభ్యులుగా ఉన్నారు.



వాణిజ్యరంగంలోనూ నారీభేరీ!

• ఉత్పాదన రంగంలో దక్షిణాది మహిళలే టాప్

• సీఐఐ ఐడబ్ల్యూఎస్ సదస్సులో సంతానం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళలు వివిధ ఉత్పాదనా రంగాల్లో పనిచేస్తే 2025 నాటికి జాతీయ స్థూల ఉత్పత్తిని 700 బిలియన్ డాలర్లకు పెంచవచ్చునని సిఐఐ దక్షిణాది ప్రాంతీయ మాజీ ఛైర్మన్ డి.సంతానం అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఎక్కువ మంది మహిళలు పని చేస్తున్నారని, ఇది ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల స్థూల ఉత్పత్తి పెరుగుదలకు ఎంతగానో దోహద పడుతుందని ఆయన చెప్పారు. భారత పరిశ్రమ సమాఖ్య (సిఐఐ) ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యుఎన్) బుధవారం నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాలు, తెలంగాణ లీడర్ షిప్ సదస్సులో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఐ కర్నాటక కౌన్సిల్ మాజీ ఛైర్మన్లు కమల్‌బాలీ, సుధాకర్ పాయ్, ఉమెన్ నెట్‌వర్క్ జాతీయ ఛైర్మన్ సుచిత్ర ఎల్లా కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతానం మాట్లాడుతూ, లింగ వివక్ష ఉన్నప్పటికీ దక్షిణాది రాష్ట్రాల్లో మహిళా శక్తి తమ ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. పాఠశాల దశ నుంచే బాలికలకు భవిష్యత్తుపై అవగాహన కల్పించాలని, విద్యాసంస్థలు, పారిశ్రామిక రంగాలు పిల్లల్లో సృజనాత్మకత పెంచేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. అనేక రంగాల్లో ఎంతో పురోగతి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు 2030 నాటికి సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి సాధిస్తాయని, కార్పొరేట్ రంగంలో 30 శాతం మంది మహిళలు ఉన్నత స్థానంలో ఉంటారని, ఉద్యోగాల్లో 50శాతం ఉంటారని సంతానం చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం పురోభివృద్ధి చెందుతున్న తరుణంలో లింగవివక్షకు అవకాశం ఇవ్వరాదని కమల్‌బాలీ చెప్పారు. మహిళలు తమ ముందున్న అడ్డుగోడలు తొలగించుకుని స్వేచ్ఛగా ముందుకు రావాలని, తమ ఆలోచనలలో ఉన్న భయాన్ని తొలగించి ఔత్సాహికులగా ఎదగాలని ఆయన అభిప్రాయపడ్డారు. అనుభవాలే పాఠాలు నేర్పుతాయని, వైఫల్యాలే జీవితంలో విజయాలు సాధించేందుకు మార్గం చూపుతాయని ఆయన అన్నారు. మహిళా శక్తిని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని, అవకాశాలు ఇస్తే ఏదైనా సాధించగలరని ఆయన అన్నారు. దేశంలో 49శాతం మంది మహిళలు ఉత్పాదన రంగంలో పనిచేస్తే భారత్ అగ్రదేశాల్లో ఒకటిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. సమాజంలో సగంమంది ఉన్న మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని బాలీ సూచించారు.

బీజేపీకి 'బి'టీమ్ తెరాస



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎస్సీ ముస్లిం రిజర్వేషన్లపై సీఎం చంద్రశేఖరరావు మోసం చేస్తున్నారని మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ మండిపడ్డారు. టీఆర్ఎస్ ఎంపీలు రిజర్వేషన్లు పెంచాలని పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ఆడుతు న్నారనిదుయ్యబట్టారు. బీజేపీకి టీఆర్ఎస్ పార్టీ బీ టీమ్‌గా మారిందని ఆరోపిం చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, అమిత్‌షా కనుసన్నల్లో కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావణ్ కుమార్, ప్యాట రమేష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎస్సీ ముస్లిం రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. రాష్ట్రపరిధిలో ఉంటే వాటిలో ఎందుకు పెంచడం లేదని ఆయన నిలదీశారు. అసెంబ్లీలో తీర్మానంపై కేంద్రం అడిగిన అనుమానాలు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నివృత్తి చేయడం లేదని ఆయన ప్రశ్నించారు.

కార్మికుల హక్కులను హరించొద్దు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కార్మికులను హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తే చూస్తూ కూర్చోమని రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ హెచ్చరించారు. రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కార్మికవర్గం తమ సమస్యలను చెప్పుకోవడానికి, నిరసన వ్యక్తం చేయ డానికి ఇందిరాపార్కును తీసివేయడాన్ని ఆయన తప్పుబట్టారు.సమానపనికి సమాన వేతనం చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్‌లో భాగమైన ఎంఎన్‌జే క్యాన్సర్, నీలోఫర్ ఆస్పత్రుల కాంట్రాక్ట్ ఉద్యో గులకు సమాన వేతనం చెల్లించాలని కోర్టు తీర్పు ఆదేశాలను అపహాస్యం చేశారు.

'ఉచిత వైద్యం కొత్తమోసం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత వైద్యమంటూ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసేందు కు ప్రయత్నిస్తున్నారని తెలుగుదేశంపార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఉచిత వైద్యాన్ని ప్రకటించడాన్ని ప్రజలు గ్రహించారని, కేసీఆర్ ఎన్నికల సర్కస్ ఫీట్లను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన అన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందకపోవడంతో ఒకరోజు ఐదుగురు మృతి చెందారని, గాంధీ ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఉన్నా పని చేయని వైనం, నిలోఫర్‌లో చిన్నారుల మృత్యువాత పరంపరలపై స్పందించని కేసీఆర్‌కు కొపించడం లేదని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఉచిత పథకాల పేరుతో జిమ్మిక్కులు చేయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. గడిచిన నాలుగేళ్లలో వైద్య, ఆరోగ్యశాఖలకు రూ.21వేల కోట్లు కేటాయించి అందులో కేవలం రూ.14వేల కోట్లు మాత్రమే విడుదల చేశారని ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ఉచిత వైద్యం చేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బిల్లులు నిలిపివేస్తే ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని నర్సిరెడ్డి చెప్పారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

-టీటీజేఏసీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్య మని తెలంగాణ టీచర్స్ జేఏసీ స్పష్టం చేసింది. ముఖ్యమంత్రిలో జరిగిన నిర్ణయా లను కాదని 2016 మేనెల సెలవుల్లో పనిచేసిన కాలానికి 24 ఈఎల్స్‌ను ఇవ్వకుండా పాఠశాల విద్యాసంచాలకుల రోజువేతనం ఇస్తూ ఉత్తర్వులివ్వడం సరికాదని జేఏసీ చైర్మన్ పి సరోత్తంరెడ్డి, సెక్రటరీ జనరల్ డాక్టర్ ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి విమర్శించారు. గతంలోనూ జటువంటి ఉత్తర్వులను డైరెక్టర్ కిషన్ జారీ చేశారని విద్యారంగం సమస్యలను పరిష్కరించడం కోసం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం టిటిజేఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసులను తొలగించి సర్వీస్ రూల్స్ వచ్చేలా చూడాలని తీర్మానం చేశారు. సీసీఈ విధానాన్ని రద్దు చేయాలి. ఎయిడెడ్ స్కూళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలి.

కేఏటి ఫలితాల్లో శ్రీచైతన్య హవా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ వ్యాప్తంగా జరిగిన కేవీపీ పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు తమ సత్తా చాటారు. గ్రాండ్ ప్రైజ్ రూ.25,000 గెలుచుకున్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతివరకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో అత్యధికంగా 30 మందికి 22 మంది విద్యార్థులు శ్రీచైతన్య విద్యార్థులే ఉన్నారని శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. 1వ ర్యాంక్ 9 మంది, టాప్ 10లోపు 50 మంది, టాప్-10లోపు 97 మంది విద్యార్థులున్నారని చెప్పారు. స్పెషల్ ప్రైజులను 260 మంది, 1172 మంది బంగారు పతకాలను గెలుచుకున్నారని తెలిపారు.

జబల్పూర్-తిరునెల్వేలి మధ్య 26 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జబల్పూర్ - తిరునెల్వేలి మధ్యన 26 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. సికింద్రాబాద్ - కాకినాడ మధ్యన కూడా రెండు ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 23న సికింద్రాబాద్ నుండి ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటి రోజు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 26న కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటిరోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యంలోని అన్ని ప్రధానమైన స్టేషన్లలో ఈ ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుంది. అదే విధంగా జబల్పూర్ - తిరునెల్వేలి ప్రత్యేక రైళ్లు ఏప్రిల్ 5, 12, 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో జబల్పూర్ నుండి బయలుదేరుతుంది. ప్రతి గురువారం ఈ ప్రత్యేక రైళ్లు బయలుదేరి శనివారం తిరునెల్వేలి చేరుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరునెల్వేలి నుండి ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26 జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో బయలుదేరి శనివారం నాడు జబల్పూర్ చేరుకుంటాయని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లు అన్ని ప్రధానమైన స్టేషన్లలో నిలుస్తాయని పేర్కొన్నారు.

రాంగ్‌రూట్ బస్సులపై కొరడా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు ఆకస్మిక దాడులను నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న దాదాపు 200 ప్రైవేట్ బస్సులపై జరిమానాలు విధించారు. కొన్ని బస్సులపై కేసులు నమోదు చేశారు. దూర ప్రాంతాలకు నడిపించే ట్రావెల్స్ బస్సుల్లో రెండవ డ్రైవర్ లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా సీట్లను ఏర్పాటు చేయడం, పర్మిట్లు లేకపోవడం లాంటి అక్రమాలను ప్రత్యేక దాడుల్లో గుర్తించామని ఆర్టీఏ అధికారులు తెలిపారు. జరిమానా విధించారు. 200 లకు తగ్గకుండా ఉల్లంఘనల తీవ్రత ఆధారంగా ఫైన్ వేయడం జరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో 36 బస్సులపై కేసులు నమోదు చేశారు. అక్రమ రవాణాను కఠినంగా అరికట్టాలని ప్రభుత్వం నుండి అందిన ఆదేశాల మేర కు ఆర్టీఏ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. నిఘాను కట్టుదిట్టం చేశారు. అనుమతి లేని బస్సులను పట్టుకున్నామని తెలియజేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నాయని ఈ తనిఖీల్లో వెల్లడయ్యిందన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఆకస్మిక తనిఖీలు ఉంటాయని తెలిపారు.

'ఔటర్' ప్రమాదంలో ఇద్దరు మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఔటర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగర్ కలాన్ సమీపం లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పెద్ద అంబర్‌పేట నుంచి తుక్కుగూడ వైపు వెళ్తున్న ట్రాలీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపైకి దూసుకెళ్లి లారీ కంటైనర్‌ని ఢీకొట్టింది. అదే సమయంలో కంటైనర్‌ను వెనకనుంచి డీసీఎం వాహనం ఢీకొంది. దీంతో కంటైనర్ అదుపు తప్పి బోలెరో వాహనాన్ని ఢీకొనడంతో ఆ వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మృతుల ను తమ్ములూరుకు చెందిన శ్రీశైలం(47), మహారాష్ట్రకు చెందిన కెజ్రా(35)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుప త్రికి తర లించారు. ఘటనపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు అవశ్యం

- పసుపు, అల్లం, వెల్లుల్లి కలిపి తయారుచేసే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- పండ్లతోటలలో మామిడి ప్యాకింగ్ పరిశ్రమలకు మరింత చేయూత
- నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో తక్షణ చర్యలు • మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు రైతులకు లాభదాయకంగా మారాలంటే అగ్రో, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు అవశ్యమని పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గల మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అందుకు తగిన ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించాలని తీర్మానించింది. ఈ అంశంపై విధివిధానాల రూపకల్పనపై సచివాలయంలో బుధవారం అసెంబ్లీలోని సమావేశ మందిరంలో సమావేశమైంది. ఏ విధంగా ప్రోత్సాహకాలు అందిస్తే పెట్టుబడిదారులు ముందుకు వస్తారన్న కోణంలో మంత్రులు సమాలోచనలు జరిపారు. పంటల విస్తీర్ణం, స్థానిక పరిశ్రమలు, సామర్థ్యంపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "రాష్ట్రంలో పత్తి అత్యంత ఎక్కువగా సాగవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన పత్తిపంటకు అనుగుణంగా జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. అయితే పత్తి అధికంగా పండించే నల్గొండ జిల్లాలో జిన్నింగ్ మిల్లులు తక్కువగా ఉన్నాయి. అదేవిధంగా జిన్నింగ్ మిల్లులే కాకుండా పత్తి గింజల నుండి ఆయిల్‌ను, అనుబంధ ఉత్పత్తులను తయారుచేసే పరిశ్రమలు లేవు. అదేవిధంగా పత్తి విత్తనోత్పత్తిలో 90 శాతం ఇతర రాష్ట్రాలకు వెళ్ళి తిరిగి బై ప్రొడక్ట్‌గా మారుతుంది. ఈ బై ప్రొడక్టు తయారుచేసే పరిశ్రమలను ఇక్కడే స్థాపించాలి" అని ఈ సందర్భంగా మంత్రి పోచారం అన్నారు.

"రాష్ట్రంలో పత్తి తర్వాత అధికంగా సాగుచేసే పంట వరి. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే పంటకు సరిపోయే రైస్ మిల్లులు, పార్ బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. అయితే ఇవి కూడా కొన్ని కేంద్రాల్లోనే అధికంగా కేంద్రీకృతమై ఉన్నాయి. పంటపండే ప్రాంతాల్లో వీటిని స్థాపించాల్సిన అవసరం ఉంది. బియ్యం నుండి పిండితో పాటు ఆయిల్, కేకులు, బిస్కట్లు వంటి ఉత్పత్తులు తయారు చేయడానికి అనుబంధ పరిశ్రమలు స్థాపించాలి. మొక్కజొన్న ఉత్పత్తిలో 80 శాతం పౌల్ట్రీ, చేపల పరిశ్రమలో దాణాగా వాడుతున్నారు. మిర్చిని ముడిసరుకుగా ఎగుమతి చేస్తున్నారు. మిర్చిని పౌడర్‌గా, రంగు తీయడానికి అవసరమైన పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం ఉంది" అని ఉపసంఘం సభ్యుడైన మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

"రాష్ట్రంలో పండిస్తున్న మరో ముఖ్యమైన పంట పసుపు. అయితే ప్రస్తుతం మన రాష్ట్రంలో సాగవుతున్న పసుపు రకాలు ఎగుమతికి సరిపోవు. అందుకే ఎగుమతికి అవసరమైన ఇతర రకాలను సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. పసుపుతో పాటు అల్లం, వెల్లుల్లి కలిపి తయారుచేసే పరిశ్రమలు ప్రోత్సహిస్తే వినియోగదారులకు కూడా తక్కువ ధరలో అందుతాయి. పండ్లతోటలలో మామిడి ప్యాకింగ్ పరిశ్రమను నిజామాబాద్ జిల్లాలో ప్రోత్సహించాలి. తద్వారా ఎగుమతులకు అవకాశం ఉంది. బత్తాయికి నల్గొండ జిల్లాలో జ్యూస్ పరిశ్రమతో పాటు ప్యాకేజింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది" అని సూచించారు.

మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమ మంచి అభివృద్ధిలో ఉండి దేశంలో 3వ స్థానంలో ఉంది. రాష్ట్రం నుంచి రోజుకు 2కోట్ల గుడ్లు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నా యి. మాంసం కోళ్ళ ఉత్పత్తి పరిశ్రమలో ఆధునాతన పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మాంసం కటింగ్, ప్యాకింగ్‌లలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించినట్లయితే ఎగుమతులకు భారీ అవకాశం ఉంటుంది. అదేవిధంగా రాష్ట్రంలో గొర్రెలను భారీ ఎత్తున సబ్సిడీపై పంపిణీ చేస్తున్నందున భవిష్యత్తులో మాంసం ఎగుమతులకు ఆస్కారం ఉంది. ఆధునాతన వధశాలలను నిర్మించడంతో పాటు జీవ వ్యర్థాలను శుద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రంగంలో ఆసక్తిగల పారిశ్రామికవేత్తలకు అవసరమైన సబ్సిడీలను ఇవ్వడంతో పాటు ప్రోత్సాహకాలకు అవసరమైన ఇతర సహాయ సహకారాలను అందించేందుకు శాఖలు వారీగా మార్గదర్శకాలను రూపొందించాలి" అని అన్నారు. "ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కలగడంతో పాటు రైతులు ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుంది. అదేవిధంగా రైతులలో ఆశావాహ కల్పించి ఎగుమతికి, పరిశ్రమలకు అనుకూలంగా ఉండే పంటలను, రకాలను సాగుచేసే విధంగా అవగాహన కల్పించాలి. వచ్చే ఏడాది తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి కోటి ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీంతో పాటు పుష్కలంగా నీరు లభించడంతో తెలంగాణలో వ్యవసాయ అనుబంధ రంగాలలో ఊహించలేనంత మార్పు వస్తుంది. పంటల ఉత్పత్తులు అధికమవుతాయి. దీనికి అనుగుణంగా అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించాలి. పరిశ్రమలతో పాటు కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ల్యాబ్‌లు, బీమాసౌకర్యం కల్పించాలి. ప్యాకేజింగ్ ఉత్పత్తులకు అపార అవకాశాలు ఉన్నాయి. మల్టీనేషనల్ కంపెనీలు, రైస్ రిటైల్ మార్కెట్‌లో ప్రవేశించే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది" అని మంత్రి హరీష్‌రావు అభిప్రాయపడ్డారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు అందించాల్సిన సహకారాలు, మార్గదర్శకాల రూపకల్పనకు ఈనెల 24న మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు కేటీ రామారావు, టి.హరీష్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్వర్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

మా డిమాండ్ వదిలేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుతున్నామని ఎంపీ బూర నర్సయ్య గౌడ్ నొక్కి చెప్పారు. కొత్తగా ఏర్పడ్డ మా రాష్ట్రం కోసం పోరాడుతున్న మమ్మల్ని మీ స్వార్థ రాజకీయాల కోసం ఎందుకు బలి చేస్తున్నారని మరో పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ ప్రశ్నించారు.

సైలెంటుగా ఉంటే సబ్జెక్ట్ క్లోజ్ అయినట్టు కాదు... ఎంపీ బూర నర్సయ్య గౌడ్

13 రోజుల నుంచి రాష్ట్రాల రిజర్వేషన్ల అంశం మీద నిరసన తెలుపుతున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని, మా డిమాండ్లపై స్పందించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను తాముంత కలిశామని, రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని కోరాం. స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పీకర్‌కు తెలిపామని వెల్లడించారు. సైలెంటుగా ఉంటే సబ్జెక్ట్ క్లోజ్ అవుతుందని అనుకుంటే అది అపోహా మాత్రమేనన్నారు. తాము ప్రభుత్వం నెలకు ఇచ్చే లక్ష రూపాయల కోసం పనిచేయడం లేదన్నారు. సమస్యల కోసం పోరాడమని ప్రజలు తమని పంపించారని, చాలా వరకు తమ సొంత ఖర్చులే పెట్టుకుంటున్నామని ఆయన తెలిపారు.

ప్రాంతీయపార్టీలతోనే సభలు వాయిదా... సీతారాం నాయక్ టీఆర్ఎస్ ఎంపీ

"బీజేపీ ఒక స్ట్రాటజీ పెట్టుకుంది.12 గంటలకు ఒకసారి, ఆ తర్వాత రోజుకి వాయిదా వేస్తున్నది. మమ్మల్ని ఎందుకు బలి చేస్తున్నారు. మాకు కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. మా రాష్ట్రం కోసం మేము పోరాడుతున్నాం. మేము ఆంధ్ర మిత్రులకు అన్యాయం చేయడం లేదు. రిజర్వేషన్లపై హౌజ్‌లో మొదటి నుంచి మేం నిరసన తెలుపుతున్నాం. తెలంగాణ, ఏపీ ప్రజలు, నాయకులు అన్నదమ్ముల్లాగా ఉంటున్నాం" అని సీతారాం నాయక్ అన్నారు.

సగరులను గ్రూప్-ఏలో చేర్చాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: సగరులను బీసీ గ్రూప్-డి నుంచి గ్రూప్-ఏలో మార్చాలని సగర(ఉప్పర) హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఇదే అంశంపై సంఘం అధ్యక్షులు నీలిడి భూపేష్ సాగర్, బీసీ సంక్షేమ సంఘం జాతీ య ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ రోహిణికి విజ్ఞప్తి చేశారు. సగరులు గ్రూప్- డిలో ఉండటం మూలంగా రిజర్వేషన్లను పొందలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు తమను బీసీ గ్రూప్- డి నుంచి గ్రూప్-ఏలోకి మార్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహర్షి భగీరథ జయంతిని అధికారికంగా జరిపేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

తెలుగును వదిలేసే స్కూళ్లపై

క్రిమినల్ కేసులే!

(మొదటిపేజీ తరువాయి)

అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తెలుగును తప్పనిసరిచేస్తూ చట్టాన్ని సభ ముందుకు తీసుకువచ్చి ఆమోదం పొందేలా చేయాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని ఆ రాష్ట్ర మాతృభాష తమిళాన్ని తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కొంతమంది విద్యావేత్తలు, రాజకీయ పక్షాలు సవాల్ చేశాయి. వీరు హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని తిరిగి సుప్రీంకోర్టుకు వెళ్ళినా అక్కడ కూడా వారికి ఎదురు దెబ్బ తగిలిందని అధికారులు చెబుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో తమిళ భాషను తప్పనిసరి చేస్తూ శాసనసభలో చట్టాన్ని తీసుకువచ్చి అమలు చేశారని అక్కడ కూడా పదవ తరగతి వరకు తెలుగు భాషను తప్పనిసరి చేసేలా చర్యలు తీసుకున్నారని వారు పేర్కొన్నారు. దక్షిణాదిలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో మాతృభాషకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ ఆయా భాషలను రాష్ట్ర విద్యార్థులు నేర్చుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అదే బాటలో మన రాష్ట్రం కూడా పయనిస్తోందని వారు తెలిపారు. చట్టం రూపకల్పనకు సంబంధించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ నేతృత్వంలో కసరత్తు జరుగుతుందని గత మూడు రోజులుగా న్యాయ కోవిదులు, ఆయా రంగాల్లో నిష్ణాతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవసరమైన సలహాలు పొందుతున్నట్లు సమాచారం. వచ్చే విద్యాసంవత్సరం (2018-19) నుంచి తెలుగును తప్పనిసరి చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అన్ని పాఠశాలలు ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే ఆయా జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా పాఠశాల యాజమాన్యాలకు వర్తమానాలు అందినట్లు తెలుస్తోంది. ఆయా తరగతుల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు తెలుగు తప్పనిసరి అన్న విషయాన్ని స్పష్టంచేయాలని ఒకవేళ మాతృభాషతో సంబంధం లేకుండా ప్రవేశాలు పొందాలనుకునే వారికి అడ్మిషన్ నిరాకరించాలని అధికారులు యాజమాన్యాలను ఆదేశించారు. తెలుగు భాషను విద్యార్థులకు బోధించేలా ప్రతి పాఠశాల యాజమాన్యం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసుకోవాలని వారు తెలుగులో మంచి ప్రావీణ్యత సాధించి ఉండాలన్న నిబంధన విధించనున్నారు. ఎంఏలో తెలుగు చదివి ఉండాలని ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన ఉపాధ్యాయులకు యాజమాన్యాలు ప్రాధాన్యతనిచ్చి వారిని ఎంపిక చేయాలన్న ఆదేశాలు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమైన రెండు వారాల్లో ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను నియమించి తమ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయాలని ప్రతిపాదించారు. ఈ తనిఖీల్లో యాజమాన్యాలు తెలుగును బోధించేందుకు అవసరమైన అధ్యాపకులను నియమించింది, లేనిది చూడాలని వారు ప్రత్యేకంగా తరగతులను నిర్వహిస్తున్నది, లేనిదన్న విషయంలో అధ్యయనం చేసిన నివేదిక తెప్పించుకుని విధంగా మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయించారు. ప్రతినెలా విధిగా ప్రతి తరగతికి కనీసం రెండు తరగతులు బోధించేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. త్వరలోనే తెలుగు తప్పనిసరికి సంబంధించి జిల్లాస్థాయిలో సదస్సులు నిర్వహించి అందుకు అనుగుణంగా యాజమాన్యాలకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు రాయితీలు

- రూ. 628 కోట్ల జేకేపేపర్ మిల్స్ పెట్టుబడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీలు, మినహా యింపులు ప్రకటించింది. పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ పేపర్ మిల్లును రూ.628 కోట్ల పెట్టుబడితో పునరుద్ధరించేందుకు జేకే పేపర్ మిల్స్ ముందుకొచ్చింది. ప్రభుత్వంతో జరిగిన చర్చల తర్వాత కంపెనీని పునరుద్ధరించి దానిపై ఆధారపడిన కార్మికుల కుటుంబాలను కాపాడేందుకు ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. ఈ ప నరుద్ధరణపై ఏర్పాటైన మంత్రివర్గ బృందం ప్రభుత్వానికి అనేక సిఫారసులు చేసింది. వాటిని పరిశీలించిన ప్రభుత్వం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. కంపెనీ పునరుద్ధరణలో భాగంగా పదేళ్ల పాటు నూరుశాతం స్టేట్ ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్ చేయనున్నట్లు తెలిపింది. అలాగే స్టాంప్ డ్యూటీ నూరుశాతం మినహాయింపు, పెట్టుబడి రాయితీగా 20శాతం గానీ, గరిష్టంగా రూ.50 కోట్ల ఇవ్వనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొంది. ఈ కంపెనీకి అవసరమైన ముడి పదార్థాలు యూకలిప్టస్, సుబాబుల్ చెట్లను రాష్ట్ర ప్రభుత్వ అడవుల నుంచి పదేళ్లపాటు టన్నుకు రూ.1000 రాయితీతో సరఫరా చేస్తారు. అలాగే సింగరేణి కాలరీస్ నుంచి ఈ కంపెనీకి బొగ్గును, టన్ను రూ.1000 రాయితీతో పదేళ్లపాటు సరఫరా చేస్తారు. ఈ సంస్థను పునరుద్ధరించి తిరిగి ప్రారంభించేందుకు రెండు నెలల్లో అన్ని రకాల అనుమతులు పూర్తిచేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో తెలిపింది. సిద్ధ్యాసికి ఉపయోగించిన, అటవీ భూముల్లో చెట్టు పెంచేందుకు కంపెనీకి కొన్ని ప్రాంతాలను అందుబాటులోకి ప్రభుత్వం ఉంచుతుంది. విద్యుత్ ఛార్జీల్లో కూడా భారీ రాయితీలు ప్రకటించింది. ఒక్కో యూనిట్‌పై రూ.3 చొప్పున మూడేళ్లపాటు రీయింబర్స్ చేయనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

డీఈవోకు హైకోర్టు వారెంట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పశ్చి మగోదావరి జిల్లా విద్యాధికారి (డీఈవో) ఆర్.ఎస్.గంగాభవానికి కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు ఏప్రిల్ 4న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డి ఆదేశాలు వెలు వరిం చారు. తదుపరి విచారణ ఏప్రిల్ 4కి వాయిదా వేశారు. పగో జిల్లా, పెంటపాడులోని ఎస్.టి.బీవీఎన్ హిందూ హైస్కూల్ (ఎయిడెడ్) లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం అనుమ తించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడం జరిగింది. స్కూల్ కరస్పాండెంట్ తరపు న్యాయవాది సీహెచ్.శ్యాంసన్ బాబు వాదనలు విని తీర్పు చెప్పారు. గతంలో హైకోర్టు ఆదే యించిన 78 ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కోర్టు అను మతించిందని, తమ పాఠశా లలో కూడా ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతించాలని కోరి నట్లు తెలిపారు. అయితే ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఎస్‌టీబీవీఎన్ హిందూ హైస్కూల్‌లో కూడా ఖాళీలను భర్తీ చేసేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఆదేశాలను అమలు చేయక పోవడంతో పిటిషనర్ సంస్థ కోర్టు ధిక్కరణ కేసును దాఖలు చేసిందన్నారు.

బావిలో దూకిన కారు

- ఇద్దరు మృతి • మరో ఇద్దరికి గాయాలు





హుజూరాబాద్, ప్రభన్యూస్ : హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామశివారులోని వరంగల్ - కరీంనగర్ జాతీయ రహదారి పక్కన వ్యవసాయ బావిలో బుధవార మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి బావిలో పడింది. ఈ ప్రమాదంలో తాత, మనుమడు మృతి చెందగా తల్లిబిడ్డలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...వరంగల్ జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌కు చెందిన ఎదురుగట్ల సుధాకర్ (65), కోడలు భవాని, మనుమడు వివాన్ (6), మనుమరాలు స్పార్కలు కారులో వరంగల్ నుండి తాడికల్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా సింగాపూర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బ్రేకు ఫెయిల్ అదుపుతప్పి రోడ్డుపక్కన గల వ్యవసాయ బావిలోకి దూసుకెళ్ళింది. ప్రమాద విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్రామస్థుల సహాయంతో బావిలో నుండి సంఘటనగారిని బయటకు తీశారు. అప్పటికే తాత సుధాకర్, మనుమడు వివాన్‌లు మృతి చెందారు. కోడలు భవాని, మనుమరాలు స్పార్కలకు తీవ్ర గాయాలు కాగా సుధాకర్‌ని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సుధాకర్, వివాన్‌ల మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హుజూరాబాద్ ఏసీపీ కృపాకర్, టౌన్ సీఐ రమణమూర్తి, రూరల్ సీఐ రవికుమార్‌లు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన తాత, మనుమడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతదేహాలవద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించింది.



బొడ్డుపల్లి శ్రీనివాస్ కేసులో...

ముద్దాయిల బెయిల్ రద్దు

- వారం రోజుల్లో లొంగిపోవాలని కోర్టు ఆదేశం


నల్లగొండ (టౌన్), ప్రభన్యూస్ : తెలంగాణలో సంచలనం సృష్టించిన మున్సిపల్ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకేసు మరో మలుపు తిరిగింది. హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొని అరెస్టయిన ఐదుగురు ముద్దాయిలకు ఇటీవలే బెయిల్ మంజూరైంది. ఈ విషయంపై ఇప్పుడు పెద్ద దుమారం రేపింది. అప్పటికే ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు టీఆర్ఎస్ నేతల కనుసన్నల్లోనే హత్య జరిగిందని పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. సంతాపసభ ఏర్పాటు చేసి పోలీసుల తీరుతో పాటు అధికార పార్టీ తీరును ఎండగట్టారు. అయితే హత్యచేసిన నిందితులకు వెంటనే బెయిల్ రావడంపై పోలీసులు కూడా సీరియస్‌గా తీసుకొని బెయిల్ రద్దుచేయాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. నిందితులకు బెయిల్ రావడంతో విచారణకు ఆటంకం కలుగుతున్నదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై పూర్వాపరాలను విచారించి ప్యామిలీకోర్టు న్యాయమూర్తి బెయిల్‌ను రద్దుచేశారు. ఏ6 నుంచి ఏ10వరకు నిందితులుగా ఉన్న వారికి బెయిల్ రద్దుచేస్తూ జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఏ6గా ఉన్న దాయమూరి నరేష్, ఏ7 వంగాల మహేష్, ఏ8 మిట్టపల్లి సాయి, ఏ9 మెరుగు గోపి, ఏ10 మాతంగి మోహన్ బెయిల్‌ను రద్దుచేశారు. వారం రోజుల్లో కోర్టులో లొంగిపోవాలని ఆదేశించారు. ఈ పరిణామాలు పట్టణంలో మళ్ళీ చర్చనీయాంశంగా మారాయి. బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య వ్యవహారం మళ్ళీ తెరపైకి రావడంతో ఏం జరుగుతుందోనని ప్రతిఒక్కరు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా కేసును విచారణ చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సెలవుల్లో ఉండడం.. ఎస్పీపై బదిలీ వేటు కూడా పడింది. ఏది ఏమైనా బొడ్డుపల్లి శ్రీను హత్యకేసులో మరో ట్విస్ట్ కనిపిస్తుంది.

అడవుల్లో ఔషధ మొక్కలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అడవుల్లో ఔషధ మొక్కలను పెంచి తద్వారా గిరిజన ప్రాంత రైతులకు ఆదాయ వనరులను మెరుగుపరచ దుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిద్ధ మవుతోంది. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొంది స్తున్నారు. ప్రపంచ అటవీ దినోత్స వాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీలో బుధవారం ప్రత్యేక కార్యక్ర మం నిర్వహించారు. వ్యవసాయ కళాశాలలోని ఔషధ మొక్కల తోటలో పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మం జరిగింది. ముసిర నగరా లు, అడవులు అన్న అంశంపై కాటన్ బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ డి.నరసింహారెడ్డి ఉపన్యాసం చేశారు. నిత్యజీవితంలో ఔషధ మొక్కల ప్రాధాన్యతపై ఆయుష్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ కొండపల్లి నరసింహారెడ్డి ప్రసంగించారు.

ప్రకృతి వ్యవసాయంలో
ఏపీదే అగ్రస్థానం

• టెక్నాలజీతో లాభసాటిగా సేద్యం: ఏపీ సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గతి తప్పిన వ్యవసాయ రంగాన్ని కొత్తపుంతలు తొక్కించడానికి, ఈ రంగాన్ని లాభసాటిగా చేయడానికి తమ ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా వ్యూహాత్మకంగా వ్యవహరించిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. 10 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో 1978 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, గత నాలుగేళ్లలో 242 మంది రైతులు వివిధ కారణాల రీత్యా ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు.రైతుకు గిట్టుబాటు ధరలు, అదే సమయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని బుధవారం రాష్ట్ర శాసన సభలో 'వ్యవసాయం అనుబంధ అంశాలపై' జరిగిన లఘు చర్చలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ పార్టీ హయాంలో నాసిరక విత్తనాలు విలయతాండవం చేసేవని, అంతే కాక అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు రైతులకు చేరువలో ఉండేవి కావని, తమ ప్రభుత్వం పలు ప్రణాళికలను రచించి ఆ దుస్థితిని తొలగించిందన్నారు.

హోదాకు కట్టుబడి ఉన్నాం

• జనసేన నేత రియాజ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రత్యేకహోదా విషయంలో జనసేన పార్టీ కట్టుబడి ఉందని, తమ వైఖరిలో మార్పు లేదని ఆ పార్టీ నాయకుడు షేక్ రియాజ్ అన్నారు. ప్రత్యేకహోదా కోసం రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలు ఒకే మాటపై నిలవడం లేదని ఆయన దుయ్యబట్టారు. వైకాపా, తెదేపాలు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. విభజన చట్టంలో చెప్పిన హామీలు, నిధులు రాష్ట్రానికి ఇవ్వాలని జనసేన డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకే తమ పార్టీ నడుస్తోందని, ఏ పార్టీ ఆదేశాలతో పని చేయడం లేదని జనసేన నాయకుడు అద్దేపల్లి శ్రీధర్ అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల లేవనెత్తిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. తమకు ఏ పార్టీ దూరం కాదని, అలాగే ఏ పార్టీ కూడా దగ్గర కాదని ఆయన అన్నారు. ప్రత్యేక హోదా కోసం జనసేన ఒక్కటే మొదటి నుంచి పోరాటం చేస్తోందని ఆ పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. విభజన హామీల కోసం రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు.

ప్రత్యేక హోదా
సాధన సమితికి మద్దతు

• టీడీపీ ఏపీ అధ్యక్షుడు కళా వెంకట్రావు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం జాతీయ రహదారులపై నిరసనలు చేపట్టనున్న ప్రత్యేక హోదా సాధన సమితికి టీడీపీ మద్దతు తెలుపుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు బుధవారం తెలియజేశారు. హోదా, విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్లమెంటులో టీడీపీ అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెడితే, అది చర్చలకు రాకుడం బీజేపీ పాలకులు కుట్రలు చేస్తుండటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ గత కొద్ది రోజులుగా ఇటు రాష్ట్రంలోనూ, అటు ఢిల్లీలోనూ టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుత నిరసనలు తెలుపుతున్నారని గుర్తు చేశారు. ఆంధ్రుల హక్కు అయిన హోదాను, నవ్యాంధ్ర అభివృద్ధి కోసం పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలను అమలు చేసేంతవరకు పోరాటం ఆపేదిలేదని, ఈ నేపథ్యంలోనే ప్రత్యేక హోదా సాధన సమితి జాతీయ రహదారులపై చేపడుతన్న నిరసనల్లో వారికి సంఘీభావంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా పాల్గొంటున్నారని తెలిపారు.

'పది' పరీక్షలకు
సంఘీభావం

• ప్రత్యేక హోదాను వ్యతిరేకించే బీజేపీని వెలివేయాలి: సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ

అమరావతి,ఆంధ్రప్రభ: ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు జరుగుతున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉదయం 10 నుండి 12 గంటల వరకు మాత్రమే జాతీయరహదారుల దిగ్బంధనం చేపడుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమానికి సహకరించి ఆంధ్రులంతా ఒకటే వాయిస్ అనేలా కేంద్రానికి సంకేతానివ్వాలన్నారు. అలాకాకుండా ప్రభుత్వం ఏమాత్రం అత్యుత్సాహం ప్రదర్శించి కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించినా ప్రజల ఛీత్కారానికి గురికావల్సి పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. విజయవాడ లోని సీపీఐ పార్టీ కార్యాలయం దాసరిభవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మనదంతా ఒకటే వాయిస్ కావాలి. ఆ విషయం కేంద్రానికి తెలిసేలా వారి కూసాలు కదిలేలా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక హోదా, విభజనాంశాల అమలు కోసం జరిగే జాతీయ రాహదారుల దిగ్బంధనాన్ని పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఉప్పెనలా తరలిరావాలని పిలుపు నిచ్చారు. గత నెల ఫిబ్రవారి 8వ తేదీ నిర్వహించిన రాష్ట్ర బంద్ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అందరూ సహకరించడంతో ప్రత్యేకహోదా ఉద్యమం జాతీయస్థాయిలో చర్చనీయాంసమైందని గుర్తు చేశారు.

రేపు అసెంబ్లీ ముట్టడి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతాంగ సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 23 న అసెంబ్లీ ముట్టడికి కిసాన్ మోర్చ పిలుపు నిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నేతలు రఘునందన్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి, ఆకుల విజయ, సుధాకర్‌శర్మ, పాయం శంకర్, విక్రంరెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. ఈ ముట్టడి కార్యక్రమంలో మెదక్, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాలకు చెందిన రైతులు మాత్రమే పాల్గొంటారని తెలిపారు. రైతులకు రుణ మాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ బ్యాంకర్లు రుణాలు కట్టడం లేదని నోటీసులు పంపి చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారన్నారు.

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

• శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం • అధికారులతో డీజీపీ మహేందర్‌రెడ్డి సమీక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాంతి భద్రతల పరిరక్షణలో మరింత మెరుగైన చర్యలు తీసుకుంటూ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి విజిగా విజిగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంక్షించిన రీతిలో హైదరాబాద్ సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శాంతి భద్రతలు మెరుగుకు అవసరమైన చర్యలను తీసుకునే దిశగా అధికారులకు దిశా నిర్దేశం కావిస్తున్నారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలన్న సదాశయంతో ఆయన ముందడుగు వేస్తున్నారు. అనునిత్యం అధికారులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజల భాగస్వామ్యంతో శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యపడగలదని ఆయన నమ్ముతూ వ్యూహం ఫలిస్తూ వస్తున్నారు. అదే ఆచరణలో అమలయ్యేలా చూస్తున్నారు. డీజీపీగా బాధ్య తీసుకున్న దగ్గర్నించీ శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ వినియోగంతో పాటు సిబ్బంది నుంచి మెరుగైన పనితీరు రాబట్టేందుకు ఆయన కృషి చేస్తున్నారు. తాను హైదరాబాద్ సిటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో తీసుకువచ్చిన సంస్కరణలను ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ వస్తున్నారు. హైదరాబాద్ సిటీలో సక్సెస్ సాధించిన టీఎస్ కాప్ యాప్, ఈ-పెట్టీ యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా చేశారు. జిల్లాలను పర్యటించారు. తొలి జిల్లాగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ఆయన పర్యటించారు. ఆ పర్యటన సందర్భంగా మావో ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్లలో భద్రతా పరమైన చర్యలను సూచించారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు జంపన్న, అతడి సహచరులు లొంగిపోయిన తరుణంలో మిగతా 135 మంది మావోలు జన జీవన స్రవంతిలో కలవాలని వారికి పునరావాసం కల్పించగలమన్న హామీని అందజేశారు. అదే సమయంలో ఎవరూ ఆర్మీతుల్లో ఆ వైపు వెళ్లొద్దన్న విషయాన్ని సైతం ఆయన ప్రస్తావించడం గమనార్హం. ప్రతీ విషయంలోనూ తనదైన ముద్రను కన బరుస్తూ అధికారుల నుంచి మెరుగైన పనితీరు రాబట్టేందుకు ఆయన శతథా ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ శరవేగంతో నిర్మాణం పూర్తి చేసుకుంటోంది. ఆరు నెలల వ్యవధిలోనే ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభానికి నోచుకోనుంది. ఈ క్రమంలో ఆ లోపుగా జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ స్థాపనకు కృషి చేస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడింటినీ మూడు కమిషనరేట్లు అనుసరిస్తూనే మొత్తం గా హైదరాబాద్‌గానే చూడాల్సి ఉందని.. మొత్తం గ్రేటర్ పరిధిలో నేను సైతం ప్రాజెక్టు ద్వారా 10 లక్షల సీసీకెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని అధికారులకు సూచిస్తూ వస్తున్నారు. మిగతా కమిషనరేట్ల పరిధిలోనూ, జిల్లాల్లో సైతం నేను సైతం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చెబుతున్నారు. సైబర్ నేరాలు ఓ ఛాలెంజింగ్.. సైబర్ నేరాలకు టెక్నాలజీతో అడ్డుకట్ట వేయాలని ఆయన సూచిస్తున్నారు. ఇదే క్రమంలో స్పేస్ టెక్నాలజీని సైతం వినియోగిస్తే మరింత ఉపయుక్త కరంగా ఉంటుందని ఆయన భావిస్తున్నారు. ఆ దిశగా కూడా ఆలోచన చేస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నప్పుడే పెట్టుబడి దారులు పెట్టుబడి పెట్టేం దుకు ముందుకు వస్తారని.. ఆ పెట్టుబడుల ఫలితంగా ఎన్నో హైదరాబాద్ పరిధిని దాటి జిల్లాలకు పెట్టుబడులు తరలిరావాల్సిన అవసరం ఉందని తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు స్థానికంగా ఉద్యోగావకాశాలు లభించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ఆయన చెబుతూ వస్తున్నారు. ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యం కూడా ఇదే. తాజాగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తొమ్మిది పోలీసు కమిషనరేట్ల కమిషనర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సైతం శాంతి భద్రతల పరిరక్షణ అంశాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. ట్రాఫిక్‌లోనూ టెక్నాలజీ వినియోగం ద్వారా సక్సెస్ సాధించిన సంగతి విదితమే. ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేసే యోచనలో ఆయన ఉన్నారు. అదే క్రమంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ బలోపేతం కావాల్సిన అవసరం కూడా అంతే ఉందని ఆయన చెబుతున్నారు.

నకిలీ విత్తనాలపై కొరడా...

రాష్ట్రంలో నకిలీ విత్తనాలకు అడ్డుకట్టవేయాలని అగ్రికల్చర్ అధికారులతో కలిసి స్పెషల్ పోలీస్ టీమ్‌లను రంగంలోకి దింపుతున్నారు. నకిలీ విత్తనాలను విక్రయం చేసే ఏరివేతకు ఉదాసీనత వ్యవహరించిన విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. నకిలీ విత్తనాల కేసుల్లో అరెస్టయిన వారిపై పీడీ యాక్ట్‌ను సైతం ప్రయోగిస్తున్న సంగతి తెలిసిందే.

వర్సిటీ టీచింగ్
పోస్టుల భర్తీ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల్లో ఎంతోకాలంగా ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. బుధవారం విజయవాడ బందర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్ సమావేశ మందిరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ విషయం వివరించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి త్వరలోనే స్కీనింగ్ టెస్ట్ నిర్వహించబోతున్నామని తెలిపారు. 3 క్యాటగిరీలలో మొత్తం 1,711 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కమిటీ పరిశీలనలో గుర్తించడం జరిగిందన్నారు. వీటిలో 1,385 పోస్టుల భర్తీకి సిఫార్సు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 2015 అక్టోబర్ 31 న కమిటీ ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించిందని తెలిపారు. రాష్ట్రంలోని 14 యూనివర్శిటీల పరిధిలో 3,259 పోస్టులు మంజూరై ఉన్నాయని అన్నారు. వాటిలో 1554 పోస్టులు (48శాతం) భర్తీ కాబడి ఉన్నాయన్నారు. ఇంకా ఖాళీగా ఉన్న 1,117 పోస్టులలో ఫేజ్ - 1 ద్వారా 846, ఫేజ్ 2 ద్వారా 263 పోస్టుల కోసం ప్రస్తుతం స్క్రీనింగ్ టెస్ట్ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపట్టడడం జరుగుతుందన్నారు. ఈ స్కీనింగ్ టెస్ట్ ఏపీపీఎస్‌సీ ద్వారా నిర్వహించాలని వైస్ చాన్సలర్ల సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. గతంలో వివిధ యూనివర్శిటీలలో పోస్టుల భర్తీలలో జరిగిన అవకతవకలు కారణంగా భర్తీ ప్రక్రియను ఈసారి ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అప్పజెప్పడం జరిగిందన్నారు. అంతే తప్ప యూనివర్శిటీల అటానమస్‌లో జోక్యం చేసుకునే ఉద్దేశం కాదని, పోస్టుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. అసిస్టెంట్ప్రొఫెసర్ పోస్టులభర్తీకిసంబంధించిస్కీనింగ్ టెస్ట్‌కోసం వివిధ యూనివర్శిటీలలో 76,356 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ (విశాఖపట్నం) పరిధిలో 19,500 దరఖాస్తులు రాగా, తిరుపతి ఎస్వీయూ 14,278, అనంతపురం జెఎన్‌టీయు 11,193, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ(గుంటూరు) 6,626, శ్రీకృష్ణదేవరాయ (అనంతపురం) 6306, డాక్టర్ అంబేద్కర్ యూనివర్శిటీ (శ్రీకాకుళం) 2968, రాలయసీమ యూనివర్శిటీ పరిధిలో (కర్నూల్) 2690 దరఖాస్తుల వచ్చాయని చెప్పారు. అలాగే ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ (రాజమహేంద్రవరం) 2,586, కాకినాడ జెఎన్‌టీయు నుంచి 2560, నెల్లూరు విక్రమసింహపురి యూనివర్శిటీ పరిధిలో 2490, కడప యోగి వేమన యూనివర్శిటీ 2379, మచిలీపట్నం కృష్ణా యూనివర్శిటీ 1363, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ 761, కుప్పం ద్రవిడ యూనివర్శిటీ పరిధిలో 656 దరఖాస్తులు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు కోసం వచ్చాయని మంత్రి చెప్పారు. స్కీనింగ్ టెస్ట్ పరీక్షలు ఏపీపీఎస్‌సీ ద్వారా ఏప్రిల్ 9 నుంచి 13 వతేదీ వరకు 11 కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

పట్టిసీమపై టీడీపీ వర్సెస్ బీజేపీ





అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా - గోదావరి నదుల అనుసంధానంలో కీలకపాత్ర పోషించిన పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణంపై బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వాడీవేడి చర్చ జరిగింది. అధికార తెలుగుదేశం, బీజేపీ పార్టీ నేతల మధ్య మాటలయుద్ధం కొనసాగింది. అవినీతి జరిగిందని ప్రభుత్వ సంస్థ అయిన కాగ్ చెబుతుందని బీజేపీ సభ్యుడు విష్ణు కుమార్ రాజు ప్రస్తావించగానే తెలుగుదేశం నుండి మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కింజరపు అచ్చంనాయుడు, కాల్వ శ్రీనివాసులు బీజేపీ నేత విష్ణు కుమార్ రాజుపై మాటల దాడి చేశారు. దీంతో కాసేపు సభలో తెలుగుదేశం, బీజేపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కల్పించాల్సిన మౌలిక వసతులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలువురు శాసన సభ్యులకు అమ అభిప్రాయాలను వెల్లడించడానికి స్పీకర్ అనుమతిచ్చారు. ఈ సందర్భంగా శాసన సభలో పలువురు టిడిపి సభ్యులు చంద్రబాబు సారధ్యంలో వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన వైనంతోపాటు ఆయా రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. అనంతరం బిజెపి శాసన సభా పక్షనేత పి.విష్ణుకుమారరాజుకు మాట్లాడుతూ, పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించి భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రూపొందించిన వార్షిక నివేదికలో పొందుపరచిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. నిర్ణీత గడువులోగా పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేశారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును ప్రశంసిస్తూనే ఈ ప్రాజెక్టులో రూ.350 కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకుందంటూ ఆరోపణలు చేశారు. దీంతో సభలో కొంతసేపు దుమారం చెలరేగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బీజెపి శాసన సభాపక్ష నేత పి.విష్ణుకుమార్‌రాజుల మధ్య తీవ్రవాగ్యుద్ధం చోటుచేసుకుంది. తాను పట్టిసీమ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై సీబిఐ లేదా సిటింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని విష్ణుకుమారరాజు డిమాండ్ చేశారు. దీంతో మంత్రి దేవినేని ఉమతో పాటు మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కాలువ శ్రీనివాసులు విష్ణుకుమార్‌రాజుపై ఎదురుదాడి చేశారు. పట్టిసీమను నిర్ణీత గడువులోగానే పూర్తిచేసి గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజికి రప్పించిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కిందని మంత్రి దేవినేని అన్నారు. కృష్ణాడెల్టా రైతులుకూడా ఈ విషయంలో చంద్రబాబును పొగడుతున్నారని చెప్పారు. కానీ బిజెపి సభ్యులు మాత్రం రైతు ద్రోహులు, ప్రజా ద్రోహులుగా వ్యవహరిస్తున్నారని మంత్రి దేవినేని విష్ణుకుమార్ రాజుపై ధ్వజమెత్తారు. అసెంబ్లీలోని బిజెపి సభ్యులకు ఏ అంశం పైనాకూడా కనీస అవగాహన లేదని ప్రతిపక్షనేత జగన్‌మోహనరెడ్డి, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్ బుగ్గన రాజేంద్రరెడ్డి రాసి అందించిన కాగితాలను సభలో విష్ణుకుమారరాజు చదువుతున్నాడని విమర్శించారు. పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణాన్ని పత్రికలకెక్కిమరీ ప్రశంసించిన విష్ణుకుమారరాజు ఇటీవల తమపార్టీతో బిజెపి తెగత్రెంపులు చేసుకున్న తరువాత ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ స్వరం మార్చారని దుయ్యబట్టారు. కాగ్ నివేదిక వాస్తవ పత్రం కాదన్న విషయం తెలుసుకోకుండా అందులో పొందుపరచిందే నిజమంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే రీతిలో విష్ణుకుమారరాజు మాట్లాడుతున్నారని, అయితే గత మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించి నోరు మెదపకుండా ఇప్పుడు విమర్శించడంలోని ఆంతర్యం ఏమిటని మంత్రి ఉమా నిలదీశారు.

బాబు వచ్చాక
పంటలు తగ్గాయ్: జగన్



చిలకలూరిపేట, ప్రభ న్యూస్: చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రజాసంకల్పయాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం చిలకలూరిపేట పట్టణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర రాకపోవటంవల్లనే రైతులు పంట వేయటం స్వచ్ఛందంగా తగ్గించుకొన్నారన్నారు. వేసి నష్టపోయేకంటే పంటవేయకుండా ఉండటం మంచిదనుకొని పంటను తగ్గించుకున్నారని ఆయనతెలిపారు. రాష్ట్రంలో తాగటానికి మంచినీరు దొరకటంలేదుకాని, బెల్టుషాపుల ద్వారా మద్యం పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉందదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకహోదా పై రోజుకు మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. నాలుగు సంవత్సరాల పాటు ప్రత్యేకహోదాపై కేంద్రాన్ని నిలదీసే అవకాశం ఉన్నా చంద్రబాబు ఆ పనిచేయలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపించేసరికి తాను చేసిన తప్పులను వేరొకరిపై మీద వేసి తప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రత్యేకహోదా కావాలని , అది సంజీవని లాంటిది అని అన్న చంద్రబాబు తర్వాత 2014లో జూన్ నెలలో కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారి ప్రత్యేక ప్యాకేజీ అయినా సరిపోతుందని శాసనసభలో ప్రకటించారన్నారు.

భాష తెలిస్తేనే బాధ అర్ధమయ్యేది

• స్థానిక భాషను గుర్తిస్తున్న ఐఏఎస్‌లు • గోండు భాషను నేర్చుకున్న ఆదిలాబాద్ కలెక్టర్



ఆంధ్రప్రభ, హైదరాబాద్: అధికార వికేంద్రీకరణ ద్వారానే ప్రజలకు స్థానిక పాలన మరింత మెరుగుపడుతుందని కొత్త రాష్ట్రం తెలంగాణ గుర్తించింది. ఈ దిశగా జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ప్రజలకు చేరువగా పాలనను చేర్చింది. అంతిమంగా ప్రజలకు నేరుగా ఫలాలు అందాలనే లక్ష్యం ఇప్పుడిప్పుడే విజయతీరాలకు చేరువవుతున్న క్రమంలో జిల్లా పాలనకు కీలకమైన కలెక్టర్లు కూడా మరింత పట్టుదలగా ముందుకెళ్తున్నారు. ప్రజా సమస్యలు తెలియాలంటే క్షేత్రస్థాయిలో ఐఏఎస్ అధికారులకు అక్కడి భాష తెలియాలి. కలెక్టర్‌గా పనిచేసే చోట ఏ ఐఏఎస్ అధికారైనా ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్ర భాష వచ్చి ఉండాలి. నిత్యం ప్రజలు సంభాషించే భాష కనీసం తెలిసుండాలి. ఇదీ ఐఏఎస్ మాన్యువల్‌లో ఒక నిబంధన. అయితే దీనిపై ఇప్పటి ఐఏఎస్ అధికారులకు పెద్దగా పట్టింపు లేదు. అందరూ ఇంగ్లీష్, హిందీల్లో మాట్లాడితే చాలనే భావనకు వస్తున్నారు. అయితే వీటికి విరుద్దంగా గిరిజనులకు కూడా అర్ధమయ్యే భాషను ఒక ఐఏఎస్ అధికారి నేర్చుకుని అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. వారి భాషలోనే వారి సమస్యలను వింటూ, వారి స్థితిగతులను తెలుసుకునేలా ఆదిలాబాద్ కలెక్టర్ దివ్య దేవరాజన్ గోండు భాషను నేర్చుకుంటోంది. తన స్కిల్స్‌తో ప్రజలకు మరింత మేలు చేయడమే లక్ష్యమని ఆమె చెబుతోంది. ఇదే తన బలమని నమ్మకంతో చెబుతున్న ఆమె ఇప్పుడు గిరిజనుల భాషలోనే వారితో సంభాషించి వారి సమస్యలను పరిష్కరించగలనని ధీమాగా చెబుతున్నారు. ఇంగ్లీషులో మాట్లాడితే తన భాషను వారు అర్ధం చేసుకోలేరని, నా పాయింట్‌ను వారికి ఎలా కమ్యూనికేట్ చేయగలనని ఆమె భావించింది. ఇప్పటివరకు 30 శాతం గోండు భాషను నేర్చుకున్నానని, త్వరలో భాషపై మరింత పట్టు సాధిస్తానని ఆమె ధీమాగా ఉన్నారు. ఆమె ఈ భాషను నేర్చుకునేందుకు రోజుకు 30 నిమిషాలను కేటాయించినట్లు ఆ జిల్లా వర్గాలు తెలిపాయి. అయితే ఆమె ఈ భాషను నేర్చుకునేందుకు ఆల్ ఇండియా రేడియో స్టేషన్ అనౌన్సర్ దుర్వ భూమన్న సాయం తీసుకొందని తెలిసింది. వాళ్ల భాషను అర్ధం చేసుకోవడం ఇదివరకు కష్టంగా ఉండేదని, ఏమి చెబుతున్నారో అర్ధం కాని స్థితిలో ఆయా సమస్య నివారించడం ఎలాగని భావించిన ఆమె ఇలా వారి భాషను నేర్చుకునేందుకు కృషి చేసి విజయం సాధించింది. దీంతో గోండు ప్రజలు కలెక్టర్‌ను తమలో ఒకరిగా గుర్తించి నమ్మకం, విశ్వాసంతో కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక అందింది. ఈ నెల 14న ఆదిలాబాద్ జిల్లా నర్నూర్ మండలం జమడా గ్రామంలో జరిగిన రాయ్ సెంటర్ సమావేశంలో నేతలతో కలిసి పాఒగన్న ఆమె మూడు నిమిషాలపాటు గోండు భాషలో మాట్లాడి అందరినీ ఆశ్చర్యపర్చారు. ఈ సందర్భంగా వారితో మమేకమైన కలెక్టర్ గోండు మహిళలతో కలిసి భోజనం చేయడం గిరిజన ప్రజల్లో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

జార్ఖండ్ నక్సల్స్ కమాండర్ మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జార్ఖండ్‌లోని చత్తీస్‌గఢ్ బోర్డర్ బుద్ధపహాడ్ అడవుల్లో జార్ఖండ్ టాప్ నక్సల్స్ కమాండర్ అరవింద్‌జీ అలియాస్ దేవ్‌కుమార్ సింగ్ అలియాస్ నిషాంత్(50) గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. నిషాంత్ ఎ కేటగిరీ మోస్ట్ వాంటెడ్ నక్సల్ నాయకుడు. మావో సెంట్రల్ కమిటీ మెంబర్‌గా ఉన్నాడు. ఇతడిపై రూ.1.5 కోట్ల రివార్డు ఉంది. కాగా, గుండెపోటుతో అరవింద్‌జీ మృతి చెందినట్లు జార్ఖండ్, బీహార్ పోలీసులు డిక్లేర్ చేశారు. కాగా, సెక్యూరిటీ ఏజెన్సీస్, పోలీసులు ఇండిపెండెంట్‌గా ధృవీకరించడం లేదు. కాగా, అరవింద్‌జీ బాగా చదువుకున్నవాడని, టెక్నాలజీ ఎక్స్‌పర్ట్ అని చెబుతున్నారు. కాగా, పలు వ్యాధులతో బాధపడుతున్నాడని(డయాబెటీస్‌తో కలిపి) అంటున్నారు.

ప్రమాదాల నివారణలో రాష్ట్రం ముందంజ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రహదారి ప్రమాదాల నివారణలో తెలంగాణ రాష్ట్రం విజయవంతమవుతోంది. 2014 నుంచి 2016 నాటికి రహదారి ప్రమాదాలలో నాలుగు శాతం స్వల్ప తగ్గుదలను నమోదు చేసుకుంది. రహదారి ప్రమాద మృతుల్లో 9 శాతం తగ్గుదల నమోదు చేసుకుంది. ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారిని కాపాడటంలో 10 శాతం మెరుగుదలను నమోదు చేసుకుని జాతీయస్థాయి కంటే ప్రగతిలో ముందజంలో ఉంది. 2016తో పోలిస్తే 2017లో తెలంగాణ రాష్ట్రంలో రహదారుల ప్రమాదాల సంఖ్య తగ్గింది. ఇదే సమయంలో మృతుల సంఖ్య దేశవ్యాప్తంగా మూడు శాతం పెరగగా, తెలంగాణ రాష్ట్రంలో 9 శాతం తగ్గుదల నమోదైంది. 2016 కంటే 2017లో సకాలంలో స్పందించి 617 మంది ప్రాణాలను అధికంగా కాపాడి అధికారులు ముందంజలో నిలిచారు.

రైతాంగం సంతోషం

• రసమయి బాలకిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రైతాంగం సంతోషంగా ఉన్నారని తెరాస సభ్యులు రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. శాసనసభలో వ్యవసాయ పద్దుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. రైతుల్లో ఆత్మస్థైర్యం నెలకొల్పిన ఘనత తెరాస ప్రభుత్వానిదన్నారు. రైతుకు భరోసా ఇవ్వడంతోనే ఉత్పత్తి పెరిగిందన్నారు. పొలాలకు నీరు పారించడంతో పాటుగా విద్యుత్, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందచేసి పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రైతాంగం సంతోషంగా ఉన్నారని వివరించారు.

కేసీఆర్ ప్రధాని కావడం ఖాయం

• టిఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాబోయేరోజుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ దేశానికి ప్రధాని కావడం ఖాయమని టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంపై టిడిపి ఎంపీలు పెట్టిన అవిశ్వాసతీర్మానంపై జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టే సమయంలో కెసిఆర్‌తో టిడిపి ఏమైనా సంప్రదింపులు జరిపిందా అని ఆయన ప్రశ్నించారు. 2014లో చంద్రబాబు బిజెపితో పొత్తు విషయంపై టిఆర్ఎస్‌తో సంప్రదించారా అని ఆయన ప్రశ్నించారు.


రాష్ట్రంలో కమీషన్ల పాలన

- పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావణ్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీఎం చంద్రశేఖర్‌రావు తీరు కూట్లో రాయి తీయలెనోడు ఏట్లో రాయితీయడానికి వెళ్లినట్లుగా ఉందని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రవణ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న అనేక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే సీఎం కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ అంటున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కమీషన్ల కోసం పాలన సాగుతోందని, ప్రజల సంక్షేమం కోసం కాదన్నారు. సిరిసిల్ల మున్సిఫల్ చైర్మన్ పావని ప్రస్తావించిన 2 శాతం కమీషన్‌పై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో ప్రత్యేక విమానంలో కోల్‌కతకు వెళ్లి ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీతో భేటీ కావాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన నిలదీశారు.



మౌలాలి దర్గాకు రూ.25 కోట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మౌలాలి దర్గా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, మొదటి దశలో మెట్లను కలపడం, రోడ్లు, ర్యాంప్ నిర్మాణాన్ని జిహెచ్ఎంసి పూర్తి చేసిందని, రెండవ దశ కింద రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో మౌలాలి దర్గా హిల్‌టాప్‌కు మెట్లను కలిపే పని పురోగతిలో ఉందని ఉప ముఖ్య మంత్రి మహమూద్ అలీ శాసనసభలో చెప్పారు. ఎంఐఎం సభ్యులు పాషాఖాద్రీ, జాఫర్ హుసేన్, బిజెపి సభ్యుడు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మౌలాలి ప్రాంతంలోని పురాతన కమాన్‌ను హెరిటేజ్ కట్టడంగా గుర్తించినందున దాన్ని ఆధునీకరిస్తామని మంత్రి పేర్కొన్నారు. పహాడిషరీఫ్ దర్గాకు ప్రస్తుతమున్న హైవేకు అనుసంధానించడానికి సిసి ర్యాంప్ రోడ్లు, మోటారు ఏబుల్ ట్రాక్, నాలుగు చక్రాల హిల్ టాప్ పార్కింగ్ నిర్మాణం కోసం గతేడాది నవంబర్‌లో రూ. 9.60 కోట్లను జిహెచ్ఎంసి మంజూరు చేయడం జరిగిందన్నారు.

నవజాత శిశు సంరక్షణకు ఏర్పాట్లు



నవజాత శిశు సంరక్షణ కోసం వేర్వేరు ప్రాంతాలలో ప్రత్యేక ఏర్పాట్లను చేయడం జరిగిందని ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. 23 ప్రత్యేక నవజాత శిశు సంరక్షణా యూనిట్లు, 57 నవజాత శిశు సుస్థిరత యూనిట్లు, 562 నవజాత శిశు కేర్ కార్నర్స్, 22 కంగారు మదర్ కేర్ యూనిట్లతో పాటు లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని సభ్యులు రాజేందర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు. హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో సమగ్ర లాక్టేషన్ మేనేజ్‌మెంట్ కేంద్రంతో పాటు వరంగల్, నల్గొండలకు లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లను మంజూరు చేశామని, పనులను ప్రారంభించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పని చేస్తున్న 23 ఎస్ఎన్‌సియులకు అధనంగా 2018 - 19 లో 12 కొత్త ఎస్ఎన్‌సియులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జహీరాబాద్, జగిత్యాల, నిర్మల్,మంచిర్యాల, ఎంజిఎం ఆస్పత్రి వరంగల్, ఆసిఫాబాద్, గద్వాల్, సూర్యాపేట, వనపర్తి, కొత్తగూడెం, జనగాం, మెదక్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలియజేశారు.

'విజయాను మెగా డైరీగా మారుస్తాం'



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో రోజుకు పాల ఉత్పత్తి పరిమాణం 105.68 లీటర్లు కాగా, వినియోగ పరిమాణం 123.73 లీటర్లని పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం శాసనసభకు తెలిపారు. 2017-18 సంవత్సరంలో రాష్ట్రంలో విజయాడైరీ ద్వారా రోజుకు 5.25 లక్షల లీటర్ల పాలను సేకరించామని సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో మౌలిక సదుపాయాలను పటిష్టపరచేందుకు, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చర్యలు తీసుకుంటుందని వివరించారు. విజయా డైరీ సామర్థ్యాన్ని క్రమక్రమంగా పెంచుతున్నామని, ఒకప్పుడు రోజుకు కేవలం 27 వేల లీటర్ల పాల సేకరణ మాత్రమే చేయగా ప్రస్తుతం నాలుగున్నర లక్షల నుంచి అయిదు లక్షల లీటర్ల పాలను సేకరించే స్థాయికి చేరుకుందన్నారు. దీన్ని ఎనిమిది నుంచి 10 లక్షల లీటర్ల స్థాయికి పెంచనున్నామన్నారు.

ఉద్యమ కారుడే సీఎం అయ్యారు...

ఉద్యమకారుడు కె చంద్రశేఖరరావు ముఖ్యమంత్రి అయినందున రాష్ట్రంలో చారిత్రాత్మక పథకాలు చేపడుతున్నారని తలసాని ప్రశంసించారు. గొర్రెలు కాసేవారు, చేపలు పట్టేవారు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందన్నారు. చరిత్రలో ఎన్నడులేని విధంగా రూ. 5 వేల కోట్లతో గొర్రెల పథకాన్ని ప్రారంభించామని, అంతేకాదు వాటికి గ్రాసం ,మందులు సరఫరా చేసే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుందన్నారు. మత్స్యసంపద విషయానికి వస్తే చేపలు పట్టే వారికి చేపలను సరఫరా చేస్తున్నామన్నారు.

మాకు బలం లేకుంటే గౌరవమేలేదా?



బీజేపీని తెరాస గౌరవించడం లేదని శాససభ్యుడు చింతల రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో తెరాసకు బలం ఉంది, పార్లమెంటులో భాజపాకి బలం ఉంది, అక్కడ తెరాసకు బలం లేకున్నా గౌరవిస్తున్నాం, ఇక్కక మాత్రం మీరు మమ్మల్ని గౌరవించడం లేదు అని అన్నారు. శాసనసభలో బుధవారం వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, మత్స్య, పౌరసరఫరాల పద్దులపై రామచంద్రారెడ్డి చర్చను ప్రారంభించారు. వివిధ అంశాలపై కేంద్రం తీసుకుంటున్న చర్యలతో పోల్చుకుంటూ రామచంద్రారెడ్డి వివరిస్తుండటంతో అధికార పక్షం సభ్యులు తమ స్థానాల్లో కూర్చొని విమర్శలు సంధించారు.

నిర్లక్ష్యానికి గురౌతున్న రైతాంగం

తెరాస ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్రమైన నిర్లక్ష్యానికి గురి చేస్తున్నదని భాజపా సభ్యులు చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. అకాల వర్షాలు, నఖిలీ విత్తనాలు, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం చితికిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు పంట సహాయం పైన ప్రభుత్వం నుండి స్పష్టత లోపించిందన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించలేక పోతున్నామని అన్నారు. ఇప్పటికే 3800 మంది రైతుల ఆత్మహత్య చేసుకున్నట్టుగా నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ప్రకటించిందన్నారు.

నాలుగు జిల్లాల్లో రుణమాఫీ పెండింగ్

● సున్నం రాజయ్య

నాలుగు జిల్లాల్లో ఇంకా రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాలేదని, ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య కోరారు. నకిలీ విత్తనాల వ్యాపారుల చెలరేగుతున్నారని, గద్వాలలో నకిలీ విత్తనాల వల్ల రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, 20వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. స్వామినాథన్, జయతీ ఘోష్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కోయ, లంబాడ, గోండు, ఎరుకలి రైతులకు కూడా గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

నకిలీలపై పీడీ చట్టం నమోదు చేయాలి




నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలని టీడీపీ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సూచించారు. బుధవారం శాసనసభలో వ్యవసాయం,సహకారం, పశుసంవర్ధక, మత్య, పౌరసరఫరాల పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ రంగాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. అయితే, పసుపు, చెరుకు, మొక్కజొన్న,ఉల్లిగడ్డలకు మద్దతు ధర రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. రసాయనికి ఎరువులు లేకుండా సేంద్రీయ ఎరువుల ద్వారానే పంటలు పండించడాన్ని ప్రోత్సహించాలని కోరారు. మత్స్యకారులకు మేలు రకపు చేపలను పంపిణీ చేయాలన్నారు. గొర్రెలపంపిణీ పథకం బాగుందని, అదే విధంగా ఆవులు, బర్రెలు కూడా సబ్సిడీపై సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు.

తెలంగాణ మరో కోనసీమ

రీ ఇంజనీరింగ్ వల్లే కాళేశ్వరానికి అనుమతులు

- వరంగల్‌కు కాళేశ్వరం తొలి ఫలితం ● ఎస్ఆర్ఎస్‌పీ కింద పూర్తి ఆయకట్టుకు నీరు
- జాతీయ హోదాకు జీజేపీ నేతలు సహకరించాలి ● అసెంబ్లీ ప్రశ్నోత్తరాలలో మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ సోయితోనే తమ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను రీ డిజైన్, రీ ఇంజనీరింగ్ చేసిందని మంత్రి హరీష్‌రావు తెలియ జేశారు. భవిష్యత్‌లో దేశానికి అన్నం పెట్టే భాండాగారంగా తెలంగాణ మారబోతోందని బుధవారం శాసనసభలో బిజెపి సభ్యులు జి. కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, టిఆర్ఎస్ సభ్యులు గొంగిడి సునిత, ఎర్రబెల్లి జయాకర్‌రావు, కల్వకుంటల విద్యాసాగర్‌రావు, రసమయి బాలకిషన్ తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానంగా తెలిపారు. ప్రాజెక్టులను నిర్మించడంలోనే తెలంగాణ రాష్ట్రం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ప్రతి నియోజకవర్గానికి సాగునీరివ్వాలనే ఉద్దేశ్యంతో ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ది కోసం అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి ప్రజాకాంక్షలు ముఖ్యమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 37 లక్షల 9 వేల ఎకరాలకు సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు, తాగునీటిని అందిస్తామన్నారు. త్వరలోనే తెలంగాణ కోనసీమగా మారనుందన్నారు. తమకు రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని తేల్చి చెప్పారు. వందేళ్ళ తర్వాత కూడా కెసిఆర్‌ను, టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుర్తుపెట్టుకునే విధంగా సాగునీటి రంగంలో పనులు సాగుతున్నాయన్నారు. కాళేశ్వరం లింక్ 1 లో మూడు బ్యారేజీలు, మూడు పంప్ హౌజ్‌లను అతి తక్కువ వ్యవధి 20 నెలల్లోనే పూర్తి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా సాధిస్తామని, ప్రతి నీటి చుక్క వృధా పోకుండా వాడుకోవాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు మన వాదనలను బలంగా వినిపిస్తున్నామన్నారు. తెలంగాణకు ఆకుపచ్చ తెలంగాణగా, కోటి ఎకరాల మాగాణిగా మార్చడం సిఎం కెసిఆర్ సంకల్పమ న్నారు. ప్రాజెక్టులకు డిపిఆర్ లేదన్న ప్రచారం వాస్తవం కాదని, ప్రతి ప్రాజెక్టుకు డిపిఆర్ ఉందని, అవన్నీ కేంద్ర జలవనరుల శాఖ వద్ద ఉన్నాయన్నారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం వరుస బ్యారేజీలు నిర్మిస్తున్నామని, తుపాకుల గూడెం నుంచి శ్రీరాంసాగర్ వరకు 270 కిలోమీటర్ల మేరకు గోదావరినది ఏడాది పొడుగునా సజీవంగా ఉంటుంద న్నారు. ఫలితంగా మత్స్య పరిశ్రమ, టూరిజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రాణహిత - చేవెళ్ళపథకం కింద 16 లక్షల ఎకరాలకే గత ప్రభుత్వం ప్రతిపాదించిందని, రీ డిజైన్, రీ ఇంజనీరింగ్ అనంతరం 37 లక్షల ఎకరాలకు సాగునీరు లభించనుందన్నారు.

భక్త రామదాసు ప్రాజెక్టు రికార్డు

రికార్డు సమయంలో 10 నెలల్లో భక్త రామదాసు ప్రాజెక్టును తమ ప్రభుత్వం నిర్మించిందని, 2001లో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టు 2014 నాటికి అసంపూర్తిగానే మిగిలిపోయిందన్నారు. భూపాలపల్లి జిల్లాలోని రామప్ప చారిత్రాత్మక దేవాలయానికి ప్రమాదం కలుగకుండా పైప్డ్ ఇరిగేషన్ విధానంతో పనులు చేపట్టామన్నారు. ములుగు, భూపాలపల్లి, నర్సంపేట, నియోజకవర్గాలలో గ్యాప్ ఆయకట్టుకు నీరందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలోనూ జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాలకు రాష్ట్రంలో కొత్తగా ఏ ప్రాజెక్టులను చేపట్టలేదని, నీటి లభ్యత ఆధారంగానే ఐదు ప్రాజెక్టులకు రీ డిజైనింగ్ చేశామని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాజెక్టు కట్టకపోతే తెలంగాణ ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేసినట్లవుతుందని, దీన్ని పూర్తి చేస్తేనే భవిష్యత్ తరాలకు న్యాయం చేసిన వారమవుతామన్నారు. ఈ ప్రాజెక్టును కడితేనే కృష్ణా జలాల కేటాయింపుల్లో న్యాయం జరుగుతుందన్నారు. అందుకే ఈ ప్రాజెక్టు విషయంలో జాగ్రత్త వహించి రీ డిజైనింగ్ చేశామన్నారు. 20 గిరిజన గ్రామాలు ముంపునకు గురికాకుండా కేవలం 250 ఎకరాలు మునిగే విధంగా రీ డిజైన్ చేసినట్లు తెలిపారు. తుపాకులగూడెం వద్ద కాపర్ డ్యాం ఏర్పాటు చేసి చెరువులకు నీరిస్తున్నామన్నారు. దుమ్ముగూడెం వద్ద నీటి లభ్యత అధికంగా ఉన్నందున ఖమ్మం జిల్లా వాసులకు నీరందించేందుకు దుమ్ముగూడెం ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ చేయడం జరిగిందన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ గురించి వస్తున్న విమర్శలను మంత్రి కొట్టి పారేశారు. నీటి లభ్యత, నదులు లేనిచోట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కండలేరు, గోరకల్లు, వెలుగోడు, అవుకు తదితర ప్రాజెక్టులు నిర్మించిన విషయాన్ని హరీష్‌రావు గుర్తు చేశారు.

జాతీయ హోదాకు సహకరించాలి


తమ ప్రభుత్వం శ్రీరాంసాగర్ ఆధునీకరణకు వేయి కోట్లను కేటాయించి పనులను చేపట్టామని, రెండవ దశ కింద చేపట్టిన పనుల వల్ల పాలకుర్తి నియోజకవర్గంలో రైతులకు సాగునీరు లభిస్తుందన్నారు. పాలకుర్తికి దేవాదుల నుంచి కూడా నీరు వస్తుందన్నారు. కాళేశ్వరం జాతీయ హోదా కోసం తెలంగాణ బిజెపి నేతలు సహకరించాలని మంత్రి హరీష్‌రావు కోరారు. విభజన సమయంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పట్ల వివక్షను చూపించిందని, పోలవరంకు జాతీయ హోదా ఇచ్చినపుడు కాళేశ్వరం కూడా ఇవ్వాలని విభజన బిల్లులోనే ప్రతిపాదిస్తే బాగుండేదని మంత్రి పేర్కొన్నారు. కంతనపల్లి ప్రాజెక్టుకు 2007లోనే శంకుస్థాపన చేసినా తట్టెడు మన్ను తీయలేదని విమర్శించారు. రీ డిజైన్ చేసిన ప్రాజెక్టులలో ఖమ్మం జిల్లాకు చెందిన సీతారామ, భక్తరామదాసు ప్రాజెక్టులు కూడా ఉన్నాయని, మంత్రి తెలిపారు.

రీడిజైన్‌తోనే అనుమతులు

ఆయకట్టు పెంచడం, రిజర్వాయర్లను పెంచడం వల్ల వ్యయం పెరిగిందని వివరించారు. ప్రాణహిత - చేవెళ్ళ పథకంలో 11 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్లు ప్రతిపాదించగా 147 టిఎంసిలకు వాటి సామర్థ్యాన్ని కెసిఆర్ పెంచారని మంత్రి హరీష్‌రావు వివరించారు. గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలను నిర్మించి ఎత్తిపోతల ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గంధమల్ల రిజర్వాయర్లను నిర్మించి తెలంగాణలోని అత్యంత కరువు పీడిత ప్రాంతాలలోని సుమారు 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రీ డిజైనింగ్ చేశారన్నారు. రీడిజైనింగ్, రీ ఇంజనీరింగ్ చేయడం వల్లే కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. పూర్వపు వరంగల్ జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలకు సాగునీటిని ఇవ్వనున్నట్లు చెప్పారు. కాళేశ్వరం నుంచిమిడ్‌మానేర్, లోయర్ మానేరు డ్యాం, మీదుగా హుజూరాబాద్, పరకాల, మహబూబాబాద్ నియోజకవర్గాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. లోయర్ మానేరు డ్యాం దిగువ ప్రాంతాల్లో ముఖ్యంగా భూపాలపల్లి సెగ్మెంట్‌లో 80 వేల ఎకరాలు సాగులోకి రానుందన్నారు.

అర్హులందరికి రేషన్

ఏప్రిల్ ఆఖరు నాటికి కొత్త కార్డుల పంపిణి: మంత్రి ఈటల



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే ఏప్రిల్ నెల ఆఖరు వరకు రాష్ట్రంలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. బుధవారం శాసనసభలో పౌరసరఫరాల పద్దుపై జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు.ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, కొత్తగా ముద్రించబోయే కార్డులపై రాష్ట్ర లోగోతో పాటు కేంద్ర ప్రభుత్వం లోగో కూడా ఉంటుందని చెప్పారు. కొత్తగా 77 వేల మంది రేషన్ కార్డులు తీసుకునేందుకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. పౌరసరఫరాల శాఖలో అక్రమాలను అరికట్టేందుకు కొత్తగా ఈ - పాస్ విధానాన్ని ప్రవేశపెట్టామని, దీనివల్ల 95 శాతం అక్రమాలను అరికట్టగలిగామన్నారు. మొదట హైదరాబాద్‌లో ఆ తర్వాత రాష్ట్రమంతా విస్తరించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1,03.00.000 కుటుంబాలు ఉండగా, 85 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. పోర్టబుల్ విధానం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకునే విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. గ్రామాలలో కార్డులున్నవారు హైదరాబాద్‌లో కూడా రేషన్ దుకాణాలకు వెళ్లి సరకులు తీసుకోవచ్చని తెలిపారు. ఆదాయ పరిమితిని కూడా గ్రామాలలో రూ. 1,50,000కి, పట్టణ ప్రాంతాలలో రూ.2,00,000 ఆదాయం ఉన్న వారికి రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఈ పాస్ సరిగా పని చేయటం లేదనే విపక్ష సభ్యులు చేసిన సూచనలకు స్పందిస్తూ, ఐరిష్ లింకప్ చేసే విషయం కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గతంలో 9 సరకులు పంపిణీ జరిగేవని, ప్రస్తుతం బియ్యం మాత్రమే సరఫరా జరుగుతోందన్న విమర్శలకు మంత్రి స్పందించారు. ప్రస్తుతం బియ్యం, గోధుమలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చింతపండు, కారం, పసుపు చౌకధరల దుకాణాలలో ఎవరు కూడా కొనుగోలు చేయడం లేదని అందుకే నిలిపివేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో అందరికీ దీపం కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించామని అందుకే కిరోసిన్ సరఫరా జరగటం లేదని పేర్కొన్నారు. చక్కెర అయితే,కేంద్రమే నిలుపుదల చేసిందని ఈటల వివరించారు. పౌరసరఫరాల శాఖను పటిష్టం చేసేందుకు విజిలెన్స్ టీంలను ఏర్పాటుచేశామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు రూ. 650 కోట్లతో తెల్లబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రేషన్ డీలర్లకు క్వింటాల్‌కు 75 పైసలు చెల్లించాలని అనుకుంటున్నామని ఈటల వెల్లడించారు.

కార్డులపై కేంద్రం లోగో పెట్టాలి - కిషన్ రెడ్డి

అంతకు ముందు పౌరసరఫరాల పద్దుపై బీజేపీ పక్ష నాయకుడు జి కిషన్ రెడ్డి మాట్లాడారు. రేషన్ కార్డులపై కేంద్రం లోగోను పెట్టాలని సూచించారు. 1,91,696 టన్నుల బియ్యాన్ని ఆహారభద్రత పథకం ద్వారా రాష్ట్రా నికి కేంద్రం సరఫరా చేస్తోందని తెలిపారు. టీడీపీ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య కూడా పౌరసరఫరాల పద్దుపై మాట్లాడారు.

వ్యవసాయం, పశుసంవర్ధక, పౌరసరఫరాల

పద్దులకు శాసనసభ ఆమోదం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వ్యవసాయ సహకార , పశుసంవర్ధక ,మత్స్య, పౌరసరఫరాల శాఖలకు సంబంధించి 2018-19 వార్షిక పద్దులను బుధవారం శాసనసభ ఆమోదించింది. వ్యవసాయ పద్దుకు సంబంధించి రూ. 12734,07,20,000 కోట్లు, సహకార పద్దుకు సంబంధించి రూ. 111, 36,19,000 కోట్ల పద్దును సభ ఆమోదించింది. అదే విధంగా పశుసంవర్థక,మత్స్యశాఖకు సంబంధించి రూ.1126,73,07,000కోట్ల పద్దును పౌరసరఫరాలకు సంబంధించి రూ. 1920.98,88,000 కోట్ల ప్రతిపాదనను సభ ఆమోదించింది. సంబంధిత మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, ఈటల రాజేందర్ పద్దులను ప్రతిపాదించారు.

పేదల కార్డులు ఏరివేయొద్దు

● మజ్లీస్ ఎమ్మెల్యే పాషాఖాద్రి



అర్హులైన వారందరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వాలని మజ్లీస్ సభ్యులు పాషాఖాద్రి ప్రభుత్వాన్ని కోరారు. చిన్నచిన్న కారణాలతో పేదల కార్డులు ఏరివేయడం సహేతుకం కాదన్నారు. బియ్యంతో పాటుగా ఇతర నిత్యావసరాలను అందించాలని, ఈ-పాస్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రైతాంగానికి ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటుగా, పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొనవలసి ఉందన్నారు.

ఉద్యోగుల సంక్షేమ నిధికి రూ.1.26 కోట్లు

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంక్షేమ నిధి కార్పస్ ఫండ్ వడ్డీకి గానూ రూ. 1,26,16,000 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.2017 -18 కి సంబంధించి ఈ మొత్తాన్ని విడుదల చేశారు.

కేసీఆర్ సీఎం కావడం అదృష్టం


రైతుల డిపాజిట్ల కోసం బ్యాంకులు క్యూ కట్టే రోజులు రానున్నాయి: మంత్రి పోచారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా కె. చంద్రశేఖర రావు ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమనీ, ఆయన మంత్రి వర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా కొనసాగటం తన అదృష్టమని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వ్యవసాయం, సహకార పద్దులపై జరిగిన చర్చకు మంత్రి పోచారం సమాధానమిచ్చారు. గతంలో రాముడు, నైజాం కాలంలో రైతుల నుంచి శిస్తు వసూలు చేసేవారని, నిజాం హయాంలో పన్నుల వసూలుకు అధికారులు వస్తే రైతులు పారిపోయేవారని అలాంటి పరిస్థితి నుంచి ఏకంగా రైతులకే పంటల రాయితీ ఇవ్వడం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు పంటలు వేసేందుకు ఏడాదికి రెండు పంటలకై రూ. 8 వేలు ఇవ్వడం దేశంలోనే గాక ప్రపంచంలో ఎక్కడ కూడా రైతులకు పెట్టుబడులు ఇచ్చే పథకం లేదన్నారు. ఈ పథకంద్వారా 72,13,111 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, బడ్జెట్‌లో రూ. 12 వేలు ప్రతిపాదించినట్లు తెలిపారు. వానాకాలం పంటకు ఏప్రిల్ 20 నుంచి మే నెలాఖరు వరకు, యాసంగి పంటకు నవంబర్ 20 నుండి చెక్కులు పంపిణీ చేస్తామని, అవి కూడా ఆర్డర్లీ చెక్కులని వెల్లడించారు. వివాదం లేని 96 శాతం పట్టాదారులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నామని, వివాదంలో ఉన్న వాటికి సంబంధించిన నిధులు బ్యాంకులో జమవుతాయన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి రాయితీ ఇచ్చే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. చెక్కుల పంపిణి మే, జూన్ నెలల్లో చేపడతామన్నారు. రాయితీతో పాటు 24గంటల ఉచిత విద్యుత్, రూ. 5 లక్షలు బీమా తదితర సౌకర్యాలు కూడా రైతులకు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించడం లేదని బీజేపీ పక్ష నాయకుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించడాన్ని మంత్రి పోచారం తప్పుబట్టారు. ప్రభుత్వం తన వంతుగా బీమా ప్రీమియం చెల్లించాలని రైతులను కోరుతూనే ఉన్నామని, ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదనటం సరికాదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, ఇతర సమస్యల పరిష్కారానికై రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేశామని, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశామని, 759మండలాల్లో 1,61,000 మంది సభ్యులు ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. రైతులు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా రైతు వేదికలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ లేదా మరో అధికారైనా కాని, ముందుగా రైతులతో సమావేశాలు కావాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించడమనేది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశమైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కూడా మద్దతు ధర అందేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. పాలీహౌస్‌ల ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 80శాతం రాయితీలు ఇస్తున్నామని పోచారం పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో రుణాలు రీ షెడ్యూల్ కాలేదని వచ్చిన ఆరోపణలకు మంత్రి స్పందిస్తూ ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బ్యాంకులు సైతం రైతుల డిపాజిట్లకై క్యూ కట్టే రోజులు రానున్నాయని మంత్రి చెప్పారు. అంతకు ముందు బీజేపీ పక్షనాయకుడు జి.కిషన్ రెడ్డి, సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య, టీడీపీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య వ్యవసాయ పద్దుపై జరిగిన చర్చలో పాల్గొన్నారు.

వానలు బాగా పడతాయని కేసీఆర్ అప్రమత్తం చేశారు

ఒకరోజు తాను జగిత్యాలలో ఉండగా సీఎం కె చంద్రశేఖరరావు ఫోన్ చేసి వార్తలు చూశావా అని అడిగారని, చూశాను వచ్చే వర్షాకాలం సీజన్‌లో వానలు బాగా పడతాయని వాతావరణ శాస్త్రజ్ఞులు చెప్పారన్న విషయాన్ని సీఎంకు చెప్పానని తెలిపారు. తాను కూడా అదే విషయం చెప్పదల్చుకున్నానని, జూన్ నుంచి మొదలయ్యే వానాకాలం పంటలకు విత్తనాలు, ఎరువుల కొరత ఉండకుండా చూడాలని సూచించారని పోచారం తెలిపారు. జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి నుంచే ఆయన ముందు చూపుతో అప్రమత్తం చేశారని అన్నారు.



బీఎస్పీకి 'షా'క్!



- ఎత్తుకు పైఎత్తు వేసిన అమిత్ షా
- అఖిలేష్‌తో భేటీకి ఏడుగురు ఎమ్మెల్యేలు డుమ్మ
- 24 గంటల్లో పరిస్థితులు తారుమారు
- యూపీలో రాజ్యసభ పోరు రసవత్తరం
- మాయావతి వర్గంలో ఆందోళన



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇటీవల లోక్‌సభ ఉప ఎన్నికల్లో తమను ఖంగుతినిపించిన ఎస్పీ-బీఎస్పీ కూటమిని దెబ్బకు దెబ్బ తీసేందుకు బీజేపీ పావులు కదిపింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నేరుగా రంగంలోకి దిగడంతో సమీకరణలు వేగంగా మారుతున్నాయి. గతేడాది గుజరాత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌ను ఓడించడంలో విఫలమైన అమిత్‌షా ఈసారి పక్కా వ్యూహంతో అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. తమ అభ్యర్థి గెలుపునకు అవసరమైన సంఖ్యా బలాన్ని కూడగట్టేందుకు విపక్ష కూటమి ఎమ్మెల్యేలకు గాలం వేసినట్లు తెలుస్తోంది. బుధవారం పార్టీ ఎమ్మెల్యేలతో అఖిలేశ్ నిర్వహించిన సమావేశానికి ఏడుగురు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయింది. దీనివెనుక వెనుక అమిత్ షా హస్తం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

తాజా పరిణామాలు మాయావతి పార్టీకి చెమటలు పట్టిస్తున్నాయి. బీఎస్పీ అభ్యర్థి తేలిగ్గా నెగ్గాల్సిన చోట బీజేపీ ఎత్తులతో కష్టకాలం వచ్చిపడింది.

- రాజ్యసభలో యూపీకీ 31 స్థానాలు ఉన్నాయి. ఇందులో 10 స్థానాలకు ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి తొమ్మిది మంది, బీఎస్పీ,ఎస్పీ పార్టీల నుంచి ఒక్కొక్కరు బరిలో నిలిచారు.
- రాజ్యసభ అభ్యర్థిగా విజయం సాధించాలంటే 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాగా, బీజేపీకి 312 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ఫూల్‌పూర్ ఎమ్మెల్యే ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఆ పార్టీ సంఖ్యా బలం 311కి పరిమితం అయింది. అంటే ఆ పార్టీ నుంచి 8 మంది అభ్యర్థుల విజయం ఖాయం. తొమ్మిదో అభ్యర్థిని రంగంలోకి దించడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

యూపీ అసెంబ్లీలో బలాబలాలు	
బీజేపీ	311
బీఎస్పీ	19
ఎస్పీ	47
కాంగ్రెస్	7
అప్నాదళ్	9
ఎస్‌బీఎస్‌పీ	4
స్వతంత్రులు	3
ఆర్ఎల్‌డీ	1
నిషాద్ పార్టీ	1
మొత్తం	402

అంబేద్కర్ వర్సెస్ అగర్వాల్

కొద్దిమాసాల కిందట రాజ్యసభ స్థానానికి అర్ధాంతరంగా రాజీనామా చేసిన మాయావతి ఈ ఎన్నికల్లో తిరిగి పోటీచేస్తుందని బీఎస్పీ వర్గాలు భావించాయి. కానీ, అనూహ్యంగా ఆమె దళిత నేతను పోటీకి నిలబెట్టింది. మాజీ ఎమ్మెల్యే భీమ్‌రావ్ అంబేద్కర్‌తో నామినేషన్ వేయించింది. అటు బీజేపీ వ్యూహాత్మకంగా అగ్రవర్ణం నాయకుడు, పారిశ్రామికవేత్త, సమాజ్‌వాది ఎమ్మెల్యే అనిల్ అగర్వాల్‌ని తమ పార్టీ తరఫున రంగంలోకి దించింది. తద్వారా మాయావతి సంఖ్యాబలాన్ని తగ్గించాలని వ్యూహం పన్నింది. ఈ పరిణామంతో అటు ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల నాటికి ఇంకెందరికి బీజేపీ వలవేస్తుందోనన్న బెంగ మొదలైంది. సమాజ్‌వాది అంతర్గత కలహాలను కమలనాథులు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉందన్న చర్చ వినిపిస్తోంది.





- సమాజ్‌వాదిపార్టీ సంఖ్యాబలం 47. వారి అభ్యర్థికి సరిపోను అదనంగా 10 ఓట్లున్నాయి. తమ పార్టీ తరఫున జయాబచ్చన్‌కు మరోసారి అవకాశం కల్పించారు.
- బీఎస్పీకి 19 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరికి ఎస్పీ నుంచి 10 మంది, కాంగ్రెస్‌కి చెందిన ఏడుగు రు ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నారు. అజిత్‌సింగ్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే కూడా మాయావతికి మద్దతు ప్రకటించారు. దీంతో బీఎస్పీ అభ్యర్థి విజయానికి లైన్‌క్లియర్ అయినట్లే.
- సరిగ్గా ఇక్కడే బీజేపీ దూకుడు ప్రదర్శించింది. సంఖ్యాబలం లేకున్నప్పటికీ తొమ్మిదో అభ్యర్థిని పోటీలో నిలబెట్టింది. ప్రత్యర్థుల మద్దతుదారుల్లో చీలిక తెచ్చేవ్యూహం పన్నింది. తొమ్మిదో అభ్యర్థికి మిత్రపక్షం అప్నాదళ్, ఎస్‌బీఎస్‌పీ సభ్యులతో కలిపి ప్రస్తుతం 28 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉంది. విజయానికి మరో 9మంది అవసరం. నిషాద్ పార్టీ ఎమ్మెల్యే మద్దతు లభిస్తుందన్న నమ్మకంతో ఉంది. అంతిమంగా విజయానికి ఏడుగురు ఎమ్మెల్యేలు అవసరం.

అమిత్ షా తంత్రమేనా?

లక్నోలో పార్టీ ఎమ్మెల్యేలతో అఖిలేశ్ యాదవ్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఏడుగురు సభ్యులు గైర్హాజరు అయ్యారు. ఇందులో శివ్‌పాల్ యాదవ్‌తోపాటు, కొద్దిరోజుల కిందట బీజేపీ గూటికి చేరి రాజ్యసభ అభ్యర్థిత్వం పొందిన నరేశ్ అగర్వాల్ కుమారుడు కూడా ఉన్నారు. 47మంది ఎస్పీ ఎమ్మెల్యేల్లో శివ్‌పాల్ వర్గానికి చెందిన వారు ఏడుగురున్నారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో వీళ్లు పార్టీకి వ్యతిరేకంగా కోవింద్‌కు ఓటేశారన్న సందేహం ఉంది. ఇప్పుడు అదేమాదిరి క్రాస్‌ఓటింగ్ జరుగుతుందేమోనన్న భయం ఎస్పీ-బీఎస్పీ కూటమిని వెంటాడుతోంది. బీజేపీ తొమ్మిదో అభ్యర్థివిజయానికి కూడా సరిగ్గా ఏడుగురి మద్దతు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిణామం ఆసక్తిగా మారింది. వీళ్లంతా బీజేపీకి మద్దతిస్తారా? అన్న సందేహం వ్యక్తం అవుతోంది. అయితే సమాజ్‌వాదీ వర్గాలు మాత్రం చీలిక ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నాయి. 'ఒక సభ్యుడు జైలులో ఉన్నాడు. అజంఖాన్, అజంఖాన్ అతని కుమారుడు సమావేశానికి రాలేదు. వారిద్దరు పార్టీ వెంటే ఉంటారు. అదేమాదిరి శివపాల్ యాదవ్, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు అఖిలేష్‌తో టచ్‌లోనే ఉన్నారు' అని ఎస్పీ సీనియర్ నాయకుడొకరు వెల్లడించారు.

ఓడినా బీఎస్పీదే పైచేయి..

ఒకవేళ బీజేపీ కుయుక్తులు ఫలించి, తొమ్మిదో అభ్యర్థి గెలిస్తే కమలనాథులపై ఎదురుదాడి చేసేందుకు మాయవతికి అవకాశం లభిస్తుంది. దళితుల అణచివేత నినాదంతో ఆమె అధికార పార్టీపై ధ్వజమెత్తుతుంది. ఒకవేళ బీఎస్పీ విజయం సాధిస్తే 2019లో దూకుడు పెంచేందుకు వీలవుతుంది. ఎస్పీ-బీఎస్పీ కూటమి వ్యూహం ముమ్ముందు బీజేపీ ముందరి కాళ్లకు బంధాలు వేసినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 83 స్థానాలకు గాను 73 ఎంపీ స్థానాలను కలిగివున్న బీజేపీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 50 సీట్లు తగ్గుతాయన్న సర్వే అంచానాలు మాయావతికి సానుకూల అంశం.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



తిరుమల, ప్రభ న్యూస్: ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఆనందం, సుఖసంతోషాలు, మెరుగైన జీవన ప్రమాణాలు ప్రసాదించాలని కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చెప్పారు. ముఖ్యమంత్రి తమ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తనకు శక్తి ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

తిరునామం ధరించి సామాన్య భక్తుని వలె..

ముందుగా వైకుంఠం క్యూ కాంప్లెక్సులోనికి ప్రవేశించిన ముఖ్యమంత్రి, కుటుంబ సభ్యులను శ్రీవారి సేవకులు భక్తిభావంతో గోవింద -- గోవింద అని సంభోదిస్తూ తిరునామం చేశారు. ఈ సందర్భంగా తిరుమల జేఈవో శ్రీనివాసరాజు భక్తులకు తిరుమలలోని ప్రధాన ప్రాంతాలలో శ్రీవారి సేవకులతో తిరునామధారణ నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. శ్రీవారి సేవకులతో తిరునామధారణ నిర్వహించడం చాలా బాగుందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. అనంతరం ముఖ్యమంత్రి ఆలయంలోకి ప్రవేశించారు. మహాద్వారం వద్దకు చేరుకోగానే టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్ సాదరంగా ఆహ్వానించగా, ఆలయ అర్చకులు కలసి సంప్రదాయబద్ధంగా ఇస్తికపాల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద నమస్కరించిన అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వకుళామాతను, ఆలయ ప్రదక్షిణగా వచ్చి విమాన వేంకటేశ్వరస్వామి, సబేరా, భాష్యకార్ల సన్నిధి, యోగనరసింహస్వామివారిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. తమ మనవడు దేవాన్ష్ 4 వ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చు 26 లక్షల రూపాయలను ఆన్‌లైన్‌లో విరాళంగా అందించారు.

హెచ్-1బి వీసా ఆశావహులకు శుభవార్త



వాషింగ్టన్: అమెరికా హెచ్-1బి వీసా దరఖాస్తులను ఏప్రిల్ రెండవ తేదీ నుంచి ఆమోదించడం ప్రారంభిస్తుందని యుఎస్ పౌరసత్వం మరియు వలస సేవలు(యుఎస్‌సిఐసి) ఫెడరల్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. అయితే ఫిస్కల్ క్యాప్‌కు లోబడి అలాంటి వర్క్ వీసాల ప్రీమియమ్ ప్రాసెసింగ్‌కు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు యుఎస్‌సిఐసి వెల్లడించింది. 2018, అక్టోబర్‌తో ప్రారంభమయ్యే 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బి పిటిషన్ ఫైలింగ్ ఉంటుంది. ప్రీమియమ్ ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో హెచ్-1బి యావత్ ప్రాసెసింగ్ సమయం తగ్గుతుందని యుఎస్‌సిఐసి పేర్కొంది. అదే సమయంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పిటిషన్లను తాను ప్రాసెసింగ్ చేయగలుగుతానని తెలిపింది. కాంగ్రెస్ విధించిన నియమ, నిబంధనల ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరం 65,000 వీసాలను మాత్రమే మంజూరు చేయాల్సి ఉంటుంది. యుఎస్‌సిఐసి ప్రకారం 2007 నుంచి 2017 మధ్య కాలంలో అది భారతీయుల నుంచి 22 లక్షల హెచ్-1బి వీసా దరఖాస్తులను స్వీకరించింది. అదే కాలవ్యవధిలో చైనా నుంచి 3,01,000 దరఖాస్తులను స్వీకరించింది.

జైలు పక్షులతో చెట్టపట్టాల్..

- ఇదేనా అవినీతిపై మీ పోరాటం
- కర్నాటక ర్యాలీలో ప్రధానిపై రాహుల్ విమర్శలు
- చిక్‌మంగళూరు మేలు మరవబోనని వ్యాఖ్య

బెంగళూరు: అవినీతి రహిత పాలన అందిస్తానని గొప్పలు చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అవినీతి పరులతో కలిసి వేదిక పంచుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జైలుకెళ్లి వచ్చిన వారిని కర్నాటకకు ముఖ్యమంత్రిని చేయాలని చూస్తున్నారు అంటూ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బీజేపీపై నిప్పులు చెరిగారు. యడ్యూరప్ప పేరును ప్రస్తావించకుండానే ఆయన ఎదురుదాడికి దిగారు. కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఇక్కడ పర్యటించిన ఆయన బహిరంగ ర్యాలీలో ప్రసంగించారు. చిక్‌మగళూర్‌తో కాంగ్రెస్ అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, ఎమర్జెన్సీ అనంతరం ఉపఎన్నికలో తన నానమ్మ ఇందిరను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకుని, లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించిన ఘటనను ప్రస్తావించారు. ఈ ప్రాంత ప్రజలకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. '1978 ఉప ఎన్నికల్లో మీరు నానమ్మను గెలిపించారు. తిరిగి ఆమెను పార్లమెంటులోకి అడుగుపెట్టేలా చేశారు. అత్యవసర సమయాల్లో ఆమెకు మీరు అందించిన మద్దతు కాంగ్రెస్ మరచిపోదు. నేను కూడా ఎప్పటికీ మరువను. నా అవసరం ఎప్పుడొచ్చినా మీకు అందుబాటులో ఉంటాను' అని రాహుల్ హామీ ఇచ్చారు. మన సరిహద్దుల వెంబడి చైనా రోడ్లు, హెలిప్యాడ్లు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నా మోడీ ఏమీ పట్టనట్లు మౌనం వహించారంటూ విమర్శించారు. మతం అంటే నిజం-సత్యమేవ జయతే అని శృంగేరి పీఠం విద్యార్థి ఒకరు చెప్పిన విషయాన్ని రాహుల్ ప్రస్తావిస్తూ, మతం గురించి విద్యార్థికి తెలిసిన మాత్రం కూడా ప్రధాని మోడీకి తెలియకపోవడం బాధాకరమన్నారు.



సంకుల సమరం

- కర్నాటకలో వేడెక్కిన రిజర్వేషన్ రాజకీయాలు
- లింగాయత్, వీరవైశులను ఆకర్షించేందుకు కాంగ్రెస్ యత్నం
- తెరపైకి ప్రత్యేక రిజర్వేషన్లు
- కాంగ్రెస్ చర్యలను తప్పుబడుతున్న బీజేపీ, జేడీఎస్
- గతంలో వద్దని... ఇప్పుడెందుకనీ ప్రశ్న

బెంగళూరు: కర్నాటక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారం కోసం కాంగ్రెస్,బీజేపీలు పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారు. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వీరశైవ, లింగాయత్ మతస్తుల ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు రిజర్వేషన్ మంత్రాన్ని జపిస్తోంది. ఇప్పటికే రిజర్వేషన్లపై ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపి కేంద్రానికి పంపింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీయే లక్ష్యంగా బీజేపీ జేడీఎస్ విమర్శలు గుప్పించాయి. గతంలో లింగాయత్‌లకు రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓటు బ్యాంక్ కోసం జిమ్మిక్కులు చేస్తోందని మండిపడ్డారు.

కాంగ్రెస్‌వన్నీ జిమ్మిక్కులే: యడ్యూరప్ప

కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిద్ధరామయ్య సర్కారు ఓటర్లను ఆకర్షించేందుకు జిమ్మిక్కులు చేస్తోందని ఆరోపించారు. వీరశైవ-లింగాయత్ వర్గీయులు ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు కర్నాటక ప్రభుత్వం ఆయా వర్గాల ప్రజలకు రిజర్వేషన్ల ప్రతిపాదన చేసిందని మండిపడ్డారు. కర్నాటకలో లింగాయత్‌ల నుంచి పూర్తిమద్దతు ఉన్న నాయకుడు యడ్యూరప్ప. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా కూడా యడ్యూరప్పనే ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో సిద్ధూ సర్కారు లింగాయత్, వీరశైవ మతస్తులను ఆకర్షించేందుకు రిజర్వేషన్ల మంత్రాన్ని జపిస్తోంది. ఈ నేపథ్యంలో కర్నాటక ప్రభుత్వ తీరును తప్పుబట్టిన యడ్యూరప్ప సిద్ధరామయ్య సున్నితమైన అంశాల్లో వేలుపెట్టి సామాజిక వర్గీకరణకు తెరతీస్తున్నారని ఆరోపించారు.ప్రజలను తప్పుదోవపట్టించేందుకు సిద్ధూ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఎక్కడ పర్యటించినా అక్కడ కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని ఆయన ట్రాక్ రికార్డును పరిశీలిస్తే తెలిసిపోతుందని ఆరోపించారు.



కాంగ్రెస్ ఏమైనా చేస్తుంది: దేవేగౌడ

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ దేనికైనా ఎంతదాకైనా వెళ్లేందుకు సిద్ధమైందని మాజీ ప్రధాని దేవేగౌడ ఆరోపించారు.ఎన్నికల వేళ లింగాయత్‌లు, వీరశైవ మతస్తులకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడంతోనే కాంగ్రెస్ పార్టీ వైఖరి అర్థమౌతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఇస్తున్న హామీని నెరవేరుస్తుందో లేదో గానీ.. గతంలో మాత్రం లింగాయత్‌ల రిజర్వేషన్ల అంశాన్ని ఆ పార్టీయే వ్యతిరేకించింది. ఎన్నికలొస్తున్నాయ్ కాబట్టి రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారు. బీఎస్పీతో చేతులు కలిపిన జేడీఎస్ వచ్చే ఎన్నికల్లో మంచిఫలితాలనే రాబడుతుందని దేవేగౌడ అన్నారు.

పాక్ ఐఎస్ఐ సౌకర్యాలతో..
సిక్కు యువతకు ఉగ్రవాదంలో శిక్షణ

- నిరుద్యోగులు, నేరస్తులే ఐఎస్ఐ లక్ష్యం
- కెనడా సహా పలుదేశాల్లోని సిక్కు యువతకు ఎర
- భారత్‌లో దాడులకు ఐఎస్ఐ ట్రైనింగ్
- చర్చలకు సోషల్ మీడియా వేదిక
- పార్లమెంటరీ ప్యానల్‌కు హోంశాఖ నివేదిక



న్యూఢిల్లీ: భారత్‌కు ద్రోహం చేయడమే ప్రధాన లక్ష్యంగా పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోంది. భారీ ఎత్తున ఉగ్రవాద దాడులు జరిగే విధంగా పకడ్బందీగా ప్రణాళికలు రచించింది. పాకిస్తాన్ ఐఎస్ఐ సౌకర్యాలతో సిక్కు యువకులకు ఉగ్రవాదంలో శిక్షణ ఇస్తోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థలు ఇంటర్ నెట్, సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ యువతను రెచ్చగొడుతున్నారని వెల్లడించింది. పాక్ ఇలాంటి ఉగ్ర చర్యలు భారత్ కు సవాల్‌గా మారుతున్నాయని హోంశాఖ పార్లమెంటరీ ప్యానల్‌కు నివేదించింది. పాకిస్తాన్ ఐఎస్ఐ నుంచి ఉగ్రవాద సంస్థలకు ఒత్తిళ్లు వస్తుండటం వల్లే పంజాబ్ తదితర ప్రాంతాల యువతే లక్ష్యంగా ఉగ్రవాద సంస్థలు చర్యలు చేపట్టాయని పేర్కొంది. భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను మరింత చురుగ్గా సాగించేందుకు సిక్కు యువకులను ఎరగా వాడుకుంటున్నట్లు స్పష్టం చేసింది. కెనడా, తదితర దేశాల్లో స్థిరపడిన సిక్కు మతస్తులను కూడా ఉపయోగించుకుని దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది.

ఉగ్ర సంస్థలకు ఐఎస్ఐయే హై కమాండ్

సిక్కు యువకులకు పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ సౌకర్యాలతో ఉగ్రవాదంపై శిక్షణ ఇస్తున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలు, దాడుల కోసం వివిధ నేరాలు చేసిన జైళ్లకు వెళ్లిన వారిని, నిరుద్యోగులను, నేరస్తులను,స్మగ్లర్లను పాకిస్తాన్ కు చెందిన సిక్కు ఉగ్రవాద సంస్థలు ఉపయోగించుకుంటున్నాయని హోంశాఖ తన నివేదికలో వెల్లడించింది.

ఉగ్రసంస్థలపై ప్రత్యేక నిఘా

పాకిస్తాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న లష్కరీ తోయిబా, జైషేమహ్మద్, ఇండియన్ ముజాయిదీన్, సిమీ, అల్- ఉన్మా వంటి సంస్థలపై భారత్ ప్రత్యేక నిఘా ఉంచిందని పార్లమెంటరీ ప్యానల్‌కు నివేదించింది. బీజేపీ నేత మురళీ మనోహర్ జోషీ నేతృత్వంలోని అంచనాల కమిటీకి కేంద్ర హోం శాఖ అత్యున్నత అధికారులు ఈ వివరాలను తెలిపారు. 'కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, అంతర్గత భద్రతా సవాళ్లు, మదింపు, స్పందన యంత్రాంగం' పేరుతో ఈ కమిటీ నివేదికను పార్లమెంట్ ప్యానల్‌కు అందజేశారు. దేశంలో అంతర్గతంగా వామపక్షాలు కూడా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. 2004లో సీపీఐ (మావోయిస్ట్) ఏర్పాటైన నాటినుంచి తమ భావజాలాన్ని మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తున్నట్లు నివేదికలో పొందుపరిచారు.

మయన్మార్ అధ్యక్షుడి రాజీనామా

నైపిడా: మయన్మార్ అధ్యక్షుడు హతిన్ క్యా తన పదవికి బుధవారంనాడు రాజీనామా చేశారు. కేవలం తన ఆరోగ్య కారణాల వల్లే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. మయన్మార్‌కు చెందిన ప్రముఖ నాయకురాలు, హక్కుల నేత ఆంగ్ సాన్ సూకీకి కుడి భుజంగా ఉండే హతిన్ తన పదవి నుంచి వైదొలగారు. ఈ విషయాన్ని అధ్యక్షుడి కార్యాలయం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించింది. అయితే, నూతన అధ్యక్షుడిని వారం రోజుల్లో ఎన్నుకుంటామని అధ్యక్షుడి కార్యాలయానికి చెందిన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీకి చెందిన ఆయన రెండేళ్ల కంటే తక్కువ సమయం పదవిలో ఉన్నారు. మయన్మార్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు రాజీనామా చేస్తే ఉపాధ్యక్షుడు అధ్యక్ష బాధ్యతలు చేపడతారు. అప్పటి నుంచి ఏడు రోజుల్లోగా పార్లమెంట్ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. అప్పటివరకు ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా ఉన్న మింట్ స్వే అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.

ఏపీ వర్సిటీలపై ఉపరాష్ట్రపతి సమీక్ష



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన విశ్వవిద్యాలయం, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేసిన సూచనలకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్, ఆ శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యం, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్‌తో విద్యాసంస్థల ఏర్పాటుపై ఉప రాష్ట్రపతి బుధవారం ఉదయం పార్లమెంటులోని తన కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి వై.ఎస్. చౌదరి, పార్లమెంట్ సభ్యులు, ఏపీ బీజేపీ అధ్యక్షులు కంభంపాటి హరిబాబు కూడా పాల్గొన్నారు. గిరిజన విశ్వ విద్యాలయం మరియు కేంద్రీయ విశ్వ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన క్యాబినెట్ నోట్స్ తయారయ్యాయని, వాటిని పరిశీలన కోసం న్యాయ శాఖకు పంపామని, అక్కణ్నుంచి నోట్ రాగానే క్యాబినెట్‌కు నివేదిస్తామని జవదేకర్ తెలిపారు. న్యాయ శాఖ, లెజిస్లేటివ్ కార్యదర్శులతో కూడా చర్చించి త్వరితగతిన పని పూర్తి చేయాలని వెంకయ్య ఆయనను కోరారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన తాత్కాలిక వసతుల్లో ఈ సంస్థలు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభమయ్యేందుకు కూడా చర్యలు చేపట్టాలనీ సూచించారు. ఇప్పటికే నెల్లూరు సమీపంలోని చవటపాళెం గ్రామం పరిధిలో శంకుస్థాపన చేసిన ఎన్‌సీఈఆర్‌టీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపు చేసిన వెంటనే ఆ సంస్థ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ఉపరాష్ట్రపతి జవదేకర్‌కు చెప్పారు. అలాగే మైసూర్‌లో ఉన్నటువంటి ఓరియంటల్ లాంగ్వేజెస్ కేంద్రానికి డైరెక్టర్ నియామకాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలనీ, దాని తెలుగు శాఖను తెలుగు రాష్ట్రాల్లో ఉపయుక్తంగా ఉన్న ఎక్కడైనా ఏర్పాటు చేయాలనీ ఆయన కోరారు. న్యూఢిల్లీలోని జవహర్ లాల్ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకయ్య సూచించారు. సంబంధిత అధికారులతో ఆయన గురువారం సమావేశమై చర్చించనున్నారు. ఉపరాష్ట్రపతి సూచనలు, సలహాలన్నిటికీ సానుకూలంగా స్పందించిన జవదేకర్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యాన్ని ఆదేశించారు.

రెండు నిమిషాల్లోనే..

- వెల్‌లో టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీల ఆందోళన
- బీహార్‌కు ప్రత్యేక హోదా కావాలని పప్పూ యాదవ్ వాయిదా తీర్మానం
- సభ ఆర్డర్‌లో లేదని అవిశ్వాసం చేపట్టని స్పీకర్

ముందుకు వెళ్లని అవిశ్వాసం నోటీసు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మళ్లీ అదే సీన్. పాత కథే పునరావృతమైంది. అవిశ్వాస తీర్మానం నోటీసుపై లోక్‌సభలో చర్చ జరగలేదు. కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను బుధవారం కూడా చర్చ చేపట్టలేకపోయారు. పార్లమెంటు సమావేశాలు ఉదయం 11గంటలకు ప్రారంభంకాగానే విపక్షాల ఆందోళనతో క్షణాల వ్యవధిలోనే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్, టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఎంపీల ఆందోళనల మధ్యనే అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన నోటీసులను లోక్‌సభలో చదివివినిపించారు. టీడీపీ ఎంపీ తోట నరసింహం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి అవిశ్వాస తీర్మానాలను ఇచ్చారని ఆమె సభకు తెలిపారు. సభ సజావుగా ఉంటే దీనిపై తదుపరి చర్యలు చేపడతామని ఆమె ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలా లేదా అనే దానికి మద్దతిస్తున్న 50 మంది ఎంపీలు తమ తమ స్థానాల్లో నిలబడితే లెక్కించాల్సి ఉందన్నారు. అయితే అదే సమయంలో టీఆర్ఎస్, అన్నాడిఎంకె పార్టీలు, జన్ అధికార్ లోక్ తాంత్రిక్ పార్టీ ఎంపీ పప్పుయాదవ్ వెల్‌లో ఆందోళన కొనసాగించాయి. కావేరి నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు, రిజర్వేషన్ల కోటా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జన్ అధికార్ లోక్ తాంత్రిక్ పార్టీ ఎంపీ పప్పుయాదవ్ వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలుచేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ , వారిని తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని ఆమె పదే పదే విజ్ఞప్తి చేశారు. కనీసం తనకు ఎంపీలెవరూ కనిపించడం లేదన్నారు. ఇలా ఉంటే ఎంపీల సంఖ్యను ఎలా లెక్కించాలని నిస్సహాయత వ్యక్తం చేశారు. తీర్మానానికి మద్దతిస్తున్న ఎంపీలను లెక్కించాల్సి ఉందని, వెల్‌లో ఉన్న సభ్యులు కూర్చోవాలని కోరారు. అయినా వెల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న టిఆర్ఎస్, అన్నాడిఎంకె సభ్యులు పట్టించుకోలేదు. దాంతో సభ కార్యక్రమాలు సజావుగా నడిచే పరిస్థితి లేనందున అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టలేమని స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అవిశ్వాసంపై చర్చకు సిద్ధం: మంత్రి అనంత్‌కుమార్

అవిశ్వాస తీర్మానం సహా అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ లోక్‌సభలో స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. విపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని కోరారు. లోక్‌సభలోనూ, బయటా మోడీ ప్రభుత్వానికి ప్రజల పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు.

అవిశ్వాసానికి మద్దతుగా కాంగ్రెస్, టీఎంసీ

అవిశ్వాస తీర్మానాలకు మద్దతుగా సభలో కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు, ఆర్జేడీ, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీల ఎంపీలు లేచి నిల్చున్నారు. ప్రత్యేక హోదా పోరాటానికి మద్దతిస్తామని ముందుగానే ప్రకటించిన కాంగ్రెస్, వామపక్షాలు తమ సంఘీభావాన్ని కొనసాగించాయి.

అవిశ్వాసానికి మళ్లీ నోటీసులు

అవిశ్వాస తీర్మానంపై టీడీపీ, వైఎస్సార్సీపీలు మరోసారి స్పీకర్ కు నోటీసు ఇచ్చాయి. తమ అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని రెండు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ తరుపున ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ తరపున ఎంపీ తోటనరసింహం అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. అవిశ్వాస సమయంలో ఎంపీలంతా విధిగా హాజరై మద్దతుగా నిల్చోవాలని విప్ కూడా జారీచేశారు.

బీహార్‌కు ప్రత్యేక హోదా కావాలి: పప్పూ యాదవ్

బీహార్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వాలని జన్ అధికార్ లోక్ తాంత్రిక్ పార్టీ అధ్యక్షుడు ఎంపీ పప్పూ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన దీనిపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో వాయిదా తీర్మానానికి నోటీసు ఇవ్వగా, స్పీకర్ తిరస్కరించారు. దాంతో ఆయన లోక్‌సభ వెల్‌లో నిరసన తెలిపారు. ఓ వైపు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఎంపీలు డిమాండ్ చేస్తున్న తరుణలంలో, బీహార్‌కు కూడా హోదా ఇవ్వాలని ఆందోళనలు ప్రారంభం కావడం గమనార్హం.

రాజ్యసభ వాయిదాల పర్వం

ఇటు రాజ్యసభలోనూ వాయిదాల పర్వం కొనసాగింది. విపక్షాల ఆందోళనతో సభా కార్యక్రమాలు ముందుకుసాగలేదు. ఎస్సీ, ఎస్టీల అంశం, సుష్మాస్వరాజ్ ప్రకటనపై చర్చ జరపాలని కాంగ్రెస్ పక్ష నేత గులాంనబీ ఆజాద్, టీఎంసీ నేత డెరెక్ ఒబ్రెయిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభను నడిపేందుకు తాము సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షాలు సహకరించడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల సహాయమంత్రి విజయ్ గోయల్ అన్నారు, గ్రాట్యుటీ సవరణ బిల్లు, అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు, ట్రిపుల్ తలాక్ లాంటి కీలక బిల్లు సభ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. విపక్షాలు సహకరించాలని కోరారు. అయితే సభలో విపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించారు.

రాజ్యసభ అభ్యర్థులు 'ఆర్థిక' పెద్దలు

- 8 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

న్యూఢిల్లీ: రాజ్యసభ రేసులో పోటీపడుతున్న అభ్యర్థుల్లో అత్యధిక శాతం కుబేరులే. ఆయా అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన సందర్భంలో సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 63 మంది అభ్యర్థుల్లో 87శాతం మంది కోటీశ్వరులే. సరాసరి ఆస్తుల విలువ రూ.122 కోట్లు ఉందని అంచనా. 63 మంది అభ్యర్థుల్లో 55 మంది కోటీశ్వర్లు. రాజ్యసభ అభ్యర్థుల్లో కోటి రూపాయల పైబడి ఆస్తులు కలిగిన వారే అత్యధికులనని ప్రజాతంత్ర సంస్కరణల సమాఖ్య (ఏడీఆర్) అంచనా. అత్యంత ధనికుడిగా జేడీయూ అభ్యర్థి మహేంద్ర ప్రసాద్. అతని ఆస్తులు రూ.4,078 కోట్లు. సమాజ్‌వాదీ పార్టీ తరఫున 4వ సారి బరిలో నిలిచిన బాలీవుడ్ నటి జయాబచ్చన్ రూ.1,001 కోట్లతో రెండోస్థానంలో నిలిచారు. జేడీ-ఎస్ అభ్యర్థి బీ.ఎం. ఫరూఖ్ ఆస్తులు రూ.766 కోట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి ఆస్తులు రూ.649 కోట్లు, తెలుగుదేశం అభ్యర్థి సీఎం రమేష్ రూ.258 కోట్లు ఉన్నాయి. అతి తక్కువ ఆస్తులు కల్గిన వ్యక్తిగా బిజూజనతాదల్ అభ్యర్థి అచ్యుతానంద సమనంత. అతని మొత్తం ఆస్తుల విలువ రూ.4 లక్షలు. మరో అభ్యర్థి భారతీయ జనతాపార్టీ తరఫున బరిలో ఉన్న సమిర్ ఓరాన్‌కు రూ.18 లక్షల విలువ మేర ఆస్తులు ఉన్నట్లు ఏడీఆర్ అంచనా. ఇక పార్టీల వారీగా అభ్యర్థుల ఆస్తుల వివరాలు పరిశీలిస్తే.. బీజేపీ తరఫున బరిలో నిలిచిన 29 మందిలో 26 మంది, కాంగ్రెస్ అభ్యర్థులు 11 మందిలో 10 మంది, తృణమూల్ కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన నలుగురులో ముగ్గురు, టీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన ముగ్గురూ, జూడీయూ, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులూ కోటి రూపాయలు పై బడి ఆస్తులు కల్గి ఉన్నారు.

బీజేపీ అభ్యర్థుల (29) సరాసరి ఆస్తుల విలువ రూ.16 కోట్లు, కాంగ్రెస్ అభ్యర్థుల(11) ఆస్తుల విలువ రూ.66 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల (4) ఆస్తుల విలువ రూ. 1 పైమాటే. 8 మంది అభ్యర్థులపై తీవ్రమైన నేరారోపణలతో పాటు కేసు కూడా ఉన్నాయి. ఇందులో కిడ్నాప్, హత్యాయత్నం, దోపిడీ తదితర కేసులు ఉన్నట్లు అఫిడవిట్ల ద్వారా తెలుస్తోంది.

అవిశ్వాసం పెట్టే నైతిక హక్కు చంద్రబాబుకు లేదు

- ఆయన తీరు వల్లే ఈ సమస్యలంటూ మండిపాటు
- టీడీపీపై విరుచుకుపడ్డ వైసీపీ ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే నైతిక హక్కు చంద్రబాబు నాయుడుకు గానీ, ఆయన పార్టీకి గానీ లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు దుయ్యబట్టారు. తాము ప్రారంభించిన పోరులో మధ్యలో దూరి తనను తాను పోరాట యోధుడిగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండి, ఆ ప్రభుత్వం తీసుకుని నిర్ణయాల్లోనూ భాగం పంచుకుని ఇప్పుడు కేంద్రంపై పోరాడుతున్నామని ఎలా చెబుతున్నారని నిలదీశారు. బుధవారం పార్లమెంటు భవనం ప్రధాన ద్వారం ఎదుట నిలబడి ధర్నా చేసిన వైకాపా ఎంపీలు, సభ వాయిదా పడ్డ తర్వాత విజయ్ చౌక్ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అటు బీజేపీ తీరును, ఇటు తెలుగుదేశం పార్టీ వైఖరిని తూర్పారబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అసలు చిత్తశుద్ధే లేదన్నారు.

చంద్రబాబును బోను ఎక్కిస్తాం: విజయసాయిరెడ్డి

రాజ్యసభ చైర్మన్‌కి వైఎస్సార్సీపీ ప్రత్యేక హోదాపై చర్చ జరగాలని కోరుకుంటుందని వివరించాము. ఈరోజైనా సభ సజావుగా జరపాలని మేము వేడుకున్నాం. 4 సంవత్సరాలుగా ప్రత్యేక హోదా కోసం పోరాడుతోంది మేము. నిజాయితీ కోసం అని ఇద్దరు మంత్రులు బయటకి వచ్చారు. బాబుకు చిత్తశుద్ధి ఉంటే ప్యాకేజీ అడిగే వారు కాదు. హెూదా కోసం పోరాడేవాళ్ళు. చంద్రబాబును బోనులోకి ఎక్కించేంతవరకు, మళ్లీ మళ్లీ తిరిగి చట్టప్రకారం చర్యలు తీసుకునేం తవరకు వైసీపీ చేయాల్సిందంతా చేస్తుంది. ఆయనకు నైతిక విలువల్లేవు. అవిశ్వాసం పెట్టే నైతికత చంద్రబాబు పార్టీకి లేదు. కేంద్ర ప్రభుత్వంలో సభ్యులుగా ఉండి నాలుగేళ్లుగా తీసుకున్న నిర్ణయాలకు తెలుగుదేశానికి కూడా బాధ్యత ఉంది. మీరే ఎన్డీయేలో భాగస్వాములు. ఈ విషయంపై ఏపీ ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. ప్రధానిని కలుస్తా, మంత్రులను కలుస్తా. ఏమైనా చేసే హక్కు నాకుంది. పార్లమెంట్ సభ్యునిగా ఆ హక్కులున్నాయి. ఇదేనా 40 ఏళ్ల చంద్రబాబు అనుభవ సారాంశం. కేంద్రం కట్టాల్సిన పోలవరం ప్రాజెక్టు, ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిక మేరకు రాష్ట్రానికి అప్పగించాల్సివచ్చిందని కేంద్రం నేను అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చింది. ఈ విషయం రాజ్యసభ రికార్డుల్లో ఉంది. నేను చెప్పింది తప్పైతే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు. పరిస్థితులకు అనుగుణంగా చంద్రబాబు ఎలాంటి అబద్ధాన్నైనా చెప్పగలరు. స్వార్ధ ప్రయోజనాల కోసం ఏమైనా చేయగలరు. ప్రధానిని నేను కలిసేందుకు ఒక కారణం ఉంది.చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అవినీతికి పాల్పడుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో లక్ష కోట్లకుపైగా అప్పులు పెరిగాయి. రాష్ట్ర విభజన సమయంలో 97 వేల కోట్ల అప్పు ఉంది. ఈ రోజు 2 లక్షల 25వేల కోట్ల అప్పుంది. నాలుగేళ్లలో లక్షా 25 వేల కోట్లు ఏం ఖర్చు చేశారు. డబ్బంతా ఎక్కడికెళ్లింది. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులెక్కడికెళ్లాయి.

రాష్ట్రంలో పన్ను రూపంలో వచ్చిన నిధులు ఎక్కడికెళ్లాయి. అవన్నీ మీ జేబుల్లోకి వెళ్లాయి. మీరు అవినీతికి పాల్పడ్డారు. ఆ డబ్బంతా హవాలా ద్వారా విదేశాలకు తరలించారు.

చెప్పిన తేదీన రాజీనామాలు చేస్తాం: మేకపాటి

సభ ఇలాగే జరుగుతుందని నేను ముందు నుంచి ఊహించాను. ఎక్కడా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఎవరు ద్రోహం చేశారో ప్రజలకు తెలుసు. ప్రజల్ని వంచించింది, మోసం చేస్తున్నది తెలుగుదేశం పార్టీయే. సినీరంగ ప్రముఖులు పోసాని కృష్ణమురళి, తమ్మారెడ్డి భరద్వాజ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి తీరును ఎండగట్టారు. మిమ్మల్ని నమ్మితే అన్యాయం జరుగుతుందని వారు కూడా చెబుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. తీర్మానంపై చర్చిద్దామనే ధ్యాస కూడా లేదు. కొద్ది రోజుల్లో సభను నిరవధికంగా వాయిదా వేసే అవకాశం లేకపోలేదు. మేం ముందే ప్రకటించిన తేదీ నాటికి స్పీకర్ ఫార్మాట్లోనే రాజీనామాలు చేస్తాం.

రాజకీయ లబ్ది కోసమే: వరప్రసాద్

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు నాయుడు ఇప్పుడు హోదా కోసం పోరాటం అంటున్నారు. మేం గత నాలుగేళ్లుగా ఈ ప్రత్యేక హోదా పోరాటంలో నిమగ్నమై ఉన్నాం. ప్రజల్ని ఎలా మోసం చేయాలా అని చంద్రబాబు ఆలోచిస్తున్నారు. తనకు 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని గొప్పలు పోతున్నారు. నిజానికి అది అవమానంగా భావించాలి. అవిశ్వాస తీర్మానం చర్చకు రాకపోతే మా ఎంపీలంతా కలిసి రాజీనామాలు సమర్పిస్తాం.

వైసీపీని అనుసరిస్తున్న తెలుగుదేశం: వైవీ సుబ్బారెడ్డి

అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 50 మందికి పైగా సభ్యులు నిల్చున్నారు. కానీ బీజేపీ ఏదో ఒక నెపంతో సభలను వాయిదా వేస్తోంది. ఈ రోజు మిగితా పార్టీల సభ్యులు కూడా మద్దతు తెలిపారు. ఏ మొహం పెట్టుకుని మిగతా పార్టీల సభ్యులు టీడీపీకి మద్దతిస్తారు..? కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున్ ముందే వైఎస్సార్సీపీ మా మద్దతు అడిగారని వారికి చెప్పారు.

జమ్మూలో ఉగ్రదాడి

- ఇద్దరు పోలీసులు.. ముగ్గురు జవాన్ల వీర మరణం
- ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదుల హతం
- మరో ఇద్దరి కోసం గాలింపు



శ్రీనగర్: జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి తెగబడ్డారు. కుప్వారా జిల్లాలో మిలిటెంట్ల జరిపిన కాల్పుల్లో ఇద్దరు పోలీసులు, మరో ముగ్గురు జవాన్లు అమరులు కాగా.. ఒక పోలీసు గాయపడ్డారు. కుప్వారా జిల్లాలోని ఆరాంపొరా ప్రాంతంలో మంగళవారం మిలిటెంట్లు కాల్పులకు తెగబడగా.. భద్రతాబలగాలు, జమ్ము కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా మిలిటెంట్ల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టారు. కూంబింగ్‌లో నలుగురు మిలిటెంట్లు హతమయ్యారు. అయితే ఆరాంపొరా పరిసర ప్రాంతాల్లోనే మగ్గిన మిలిటెంట్లు బుధవారం పోలీసులపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు.

వెంటనే తేరుకున్నా అప్పటికే ప్రాణనష్టం జరిగిపోయింది. దీంతో జమ్ము పోలీసులు, భద్రతా బలగాలతో సంయుక్తంగా మిలిటెంట్ల ఏరివేతకు కూంబింగ్ చేపట్టారు. ఆరాంపొరలోని దట్టమైన అరణ్యప్రాంతంలో మిలిటెంట్లు దాడి చేసినట్లు తెలుస్తోంది. కుప్వారా జిల్లాకేంద్రానికి 12 కి.మీ దూరంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు. అయితే మిలిటెంట్ల దాడిలో ఇంకా ఎంతమంది జవాన్ల ప్రాణాలు కోల్పోయారనేది అధికారులు ధృవీకరించాల్సి ఉంది. దాడిలో అమరులైన ఇద్దరు పోలీసులు దీపక్, అష్ఫలుగా గుర్తించారు.

దాడికి ముందే ప్లాన్

భారత్, పాకిస్తాన్ మధ్య ఉన్న నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వహిస్తున్న జవాన్లే లక్ష్యంగా మిలిటెంట్లు దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. శంభీపూర్ అటవీ ప్రాంతంలోని రెండు గట్లు దాటి వచ్చిన మిలిటెంట్లు దాదాపు 8 కి.మీ రహస్య ప్రదేశాల నుంచి వచ్చినట్లు సమాచారం. అయితే దాడులకు ముందు కాశ్మీర్ లోయ ప్రాంతంలోని తమ అనుచరులతో కలిసి ముందు ప్రణాళికలు వేసినట్లు తెలుస్తోంది. నియంత్రణ రేఖదాటి వచ్చిన ఉగ్రవాదులు కుప్వారా నగరానికి సమీపంలో పోలీసులకు తారసపడినట్లు అధికారులు తెలిపారు. పోలీసులను చూసిన వెంటనే సమీప ప్రార్ధన మంది రంలోకి.. ఆ తర్వాత అటవీలోకి పారిపో యినట్లు పేర్కొన్నారు. అయితే అప్పటికే నలుగురు మిలిటెంట్లు ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు తెలిపారు. మరో ఇద్దరు మిలిటెంట్లు మాత్రమే ప్రాణభయంతో అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు వెల్లడించారు. వారికోసం ఇంకా ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

జవాన్లకు ముఫ్తీ నివాళి

మిలిటెంట్ల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు, భద్రతా సిబ్బందికి జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ నివాళులర్పించారు. దాడికి తెగబడిన ఉగ్రవాదులను ఎట్టిపరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఇక బ్రహ్మాస్త్రమే

- మా బ్రహ్మాస్త్రం ప్రజలే..
- కేంద్రం తీరుపై విరుచుకుపడ్డ టీడీపీ ఎంపీలు
- సత్య హరిశ్చంద్రుడి వేషంలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నాలుగవ రోజు కూడా అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ స్వీకరించకపోవడంపై తెలుగుదేశం పార్టీ ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మంత్రి పదవులకు రాజీనామా, ఎన్డీయే కూటమి నుంచి వైదొలగడం, చివరకు అవిశ్వాస తీర్మానం వంటి ఎన్ని అస్త్రాలు ప్రయోగించినా కేంద్రం ప్రభుత్వంలో చలనం లేకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇక తమ దగ్గరున్న అస్త్రాలన్నీ అయిపోయాయని, ఇక బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తామని వ్యాఖ్యానించారు. ప్రజలే తమ బ్రహ్మాస్త్రమని, ఓటు ద్వారా వారిచ్చే తీర్పే ఆ అస్త్రాన్ని ప్రయోగించడమని వివరించారు. ప్రతి రోజు మాదిరిగా ఉదయం గం. 10.00 సమయానికి పార్లమెంటు ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న ఎంపీలు, కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ధర్నాకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ప్రతి రోజూ ఏదో ఒక వేషధారణతో, వివిధ రకాల కళారూపాలతో ఆకట్టుకునే చిత్తూరు ఎంపీ శివప్ర సాద్, బుధవారం సత్య హరిశ్చం ద్రుడి వేషంతో పార్లమెంటుకు చేరు కున్నారు. తాను వారణాసి నుంచి వస్తున్నానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం బానిసగా మారి ఎన్ని కష్టాలకైనా ఓర్చుకున్న సత్య హరిశ్చంద్రుడినని చెప్పుకొచ్చారు. ప్రధాని మోడీ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం కూడా వారణాసియేనని, ఆయన సైతం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఇందుకోసం ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కోవాలని హితవు పలికారు. గాంధీ విగ్రహం దగ్గర ధర్నా అనంతరం పార్లమెంటు ఉభయ సభల్లో తమ తమ సీట్లలోనే లేచి నిలబడి తమ నిరసన కొనసాగించారు. మధ్యాహ్నం గం. 12.00 సమయంలో అవిశ్వాస తీర్మానం అంశం చర్చకు రాగానే, ఆ తీర్మానానికి మద్దతుగా లేచి నిలబడ్డారు. కానీ స్పీకర్ సభ సజావుగా సాగడం లేదన్న సాకుతో వాయిదా వేయడంతో ఎంపీలంతా ఆగ్రహానికి లోనయ్యారు. అనంత రం వారిలో కొందరు విజయ్ చౌక్ మీడియా పాయింట్ చేరు కుని, తమ ఆగ్రహాన్ని, నిరసనను మాటల్లో వ్యక్తపరిచారు.



ఏపీ అంటే కనీస గౌరవం లేదు: తోట

కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంటే కనీస గౌరవం లేదు. మా అవిశ్వాస తీర్మానాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. నాలుగవ రోజు కూడా మళ్లీ అవిశ్వాస తీర్మానం ఇచ్చాం. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీల నినాదాలను సాకుగా చూపి సభను మళ్లీ వాయిదా వేశారు. ఇదంతా చూస్తుంటే ఏదో గూడుపుఠానిలా కనిపిస్తోంది. ఒక రాజకీయ ఎత్తుగడతో మా అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు రాకుండా అడ్డుకుంటున్నట్టుగా అనిపిస్తోంది. సభ సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంది. ఈ క్రమంలో అవసరమైతే సభను అడ్డుకుంటున్నవారిని సస్పెండ్ కూడా చేయవచ్చు. కానీ ఇదేమీ చేయకుండా సభలో వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. అయినా సరే అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు స్వీకరించే వరకు మా ప్రయత్నాన్ని కొనసాగిస్తాం.

సహనాన్ని పరీక్షించకండి: మురళీమోహన్

నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఎన్డీయే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ ఎత్తుగడ వేసినట్టు అర్థమవుతోంది. మా సహనాన్ని పరీక్షించకండి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఏ గతి పట్టిందో చూశారు కదా. మీకు కూడా అదే గతి పడుతుంది. ఇప్పటికైనా అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపండి. సభ సజావుగా సాగేలా చూడండి.

దున్నపోతు మీద వర్షం కురిసినట్టే: అవంతి

బీజేపీ పాలకులు సున్నితత్వాన్ని కోల్పోయారు. సంఖ్యాబలం ఉంది, మాకేంటి అనే ధీమాతో ఉన్నారు. కానీ వారు రోజుకు లక్ష ఓట్లు కోల్పోతున్నారు. ప్రజల్లో రోజురోజుకీ వ్యతిరేకత పెరిగిపోతోంది. ఏపీకి జరిగిన అన్యాయాన్ని మిగతా రాష్ట్రాల ప్రజలు కూడా గమనిస్తున్నారు. ఇంత జరుగుతున్నా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు, మా సమస్యను వారు పట్టించుకోవడం లేదు. కేంద్రానికి దమ్ముంటే ఇప్పటికైనా చర్చకు ముందుకు రావాలి. ఏమిచ్చారో స్పష్టం చేయాలి. సోషల్ మీడియాలో ఏవేవో లెక్కలు చెప్పడం కాదు. ఆపరేషన్ గరుడ అంటూ ప్రచారం చేయడం కాదు. ప్రజల ముందు ఏ మీడియా ప్రచారం నిలబడదు. ప్రజలు తమ ఓటుతో తగినరీతిలో బుద్ధి చెబుతారు.

నమ్మకద్రోహం చేస్తారనుకోలేదు: మాగంటి

భారతీయ జనతా పార్టీ నమ్మకద్రోహం చేస్తుందనుకోలేదు. మమ్మల్ని బలి చేసినా ఫరవాలేదు. కానీ ప్రజలకు అన్యాయం చేయకండి. రానున్న రోజుల్లో నష్టపోయేది బీజేపీయే. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని నెలకొల్పారు. ఆయన పేరు సభలో ప్రస్తావిస్తే మాకు న్యాయం చేస్తారనుకున్నాం. కానీ మొండి చెయ్యి చూపిస్తారని అనుకోలేదు. కేంద్రం బెదిరింపులకు భయపడేది లేదు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు.

కర్నూలులో ఎంప్లాయిమెంట్ జోన్ ఏర్పాటు లేదు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కర్నూలు జిల్లాలో కోస్టల్ ఎంప్లాయీమెంట్ జోన్(సీఈజడ్) ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమ కు ఎలాంటి ప్రతిపాదనా అందలేదని బుధవారం రాజ్యసభలో వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి సీఆర్ చౌదరి ప్రకటించారు. కర్నూలు జిల్లాలో 30 వేల ఎకరాలను సేకరించి అంటులో సీఈజడ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా ప్రతిపాదన మీ మంత్రిత్వ శాఖకు వచ్చిందా అంటూ వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. సీఈజడ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ రాయితీలను ప్రకటించే ప్రసక్తి కూడా లేదనన్నారు.

విశాఖ ఎస్ఈజడ్‌లో ఐటీ టవర్‌కు ఆమోదం

విశాఖపట్నం దువ్వాడలోని స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో (ఎస్ఈజడ్) ఐటీ టవర్ నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి చౌదరి తెలిపారు. విజయ సాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... ఎగుమతుల ప్రోత్సాహానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర కార్యక లాపాల కోసం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందించే అసైడ్ పథకం కింద విశాఖపట్నంలో ఎస్ఈజడ్ లో ఐటీ టవర్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఇంకా ఎలాంటి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. ఈ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తవుతుందన్న ప్రశ్నకు చౌదరి జవాబు దాట వేశారు.

ఆకృత్యాల కేసులను నీరుగారుస్తున్న కేంద్రం



న్యూఢిల్లీ: దళితులపై ఆకృత్యాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందు కు వీలుగా ఎస్సీ, ఎస్టీ చట్టానికి మరిన్ని కోరలు బిగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ బుధవారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పును అడ్డుపెట్టుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ఈ చట్టం కింద అమాయకులు బలికాకుండా చూడాలని కోర్టు తీర్పు ఇచ్చిన మాట నిజమే కానీ, దీని ముసుగులో నిజంగా ఆకృత్యాలకు పాల్పడిన వారిపై చర్యలు లేకుండా చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై ఆకృత్యాలు పెరిగాయనీ, ముఖ్యంగా, గో రక్షకులు జరుపుతున్న దాడులను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. కోర్టు తీర్పును సమీక్షించాలని పిటిషన్ దాఖలు చేయాలనీ, లేదా, చట్టాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆధార్‌పై పవర్ పాయింట్



న్యూఢిల్లీ: ఆధార్ కార్డుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసేందుకు ఆ సంస్థ సీఈఓకి అనుమతి ఇవ్వాలని సుప్రీంకోర్టును కేంద్రం కోరింది.ఆధార్ కార్డు చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లను రాజ్యాంగధర్మాసనం విచారితోంది. ఆధార్ కార్డుపై పవర్ ప్రెజెంటేషన్‌కి సమయాన్నినిర్ధారించే విషయమై రాజ్యాంగ ధర్మాసనంలోని ఇతర న్యాయమూర్తులను సంప్రదించిన తర్వాత నిర్ణయంతీసుకుంటామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా వెల్లడించారు.తమ ముందు ఉన్న పిటిషన్లలో అనేక సాంకేతిక అంశాలను ప్రస్తావించారనీ, వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవల్సి ఉందని ఆయన అన్నారు.సంక్షేమ పథకాలకుఆధార్ ని అనుసంధానం చేయడంపై తుది గడువును ఈనెల 31గా కోర్టు ఇంతకుముందు నిర్ధారించిన సంగతి తెలిసిందే.

'కాంగ్రెస్‌కు సంబంధం లేదు'



న్యూఢిల్లీ: ఫేస్ బుక్ డేటా ప్రైవసీ కుంభకోణంలో కాంగ్రెస్‌కు ప్రమేయం ఉందని బీజేపీ ఆరోపించగా, అది నిరాధారమైన ఆరోపణ అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సింగ్ సూర్జేవాలా ఖండించారు.ఆ సంస్థ సేవలను బీజేపీ, జనతాదళ్ (యు) 2010లో బాగా ఉపయోగించుకున్నాయన్న సంగతి లోకానికి తెలసని సూర్జేవాలా అన్నారు.తమ పార్టీ అధ్యక్షుడు కేంబ్రిడ్జ్ అనాలటికా సేవలను ఎన్నడూ వినియోగించుకోలేదని ఆయన అన్నారు. బీజేపీ బూటకపు వార్తల కర్మాగారమనీ,ఈరోజు మరో బూటకపు కథనాన్ని ఆ పార్టీ వండి వార్చిందని ఆయనఆరోపించారు.ఆసంస్థకు చెందిన భారతీయ భాగస్వామి ఒవ్లీన్ బిజినెస్ ఇంటిలిజెన్స్ ను బీజేపీ మిత్రపక్షానికిచెందిన ఒక ఎంపీ కుమారుడు నడుపుతున్నారని సూర్జేవాలా ఆరోపించారు.కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ సంస్థ సేవలను 2009లో వినియోగించుకున్నారని ఆరోపించారు.

క్రీడాప్రభ

యూకీకి రెండో విజయం



మియామి: భారత ఆశా కిరణం యుకీ బాంబ్రి మియామి మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో మరో విజయం సొంతం చేసుకున్నాడు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో స్వీడన్ క్రీడాకారుడు ఎలియాస్ ఎమిర్‌ను 7-5, 6-2 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి రెండోది చివరిదైన క్వాలిఫైయింగ్ రౌండ్‌ను అధిగమించాడు. ప్రపంచ ర్యాంకర్ 133 ఎమిర్‌తో తలపడటం ఇది రెండో సారి. మొదటి సారి 2015 ఆట్ఫోస్‌లో ఎమిర్‌తో తలపడి ఓటమి చెందాడు. భారత డేవిస్ కప్ అందుకున్న వాడిలో ఒకడుగా ఉన్న యుకీ, ప్రతిష్ఠాత్మక ఇండియన్ వెల్స్‌కు అర్హత సాధించి ప్రపంచ ర్యాంకర్ 12. ల్యూకాస్ పౌవుల్లేను ఖంగు తినిపించాడు. మియామి టోర్నీలో తదుపరి మ్యాచ్‌కు యుకీకి అనుకూలంగా డ్రా వెలువడింది. ప్రపంచ ర్యాంకు 75 క్రీడాకారుడు మీర్జా బాసిక్‌తో యుకీ తలపడనున్నాడు. ఈ రౌండ్‌ను యుకీ దాటగలిగితే.. యుకీ ప్రపంచ ర్యాంకు 11 క్రీడాకారుడు, ఎనిమిదో సీడ్ అమెరికన్ జాక్ సాక్‌ను ఢీకొనాల్సి ఉంటుంది. సింగిల్స్‌లో భారత తరపున బరిలో ఉన్న ఒక ఒక్క ఆటగాడు యుకీ బాంబ్రి. డబుల్స్‌లో రోహన్ బోపన్న, ఎడ్వర్డ్ వస్సెలిన్(రష్యా) జోడి, ఆడ్రియన్ మన్నారినో (ఫ్రాన్స్), డేనియల్ మెదదేవ్(రష్యా)లతో తలపడనున్నారు.

ఐపీఎల్‌లో డీఆర్ఎస్

- ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా

ముంబై: టీ20 అంతర్జాతీయ మ్యాచుల్లో డీఆర్ఎస్ (అంపైర్ నిర్ణయంపై సమీక్ష జరిపే పద్ధతి)ని ఈ ఏడాది జరిగే ఐపీఎల్‌లో కూడా ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు వివరాలను ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా బుధవారం మీడియాతో జరిపిన భేటీలో వెల్లడించారు. మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయాన్ని ఏ జట్టయినా సవాలు చేస్తే టీవీ రిప్లై వ్యవస్థ ద్వారా ధృవీకరించుకోవచ్చని ఆయన తెలిపాడు. టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఇన్నింగ్స్‌ల్లో ప్రతీ జట్టుకు ఒక మారు అంపైర్ నిర్ణయం సవాలు చేయడానికి అవకాశం ఉంటుంది. ఇదే తీరును ఐపీఎల్‌లో కూడా అమలు చేయనున్నారు. టీ20 లీగ్, టాటా నెక్సాన్‌తో కలిసి మూడేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకొందని శుక్లా ఈ సందర్భంగా చెప్పారు. ప్రతీ ఐపీఎల్ గేమ్‌లో మంచి స్ట్రైక్ రేట్‌తో నిలిచిన ఆటగాడికి రివార్డులు ఇవ్వడంతోపాటు ఓవరాల్‌గా టోర్నీలో అత్యుత్తమ స్ట్రైక్ రేట్‌తో నిలిచిన ఆటగాడికి ఒక నెక్సాన్ కారును బహూకరించనున్నారు.

షమీపై అవినీతి నిరోధక విభాగం నివేదిక కోసం చూస్తున్నాం

మహ్మద్ షమీ ఐపీఎల్‌లో పాల్గొనే అవకాశాలపై శుక్లా వ్యాఖ్యానిస్తూ... బోర్డు అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్‌కుమార్ నుంచి నివేదికకోసం బీసీసీఐ ఎదురు చూస్తున్నదని పేర్కొన్నారు. షమీ దుబాయ్‌లో అలీష్బా నుంచి సొమ్మును అందుకున్నాడని ఆయన భార్య హసీనా జహాన్ చేసిన ఆరోపణలపై ఒక మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు శుక్లా బదులిస్తూ.. అలీష్బాను బోర్డు అవినీతి నిరోధక విభాగం విచారించిందని.. ఆమె షమీని కలుసుకున్నట్లు చెప్పింది కాని తాను డబ్బును షమీకి ఇవ్వలేదని తెలిపిందని వెల్లడించారు.

ముక్కోణపు టీ 20 సిరీస్

నేడే ముహూర్తం

తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో కౌర్‌సేన ఢీ

ఉదయం 10 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్ చానెల్లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ముక్కోణపు టీ20 టోర్నీకి నేడు తెరలేవనుంది. ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళా జట్టు ఆస్ట్రేలియా జట్టును ఢీకొన నుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో ఆడిన వన్డే సిరీస్‌లో వైట్ వాష్‌ైన భారత మహిళా క్రికెట్ జట్టు ముక్కోణపు సిరీస్‌లో తిరిగి పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించి ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 3-1 గెలుచుకొన్న ధైర్యంతోనే ఈ ముక్కోణపు సిరీస్‌లోకి భారత్ అడుగిడుతోంది. ఈ సిరీస్‌లో పాల్గొంటున్న మరో దేశం ఇంగ్లండ్. ఈ టోర్నీలో అన్ని మ్యాచ్‌లు ముంబైలోని బ్రాబోర్న్ నేషన్ స్టేడియంలో జరుగనున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో ఆడిన మూడు వన్డేల్లో తొలి మ్యాచ్‌కు హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యం వహించగా, రెండో, మూడో వన్డేలకు మిథాలి రాజ్ నేతృత్వం వహించింది. ఇద్దరి సారథ్యంలో కూడా జట్టు ఆస్ట్రేలియా జట్టుపై చెప్పుకోతగ్గ పోరాట పటిమను చాటలేకపోయింది. ప్రస్తుత సిరీస్ తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థి అదే జట్టు కాగా... ఫార్మాట్ మాత్రమే భిన్నం. ఇక భారత జట్టు బ్యాటింగ్‌ను పరిశీలిస్తే ఇటీవల ఆస్ట్రేలియాపై వన్డేల్లో వరుసగా అద్భుతంగా రాణించిన స్మృతి మంధాన నేటి మ్యాచ్‌లో తన దూకుడును ప్రదర్శిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో అంతగా పరుగులు చేయనప్పటికి. రెండో, మూడో మ్యాచుల్లో 67, 52 పరుగులు చేసి భారత జట్టు సాధించిన స్కోరులో కీలక భూమిక పోషించింది. ఆస్ట్రేలియా పేస్ బౌలర్లను నిలువరించాలంటే భారత ప్రధాన బ్యాట్స్‌వుమన్లు తప్పనిసరిగా రాణించాల్సిన అవసరముంది.

ఇతర బ్యాట్స్‌వుమన్లలో హర్మన్ ప్రీత్‌కౌర్, మిథాలి రాజ్, ఆల్ రౌండర్ వేదా కృష్ణమూర్తి, చివరలో మెరుపులు మెరిపించే పూజా వస్త్రాకర్, జెమిమా రోడ్రిగ్స్ పూర్తి స్థాయిలో రాణిస్తే భారత్‌కు తిరుగు ఉండదు.

బౌలింగ్‌లో జులన్, శిఖాలే కీలకం

అనుభవజ్ఞులైన జులన్ గోస్వామి, శిఖా పాండేలు భారత జట్టు బౌలింగ్‌లో కీలకం కానున్నారు. పాండే మూడు వన్డేల్లో కలిపి 4 వికెట్లు తీసి పర్వాలేదనిపించింది. మిగతా బౌలర్లలో స్పిన్నర్ పూనం, పేసర్ హర్మన్ ప్రీత్ కౌర్ కీలక సమయాల్లో అనుకున్నంతగా ఆదుకోలేకపోయారు. స్పిన్నర్ రాజేశ్వరి, పేసర్ దీప్తి శర్మలు పూర్తి స్థాయి సామర్థ్యాలను చాటాల్సి ఉంది. మొత్తానికి మరింత పదును పెంచి బౌలింగ్ దాడిని చేస్తేనే ఆస్ట్రేలియా బ్యాట్స్‌వుమన్లను చెక్ పెట్టగలదు. దక్షిణాఫ్రికాలో ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ, లెగ్ స్పిన్నర్ పూనం యాదవ్‌లు భారత గెలుపులో కీలక భూమిక పోషించారు. నేటి మ్యాచ్‌లో తమ బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను నిలువరిస్తే భారత గెలుపు సుళువే.

ఏక్తా బిస్త్ స్థానంలో రాజేశ్వరీ

భారత జట్టులో స్వల్ప మార్పు జరిగింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఎడమ చేతి వేలికి గాయం కావడంతో ముక్కోణపు సిరీస్‌లో ఆడలేకపోవడంతో.. ఆమె స్థానంలో మరో ఎడమచేతి వాటం స్పిన్నర్ రాజేశ్వర్ గ్యెక్వాడ్‌కు జట్టులో స్థానం కల్పించారు.

ఆ రెండు జట్లు పటిష్టమైనవే : కౌర్

'టోర్నీలో పాల్గొంటున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లతో పోలిస్తే భారత్ టీ20ల్లో బలహీనంగా ఉంది. ఈ ఫార్మాట్‌ను మేము ప్రాక్టీస్ చేస్తున్నా ము. ప్రపంచ కప్ లక్ష్యంగా ప్రతీరోజు కొత్త పద్ధతులను, మెళుకువలను నేర్చుకుంటు న్నాము. ఆ రెండు జట్లు పటిష్టమైనవి అయినప్పటికి వారికి గట్టి ప్రతిఘటన మానుంచి ఎదురవుతుంది' అని భారత జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వ్యాఖ్యానించింది. టీ20 పొట్టి ఫార్మాట్, వందశాతం మా సామర్థ్యాన్ని చాటుతాం. మాజట్టు క్రీడాకారిణులకు కూడా ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాము అని కౌర్ బుధవారం మీడియాతో పేర్కొంది.

ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేం

ఇప్పటికే భారత్‌పై వన్డే సిరీస్‌ను గెలిచి మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆస్ట్రేలియా తన దూకుడును ముక్కోణపు సిరీస్‌లో కూడా కొనసాగిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. కెప్టెన్ మెగ్ లానింగ్ వన్డే సిరీస్‌లో అంతగా రాణించలేకపోయినప్పటికి ముక్కోణపు సిరీస్‌లో తన పరుగుల దాహాన్ని తీర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది. వికెట్ కీపర్ అలిస్సా హీలి, నికోలి బోల్టన్, ఎల్లిసే పెర్రి, రాచెల్ హేన్స్‌లతో సహా ఆ జట్టు చివరి క్రీడాకారిణి బ్యాటింగ్‌లో భారత బౌలర్లపై దాడికి సిద్ధంగా ఉన్నారు. ఇక వారి బౌలింగ్ కూడా భారత జట్టును మించిపోయింది. భారత పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండి బ్యాటింగ్‌కు ఊతమిస్తాయి. అయితే ఆస్ట్రేలియన్లు మన వ్యూహాన్ని మనకే తిప్పికొట్టి విజయం సాధించారు. ఆసీస్ స్పిన్నర్లు జెస్ జొనాస్సెన్, అమండా వెల్లింగ్‌టన్, అష్లేహ్ గార్డెనర్‌లను భారత్ బ్యాట్స్‌వుమన్లు దీటుగా ఎదుర్కొంటేనే నేటి మ్యాచ్‌పై భారత విజయావకాశాలు మెరుగుపడతాయి.

జట్లు: భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్) మిథాలి రాజ్, వేదా కృష్ణమూర్తి,జెమీమా రోడ్రిగ్స్, ఆంజు పాటిల్, దీప్తి శర్మ, తానియా బాటియా(వికెట్ కీపర్), పూనం యాదవ్, రాజేశ్వరీ గ్యెక్వాడ్, జులన్ గోస్వామి, శిఖా పాండే, పూజా వస్త్రాకర్, రుమేలి ధార్, మోనా మేశ్రమ్.

ఆస్ట్రేలియా: మెగ్ లానింగ్(కెప్టెన్, రాచెల్ హేన్స్(వైస్ కెప్టెన్), నికోలా కేరి, ఆష్లేహ్ గార్డ్‌నెర్, అలీస్సా హీలి, జెస్ జోనాస్సెన్, డెలిస్సా కిమిన్స్, సోఫీ మోలినెక్స్, బెత్ మూనె, ఎలిస్సె పెర్రీ, మేగన్ షట్, నవోమి స్టాలెన్‌బెర్గ్, ఎలిసె విలాని, అమండా జేడ్ వెల్లింగ్టన్

భారత్‌ను తక్కువ అంచనా వేయం : లానింగ్

ఈ ఫార్మాట్లో భారత్ మంచి రికార్డును కలిగివుంది. ఇంగ్లండ్‌ను కూడా తక్కువ అంచనా వేయం. మేము బాగా ఆడాలని అనుకుంటున్నాము. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్‌లో లభించిన విజయం మాలో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. టీ20 అంతర్జాతీయ మ్యాచులు వేరు. చివరి నిమిషంతో ఫలితం తారుమారవుతుంది' అని ఆసీస్ కెప్టెన్ లానింగ్ అంది. మూడు జట్లలో ఏది ఉత్తమమైనది చెప్పడం కష్టం అని లానింగ్ పేర్కొంది.







రబాడాపై నిషేధం ఎత్తివేత తప్పు

- విచారణలో నా అభిప్రాయాలు తెలుసు కోలేదు
- ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పేసర్ రబాడాపై విధించిన రెండు మ్యాచుల నిషేధాన్ని ఐసీసీ ఎత్తి వేయటాన్ని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తప్పు పట్టారు. నిషేధం ఎత్తివేతకు ముందు ఐసీసీ విచారణ కమిటీ తనను కూడా విచారించాల్సి ఉండాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. సఫారీలతో మూడో టెస్టు నేడు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం స్మిత్ మీడియాతో మాట్లాడాడు. ఇసుకలో గీసిన గీత మాదిరిగా ఈ వ్యవహారం కొనసాగిందని, ఐసీసీ తీరును తప్పుబట్టారు. విచారణ కమిటీ రబాడా అప్పీల్‌ను విచారించిన సమయంలో తన అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాల్సి ఉండాల్సిందన్నాడు. రెండో టెస్టులో స్మిత్ వికెట్‌ను తీసిన అనంతరం రబాడా తన భుజంతో స్మిత్‌ను ఢీకొట్టాడు. దీనిపై సీరియస్‌గా స్పందించిన ఐసీసీ తర్వాత రెండు టెస్టుల నిషేధాన్ని మ్యాచు ఫీజులో కోతను రబాడాపై విధించింది. రబాడా తాను తప్పు చేయలేదని ఐసీసీకి తిరిగి అప్పీల్ చేసుకున్నాడు. అప్పీల్‌ను విచారించిన ఐసీసీ రబాడాపై నిషేధాన్ని ఎత్తి వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఐసీసీ నిర్ణీత ప్రమాణాలతో పనిచేస్తోంది. ఆ ప్రమాణాల అమలుకు ఐసీసీ కట్టుబడాలి అని స్మిత్ అన్నాడు. వీడియోలో తనను భౌతికంగా ఢీకొన్న తీరు స్పష్టంగా కన్పిస్తోందన్నాడు.

టెస్టుల్లో కోహ్లీకి పుజారా తీసిపోడు

సౌరవ్ గంగూలీ

కోల్‌కతా: ప్రస్తుతం భారత క్రికెట్లో విరాట్ కోహ్లీ ఎంతో ప్రాముఖ్యమున్న ఆటగాడని, అదేవిధంగా చటేశ్వర్ పూజారా కూడా అంతే ముఖ్యమైన ఆటగాడని మాజీ భారత కెప్టెన్ సౌరవ్ గంగూలి అన్నాడు. 'విరాట్ కోహ్లీ రికార్డుతో పోలిస్తే పూజారా రికార్డు కూడా తీసి పారేయలేము. అతను చాలా సార్లు మ్యాచ్‌లను గెలిపించాడు. కాని అంత ప్రాముఖ్యాన్ని సంపాదించుకోలేకపోయాడు' అని గంగూలి అన్నాడు. తన క్రికెట్ జ్ఞాపకాలపై రాసిన 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఇనఫ్' అన్న పుస్తకాన్ని బుధవారం, కోల్‌కతాలో ఆవిష్కరిస్తున్న సందర్భంగా గంగూలీ ప్రసంగించారు.

ఫ్రెంచ్ ఓపెన్ ప్రైజ్ మనీ పెంపు



పారిస్: ఫ్రెంచ్ ఒపెన్ టెన్నిస్ టోర్నీ ప్రైజ్ మనీని ఎనిమిది రెట్లు పెంచారు. పురుషుల, మహిళల ఛాంపియన్‌షిప్ విజేతలకు లక్ష యూరోల పెంపుతో కలిపి తలా 2.2 మిలియన్ యూరోలు(2.7 మిలియన్ డాలర్లు) ఇవ్వాలని నిర్ణయించినట్లు టోర్నీ డైరెక్టర్ గయ్ ఫోర్జెట్ బుధవారం మీడియాకు తెలిపారు. మొత్తం టోర్నీలో విజేతలకందించే ప్రైజ్ మనీ మొత్తం విలువ గత ఏడాదితో పోలిస్తే, మూడు మిలియన్ యూరోలు పెరిగి 39.197 మిలియన్ యూరోలు(48 మిలియన్ డాలర్లకు) చేరిందని ఫోర్జెట్ తెలిపాడు. రోలండ్ గ్యారోస్ టోర్నీగా కూడా పేరున్న ఈ ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ ఈ ఏడాది మే 27 నుంచి జూన్ 10వరకు సాగనుంది. అప్పటినుంచే తాజా ఈ పెంపుదల వర్తిస్తుందని ఫోర్జెట్ వెల్లడించారు.

ప్రపంచకప్

విండీస్ అర్హత

హరారే: ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫైయింగ్ టోర్నీలో వెస్టిండీస్ అర్హత సాధించింది. బుధవారం జరిగిన సూపర్ సిక్స్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో వెస్టిండీస్ ఐదు పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై గెలిచింది. మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారటంతో డి/ఎల్ నిబంధనల ప్రకారం విండీస్ గెలిచినట్లు ప్రకటించారు. గతంలో టోర్నీ విజేతగా నిలిచిన స్కాట్లాండ్ నిర్ణీత 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ.. 35.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసిన సమయంలో వర్షం స్లాట్లాండ్ ఛేదనకు అడ్డంకిగా మారింది. దీనితో డక్ వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం మ్యాచ్ స్కాట్లాండ్ చేజారిపోవడంతోపాటు ప్రపంచకప్‌లో ఆడాలన్న ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి.

టాస్ గెలిచిన స్కాట్లాండ్ బౌలింగ్‌ను ఎంచుకుంది. 48.4 ఓవర్లలో విండీస్ 198 పరుగులు చేసి ఆలౌటయింది. ఈవిన్ లూయిస్ 66, సామ్యూల్స్ 51, రాణించగా క్రిస్ గేల్ డకౌటయ్యాడు. స్కాంట్లాండ్ బౌలర్లు చక్కటి లైన్ ,లెంగ్త్‌తో బంతులు సంధించి విండీస్ బ్యాట్స్‌మన్లను కట్టడి చేశారు. సఫ్‌యాన్ షరీప్, బ్రాడ్లీవీల్ తలా మూడు వికెట్లు తీయగా, మైకెల్ లీస్క్ 2 వికెట్లు, అలాస్‌డెర్‌ఈవాన్స్, బెర్రింగ్టన్ చెరో వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన స్కాట్లాండ్ బ్యాట్స్‌మన్లు విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును పెంచుకుంటూపోయారు. 35.2 ఓవర్లు ముగిసే సరికి భారీ వర్షం రావడంతో మిగతా ఆటను రద్దు చేస్తూ డి/ఎల్ నిబంధన ప్రకారం విండీస్ గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు.

ఆఫ్ఘనిస్తాన్, ఐర్లండ్‌ల మధ్య జరిగే మ్యాచ్, యుఎఈ, జింబాబ్వేల మధ్య మ్యాచులు జరుగాల్సి ఉంది. ఆఫ్ఘనిస్తాన్ లేదా ఐర్లండ్ జట్లలో ఏ జట్టు గెలిచినప్పటికి పాయింట్ల పరంగా అవి రెండో స్థానంలోకి చేరలేవు. యుఎఈ, జింబాబ్వే మ్యాచ్‌లో విజేత జింబాబ్వే అయితే ఆ జట్టు నేరుగా రెండో స్థానంలోకి వెళ్లి ప్రపంచ కప్‌కు అర్హత సాధిస్తుంది. ఓడితే.. ఆఫ్ఘనిస్తాన్, ఐర్లండ్ జట్ల నెట్ రన్ రేట్‌తో పోల్చి రెండో క్వాలిఫైయిర్‌ను నిర్ణయిస్తారు.

సంక్షిప్త స్కోర్లు వెస్టిండీస్: 198 ఆలౌట్(48.4ఓవర్లు) స్కాట్లాండ్ 125/5(35.2 ఓవర్లు)



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.